Crime News
ది క్రైమ్ న్యూస్
తెలుగు దినపత్రిక
ఆదివారం, ఏప్రిల్ 12, 2026 | సంపుటి - 20 | సంచిక 209 | వెల - 4రూ | పేజీలు - 12
Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

# హైడ్రా భారీ ఆపరేషన్

## భారీ బందోబస్తు మధ్య ఆక్రమణ కూల్చివేత



సంగారెడ్డి : సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో హైడ్రా భారీ ఆపరేషన్ చేపట్టింది. భారీ పోలీసు బందోబస్తు మధ్య ఆక్రమణలను కూల్చివేస్తోంది. రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి ఈ భారీ ఆపరేషన్‌ను నిర్వహిస్తోంది. కోర్టు స్టే ఆర్డర్ ఉన్నా.. నిర్మాణాలు జరిపిన ఓ గెస్ట్ హౌస్‌తో పాటు, ఆరు అంతస్తుల భవనాన్ని హైడ్రా కూల్చివేస్తోంది. 2లో



### చర్చలు విఫలమైతే ఇరాన్‌పై

# మరిన్ని దాడులు

### మరోమారు హెచ్చరించిన ట్రంప్

న్యూయార్క్ : ఇరాన్, అమెరికా దేశాల మధ్య రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగుతున్న వేళ శనివారం పాకిస్థాన్‌లో రెండు దేశాల మధ్య చర్చలకు దిగారు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, అమెరికా ప్రత్యేక ప్రతినిధులు స్టీవ్ విట్కాఫ్, జేరెడ్ కుష్ణనర్‌లు ఇప్పటికే పాకిస్థాన్ చేరుకున్నారు. తరువాయి 2లో



### పూలే జయంతి సందర్భంగా

# సిఎం రేవంత్ నివాళి

న్యూఢిల్లీ : మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘనంగా నివాళులు అర్పించారు. ఢిల్లీలోని ఆ మహనీయుడి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.



### ఎప్పుడు ఎన్నికలొచ్చినా..

# అవి కెసిఆర్ ఎన్నికలే

## కెసిఆర్ అధికారంలోకి వచ్చేలా ఫలితాలు

- అనేక హామీలతో డబ్బా కొట్టుకుంటున్న రేవంత్
- నిరుద్యోగులను మోసం చేసిన ప్రభుత్వం
- ఇబ్రహింపట్నం కార్యకార్యర్తల భేటీలో కెటిఆర్

హైదరాబాద్ : ఇబ్రహీంపట్నం నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్ తిరిగి అధికారంలోకి వచ్చే ఎన్నికలే జరుగుతయని నాకు విశ్వాసం ఉందన్నారు. ఇది నా ఆలోచన కాదు.. రాష్ట్రంలో ఎవరినైనా అన్నా ఎట్లున్నది పరిస్థితి అని అడగండి. రైతన్నల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. నేను జగిత్యాలకు పోతే అక్కడ ఓ రైతు సోదరుడు కలిసిండు. అన్న ఎట్లున్నది పరిస్థితి అని అడిగిన. ఆ ఏముంది సార్ మూడు సార్లు రైతు బంధు ఎగ్గొట్టిండు. రూ.27 వేల కోట్లు మిగిలినయి. అందులో నుంచి 20 వేల కోట్లు ఇచ్చి రుణమాఫీ చేసినా అని డబ్బా కొట్టుకుంటున్నడు. మా పైసలు మాకే ఇచ్చి మిదికెల్లి బాకీ ఉన్నడు.. కానీ బయటకు మాత్రం రైతు బంధు ఎగ్గొట్టిన అని చెప్పడు. రుణమాఫీ చేసినా అని చెప్పి.. తరువాయి 2లో

**ఈ అరాచక పాలనను అంతమొందించాలంటే కొత్తతరం నాయకత్వం రావాల్సిన అవసరం ఉందని,. రాబోయే రోజుల్లో ఎన్నికలు ఎప్పుడొచ్చినా అవి కేసీఆర్ ఎన్నికలుగానే ఉంటాయి.. అసెంబ్లీ ఎన్నికలు కాదు. కేసీఆర్ ఎన్నికలే ఈ రాష్ట్రంలో జరుగుతాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు.**



### బెంగాల్లో తృణమూల్‌కు

# ఓటమి భయం

### అందుకు బిజెపిపై దాడులకు తెగిస్తున్నారు

### బెంగాల్ ప్రచార సభలో ప్రధాని మోడీ

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లో భారతీయ జనతా పార్టీకి పెరుగుతున్న ప్రజా మద్దతును చూసి తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) భయాందోళనలో ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. శనివారం రాష్ట్రంలో జరిగిన ఒక బహిరంగ సభలో పాల్గొన్న మోదీ, ప్రస్తుత అధికార పార్టీ తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో బీజేపీకి లభిస్తున్న ఆదరణను చూసి మమతా బెనర్జీ నేతృత్వంలోని ప్రభుత్వం భయాందోళనలకు గురవు తోందని ప్రధాని పేర్కొన్నారు. తరువాయి 2లో



### ఎన్నికల కమిషన్‌తో

# బిజెపి కుమ్మక్కు

### తన అభ్యర్థిత్వాన్ని చెల్లకుండా చేసే యత్నం

### ఎన్నికల ప్రచారసభలో మమతా బెనర్జీ విమర్శలు

కోల్‌కతా : ఎన్నికల కమిషన్‌తో బీజేపీ కుమ్మక్కై భవనాపూర్ నుంచి అభ్యర్థిత్వాన్ని చెల్లకుండా చేసేందుకు ప్రయత్ని ంచినట్టు పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చెప్పారు.

## బిఆర్ఎస్‌లోకి వెళ్లి జీవన్‌రెడ్డి తప్పు చేశారు



### కాంగ్రెస్ పట్ల ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ

### టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్

### నేడు ఇంటర్

# ఫలితాలు విడుదల

### అధికారికంగా ప్రకటించిన బోర్డు



# దక్షిణాదిపై కక్షకట్టిన కేంద్రం



### ఉత్తరాదిలో ఎంపి సీట్లు పెంచుకునే కుట్ర

### పూలే జయంతి ఉత్సవాల్లో భట్టి

హైదాబాద్ : దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం చూపుతున్న వివక్షను ప్రతి ఒక్కరూ గమనించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. మన దగ్గర పన్నులు వసూలు చేస్తూ ఉత్తరాదికి నిధులు ధార పోస్తున్నారని విమర్శించారు. ఇప్పుడు డిలిమిటేషన్ పేరుతో ఉత్తరాదిలో ఎంపీ స్థానాలను పెంచి దక్షిణాది ప్రాధాన్యతను తగ్గించే కుట్ర జరుగుతోందన్నారు. దక్షిణాది గొంతు నొక్కాలని చూస్తున్న ఈ రాజకీయ కుట్రలను బహుజనులు, ప్రజాస్వామ్య వాదులు ఏకమై తిప్పికొట్టాలన్నారు. తరువాయి 2లో

# పూలే ఆశయాలకు కాంగ్రెస్ తూట్లు



### విద్యారంగం పూర్తిగా అస్తవ్యస్తం

### అక్షరాస్యతలో వెనకబడుతున్న తెలంగాణ

### కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రకటన

హైదరాబాద్ : ప్రముఖ సామాజిక తత్వవేత్త, ఉద్యమకారుడు మహాత్మా జ్యోతిరావు పూలే ద్విశతాబ్ది జయంతి సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఘనంగా నివాళు లర్పించారు. అణచివేతపై తిరుగుబాటుకు కేరాఫ్ అడ్రస్.. బడుగు, బలహీన వర్గాలకు కొండంత ధైర్యం... మహాత్మా జ్యోతి రావు పూలే అని వ్యాఖ్యానించారు. ఈ మేరకు బండి సంజయ్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఏ సమాజమైతే చదువు పరంగా, ఆర్థికంగా ఎదుగుతుందో అప్పుడే ఆ సమాజం 2లో



# జువ్వలదిన్నె హార్బర్‌పై పుకార్లు

### హార్బర్‌ని ప్రైవేటు పరం చేసే ప్రసక్తేలేదు

### సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

నెల్లూరు : జువ్వలదిన్నె హార్బర్‌పై పుకార్లు, అసత్య ప్రచారాలు నమ్మొద్దని.. హార్బర్‌ని ప్రైవేటు పరం చేసే ప్రసక్తేలేదని మాజీ మంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. కృష్ణపట్నం పోర్టుకి సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారని ప్రస్తావించారు. దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో 2008లో కృష్ణపట్నం నుంచి వాడరేవు వరకు ఎలాంటి పోర్టులు రాకూడదని జీవో ఎంఎస్ నంబర్- 40 ఇచ్చారని గుర్తుచేశారు. శనివారం నెల్లూరులో సోమిరెడ్డి పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కృష్ణపట్నం పోర్టుపై పెత్తనం కోసం తండ్రిని అడ్డం పెట్టుకుని వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జీవో తెప్పించారని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆగ్రహించారు. పోర్టులు, హార్బర్లు, చివరకు జెట్టీలు రాకుండా చేశారని ధ్వజమెత్తారు. 2లో



# జ్యోతిరావు పూలే జయంతి

### ఘనంగా నివాళి అర్పించిన చంద్రబాబు, మంత్రులు

అమరావతి : మహాత్మా జ్యోతిరావు పూలే ద్విశతాబ్ది జయంతి సందర్భంగా ఆ మహానుభావుడికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ ఘన నివాళు లర్పించారు. కుల వివక్షకు వ్యతిరేకంగా, మహిళల హక్కుల కోసం అహర్నిశలు శ్రమించిన మహానుభావుడు అని సీఎం చంద్రబాబు అన్నారు. సామాజిక సమస్యలపై అలుపెరగని పోరాటం చేసిన తరువాయి 2లో

# క్లీన్ పాలిటిక్స్.. పాజిటివ్ ఓటింగ్

### ప్రజల సంక్షేమం లక్ష్యంగా ముందుకు సాగాలి

### ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు చేరవేయాలి

### కార్యకర్తల కోసం ఎథికల్ ఎకనమిక్ ఎంపవర్మెంట్

### శిక్షణ్యా తరగతుల్లో టిడిపి అధినేత చంద్రబాబు



అమరావతి : పాజిటివ్ ఓటు పెరగాలని, క్లీన్ పాలిటిక్స్ మన లక్ష్యమని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. టీడీపీ కార్యాలయంలో జరుగుతున్న శిక్షణా తరగతులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు క్రమం తప్పకుండా హాజరవుతున్నారు. పార్టీ సీనియర్ నేతలతో నేతలు, కార్యకర్తలకు టీడీపీ అధినాయకత్వం శిక్షణ ఇప్పిస్తోంది. శిక్షణ తీసుకుంటున్న నేతలు, కార్యకర్తలతో కాఫీ తాగుతూ తన అభిప్రాయాలను సీఎం పంచుకున్నారు. రాజకీయాల్లో, పరిపాలనలో గత పరిణామాలు, ప్రస్తుత సంక్షేమం, అభివృద్ధి, భవిష్యత్తు ప్రణాళికలను కార్యకర్తలకు వివరించారు. క్షేత్రస్థాయిలో వివిధ పథకాలు, కార్యక్రమాల అమలుపైనా నేతలు, కార్యకర్తల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను... ప్రత్యర్థి పార్టీ దుర్మార్గాలను సామాన్య కార్యకర్తలైనా మెరుగ్గా విశ్లేషించేలా అవగాహన పెంచుకోవాలని నేతలకు ముఖ్యమంత్రి దిశానిర్దేశర చేశారు. తరువాయి 2లో

# హైడ్రా భారీ ఆపరేషన్

ఐలాపురం తండాతో పాటు గ్రామంలోని పేదల ఇళ్ల జోలికి వెళ్లకుండా ఖాళీ స్థలాలను హైడ్రా స్వాధీనం చేసుకుటోంది. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం ఐలాపురం గ్రామంలో మొత్తం 1263 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో ఇప్పటికే చాలా నివాసాలు వెలిశాయి. ఆ నివాసాల జోలికి వెళ్లకుండా మిగిలి ఉన్న 860 ఎకరాల ప్రభుత్వ భూమిని రక్షించేందుకు చర్యలు చేపట్టింది. 863 ఎకరాల భూమి విలువ రూ.15 వేల కోట్లకు పైగా ఉంటుందని అంచనా. ఇక్కడ యథాతథ స్థితిని కొనసాగించాలని 1998 నుంచి కోర్టు ఆర్డర్లున్నా పట్టించుకోకుండా నిర్మించిన గెస్ట్ హౌస్‌ను హైడ్రా తొలగించింది. అలాగే ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించిన 6 అంతస్తుల భవనాన్ని తొలగిస్తోంది. ఐలాపురం తండాలో కానీ, గ్రామంలోని నివాస గృహాల జోలికి కానీ వెళ్లకుండా చర్యలు చేపట్టినట్లు హైడ్రా అధికారులు స్పష్టం చేశారు. కేవలం అక్రమంగా నిర్మించిన భారీ కట్టడాలు, ఖాళీ స్థలాల స్వాధీనంపైనే దృష్టి సారించినట్లు తెలిపారు. 1998 నుంచి 'స్టేటస్ కో' కొనసాగించాలని కోర్టు ఆర్డర్లు ఉన్నప్పటికీ, వాటిని ఖాతరు చేయకుండా ముఖీమ్ నిర్మించిన గెస్ట్ హౌస్‌ను హైడ్రా నేలమట్టం చేసింది. అలాగే అతని సోదరుడు అజీమ్ ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మించిన 6 అంతస్తుల భవనాన్ని కూడా అధికారులు తొలంచారు. ఐలాపూర్ గ్రామంలో మొత్తం 1263 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో ఇప్పటికే అనేక నివాసాలు వెలిశాయి. మిగిలి ఉన్న 860 ఎకరాల ఖాళీ ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవడమే లక్ష్యంగా హైడ్రా ఈ ఆపరేషన్ చేపట్టింది. ఈ భూమి విలువ సుమారు రూ.15 వేల కోట్ల పైమాటే ఉందని అంచనా. కూల్చివేతలు కొనసాగుతున్న నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీగా పోలీసులను మోహరించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీగా పోలీసులు మోహరించారు. హైడ్రా చేపట్టిన ఈ భారీ ఆపరేషన్ వల్ల వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడగలిగారు.

# ఎన్నికల కమిషన్‌తో బిజెపి కుమ్మక్కు

అయితే ఆ పార్టీ గేమ్ ప్లాన్‌ను టీఎంసీ కార్యకర్తలు, ప్రజలు భగ్నం చేశారని తెలిపారు. భవనాపూర్‌లో మమతా బెనర్జీపై బీజేపీ అభ్యర్థిగా సువేందు అధికారి పోటీలో ఉన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సమయంలో 90 లక్షల మంది పేర్లను బీజేపీ బలవంతంగా తొలగించిందని మమతా బెనర్జీ ఈ సందర్భంగా ఆరోపించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు గెలవలేక తప్పుడు మార్గాల ద్వారా ఓట్లను రాబట్టుకునేందుకు బీజేపీ కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ఆ కారణంగానే లక్షలాది ఓటర్లను వాళ్లు తొలగించారని, ఫలితాలు తమకు అనుకూలంగా ఉండేలా ఈవీఎంల ట్యాంపరింగ్ చేసే ఆలోచనలో కూడా ఉన్నారని అన్నారు. ఎస్ఐఆర్ పక్రియ కారణంగా 250 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. తొలగించిన 90 లక్షల మంది ఓటర్లలో 60 లక్షల మంది హిందువులు, 30 లక్షల మంది ముస్లింలు ఉన్నారు. బెంగాలీ మాట్లాడినంత మాత్రమే మనం భారతీయులం కాదా? నిరంతరం పౌరసత్వం నిరూపించుకోవాలా?' అని మమతా బెనర్జీ ప్రశ్నించారు. అధికారంలోకి వస్తే ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ)ని అమలు చేస్తామంటూ బీజేపీ ఎన్నికల హామీపై మాట్లాడుతూ, ఈ చర్యను వెనుకబడిన వర్గాలపై నేరుగా దాడి చేసేందుకు, ప్రజల ప్రజాస్వామ్య హక్కులను కొల్లగొట్టేందుకు జరుపుతున్న దాడిగా ఆమె పేర్కొన్నారు. పశ్చిమబెంగాల్‌లో యూసీసీని అమలు చేసేది లేదన్నారు. రాష్ట్రంలో వరుసగా నాలుగోసారి అధికారంలోకి వచ్చి.. ఢిల్లీలో బీజేపీకి ఉద్వాసన పలుకుతామని, ఆ వెంటనే యూసీసీని రద్దు చేస్తామని మమత స్పష్టం చేశారు.

# చర్చలు విఫలమైతే ఇరాన్‌పై మరిన్ని దాడులు

ఇరాన్ ప్రతినిధులు కూడా ఇస్లామాబాద్ వచ్చేశారు. ఈ చర్చలు ఎలాంటి ఫలితాలను ఇస్తాయన్న దానిపై యావత్ ప్రపంచం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ఇరాన్‌తో అమెరికా చర్చలు జరపనున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోమారు ఇరాన్‌కు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. అంతర్జాతీయ జలమార్గాలను బ్లాక్ చేయడం తప్ప.. ఇరాన్ దగ్గర మరో అస్త్రం లేదని అన్నారు. హోర్ముజ్ జలసంధిని తెరవాలన్నది తమ డిమాండ్ అని తేల్చి చెప్పారు. చర్చలు విఫలమైతే ఇరాన్‌పై మరిన్ని దాడులు చేస్తామని అన్నారు. అత్యుత్తమ ఆయుధాలతో సైన్యం ఇరాన్‌పై దాడి చేయడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. ఇరాన్ బలగాలు సైనికంగా ఓడిపోయాయని అన్నారు. ఇరాన్ దగ్గర అణ్వాయుధాలు ఉండకూడదని స్పష్టం చేశారు. ర్చల ఫలితంతో సంబంధం లేకుండా.. హోర్ముజ్ జలసంధి దానంతట అదే తెరుచుకుంటుందని, త్వరలోనే హోర్ముజ్ జలసంధి తెరుచుకునేలా చేస్తామని అన్నారు. కాగా, ఇరాన్‌తో చర్చల నేపథ్యంలో ట్రంప్ తన సొంత సోషల్ మీడియాప్లాట్ ఫామ్ ది ట్రూత్‌లో ఇరాన్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వరుస పోస్టులు పెడుతున్నారు. శుక్రవారం పెట్టిన ఓ పోస్టులో.. 'ఇరాన్ యుద్ధం చేసే దానికంటే.. ఫేక్ న్యూస్ మీడియాను, పబ్లిక్ రిలేషన్స్‌ను హ్యాండిల్ చేయటంలో అద్భుతమైన ప్రతిభ కనబరుస్తోంది' అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

# జ్యోతిరావు పూలే జయంతి

గొప్ప సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే అని మంత్రి లోకేశ్ కొనియాడారు. ఆ మహాత్ముని జయంతిని ప్రభుత్వం రాష్ట్ర పండుగగా నిర్వహిస్తోందంటూ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా సీఎం, మంత్రి పోస్టు చేశారు.'మహాత్మా జ్యోతిరావు పూలే ద్విశాబ్ది జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పిస్తున్నాను. సామాజిక విప్లవ పితామహుడు పూలే. కుల వివక్షకు వ్యతిరేకంగా, అణగారిన వర్గాల, మహిళల హక్కుల కోసం అహర్నిశలు శ్రమించిన మహానుభావుడు మనకు ఎప్పటికీ ఆదర్శం. ఆయన చూపిన మార్గంలో నడవడం మన సామాజిక బాధ్యత. 'విద్య లేనివాడు వివేకం కోల్పోతాడు, వివేకం లేనివాడు నైతికత కోల్పోతాడు, నైతికత లేనివాడు అభివృద్ధిని కోల్పోతాడు' అని ఆయన చేసిన బోధనలు ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి' అని సీఎం చంద్రబాబు ఎక్స్‌లో పోస్టు చేశారు. 'ప్రముఖ సామాజిక తత్వవేత్త, ఉద్యమకారుడు మహాత్మా జ్యోతిరావు పూలే ద్విశతాబ్ది జయంతి సందర్భంగా ఆ మహనీయుని స్మృతికి ఘన నివాళులు అర్పిస్తున్నాను. దళితుల అభ్యున్నతి, అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనకు ఆయన జీవితాంతం కృషిచేశారు. విద్య ప్రాముఖ్యతను సమాజానికి తెలియజేశారు. ఆయన జయంతిని ప్రజాప్రభుత్వం రాష్ట్ర పండుగగా నిర్వహిస్తోంది. సామాజిక సమస్యలపై అలుపెరుగని పోరాటం చేసిన గొప్ప సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని వారి ఆశయ సాధనకు అందరం కృషి చేద్దాం' అంటూ మంత్రి లోకేశ్ ట్వీట్ చేశారు. బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే అని మంత్రి సవిత అన్నారు. మహిళా విద్య, దళిత, బడుగు వర్గాల హక్కులకు, కుల వ్యవస్థ నిర్మూలనకు పోరాడిన యోధుడు జ్యోతిరావు పూలే అని తెలిపారు. జ్యోతిరావు పూలే లక్ష్య సాధనే కూటమి ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు.

# జువ్వలదిన్నె హార్బర్‌పై పుకార్లు

టీడీపీ హయాంలోనే రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె హార్బర్‌లు వచ్చాయని తెలిపారు.మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సహకారంతో హార్బర్ తెచ్చామని చెప్పారు. దక్షిణ భారతదేశంలో ఎక్కడా లేనివిధంగా 900 మీటర్ల జెట్టీతో హార్బర్ తెచ్చామన్నారు. బ్లూ రివల్యూషన్ కింద కేంద్ర ప్రభుత్వం రూ.130కోట్లు, టీడీపీ ప్రభుత్వం రూ.150కోట్లు నిధులతో జువ్వలదిన్నె హార్బర్‌ని తాము తీసుకువచ్చామని తెలిపారు. జగన్ ఈ నెల 15వ తేదీన జువ్వలదిన్నెకి వస్తానంటున్నారని.. ఏమి చెప్పేందుకు జగన్ వస్తున్నారని ప్రశ్నించారు. పోర్టులు, హార్బర్‌లు, జెట్టీలు రాకుండా జీవో తెప్పించానని చెబుతావా? ఐదేళ్లపాటు జువ్వలదిన్నె హార్బర్ పూర్తి చేయలేకపోయామని చెబుతావా? అని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఎద్దేవా చేశారు. వైఎస్‌ని అడ్డుపెట్టుకుని జగన్ అడ్డగోలు జీవోలు తెచ్చారని మండిపడ్డారు. జగన్ ముఖ్యమంత్రిగా పనిచేశావని... నోటికొచ్చినట్లుగా మాట్లాడవద్దని హితవు పలికారు. రూ.288కోట్ల నిధులు తాము తెస్తే... జగన్ హయాంలో నిర్మించడానికి ఐదేళ్లు పట్టిందని ప్రస్తావించారు.

# ఎప్పుడు ఎన్నికలొచ్చనా.. అవి కెసిఆర్ ఎన్నికలే

అది కూడా ఊరిలో చారానా మందికి చేసిండు. బారానా మందికి కాలేదు. అగో గట్లుంది పాలనా అని ఒకే ఒక్కమాటలో రైతన్న చెబుతున్నడని అంటూ ఎద్దేవా చేశారు. ఏ యువకుడినైనా అడగండి రెండు లక్షల ఉద్యోగాలని ఊరించి పెద్ద పెద్ద మాటలు చెప్పి చివరకు మోసం చేసి గద్దెనెక్కి.. ఇంతవరకు రెండున్నర సంవత్సరాల్లో 11 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదు. మహిళలకు స్కూటీలు, తులం బంగారం అన్నడు.. నెలకు రూ.2500 ఇస్తా అన్నడు.. అత్తకు రూ.4 వేలు, కోడలుకు రెండున్నర వేలు నోటికి ఎంతొస్తే అంత మాటలిచ్చి మహిళలను మోసం చేసిండు. కేసీఆర్ రాకముందు 200 పెన్షన్ వచ్చేది. కేసీఆర్ దాన్ని రూ.2 వేలు చేసిండు. నవంబర్‌లో అయితే రూ.2వేలు, డిసెంబర్‌లో అయితే 4 వేలు అని చెప్పిండు. ముసలోళ్లను కూడా మోసం చేసిండు. రెండు నెలలు ఇప్పటికీ పెన్షన్ ఎగ్గొట్టిండు. 28 నెలల్లో సాధించింది ఏమైనా ఉందంటే ఒకే ఒక్కటి ఢిల్లీకి పోవుడు. వచ్చుడు.. ఎక్కే విమానం.. పోయే విమానం తప్ప ఈ రాష్ట్రంలో చేసింది మాత్రం ఏమీ లేదన్నాడు. మీ ఎమ్మెల్యే గురించైతే నేను చెప్పే అవసరమే లేదు. ఆయన ఎట్లాంటోడో ఏమేం వసూళ్లు చేస్తడో నాకంటే బాగా మీకే తెలుసు. ఆఖరికి అరటి పండ్ల బండ్లను కూడా విడిచిపెట్టడట అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. గట్లాంటోడి గురించి నేను మాట్లాడ కని.. ఒకటి మాత్రం పక్కా. మంచి రెడ్డి లాంటి మంచి నాయకుడిని కోల్పోవడం వల్ల ఆయనకేం నష్టం కాలేదు. ఆయన బాగానే ఉన్నడు.. కానీ నష్టపోయింది ఇబ్రహీం పట్నం ప్రజలు అని గుర్తు చేస్తున్నా. మంచి నాయకుడు కేసీఆర్‌ను కోల్పోయినం. ఇబ్రహీంపట్నంలో మంచి రెడ్డి కిషన్ రెడ్డి లాంటి మంచి నాయకుడిని పోగొట్టుకున్నం. అందుకే ఈ ప్రభుత్వం చేస్తున్న అరాచకలు నా కంటే బాగా మీకే తెలుసనన్నారు కేటీఆర్. కేసీఆర్ నాయకత్వంలో 14 వేల ఎకరాలు సేకరించి గ్రీన్ ఫార్మా సిటీ పెట్టాలని పట్టుబట్టామని అన్నారు. స్టేట్ ఆఫ్ ది ఆర్ట్.. అంటే ప్రపంచంలోనే అత్యున్నతమైన ప్రమాణాలతో స్థానికంగా కాలుష్యమనేది లేకుండా అక్కడే బాగా చేయాలనే ఉద్దేశంతో దాదాపు 7 సంవత్సరాలు కిషన్ రెడ్డి, సబితక్క, నేను కష్టపడి చాలా మందిని ఒప్పించి మెప్పించి కొంత ఇబ్బంది పెట్టి కూడా రైతులకు మొక్కాలే.. తడ్లాండి 14 వేల ఎకరాలు సేకరించినమని చెప్పుకొచ్చారు. అయితే ఇప్పుడేం జరుగుతున్నదో చూస్తున్నామని అన్నారు.

# పూలే ఆశయాలకు కాంగ్రెస్ తూట్లు

అభివృద్ధి చెందుతుందని ఆశించిడమే కాకుండా అందుకోసం చివరిదాకా కృషి చేసిన మహనీయుడు పూలే అని కొనియాడారు.ఛత్రపతి శివాజీ మహారాజ్‌ను అభిమానించే జ్యోతిరావు పూలే కుల వివక్షపై అలుపెరగని పోరాటం చేశారని కీర్తించారు. ఆ రోజుల్లోనే వితంతు పునర్వివాహాలు జరపడంతోపాటు బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారని ప్రశంసించారు. మహిళల చదువు కోసం నిరంతరం పాటుపడ్డారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం జ్యోతిరావు పూలే ఆశయాలకు, స్ఫూర్తికి భిన్నంగా పాలన కొనసాగిస్తోందని బండి సంజయ్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న విద్యాశాఖ పనితీరు దారుణంగా ఉందని తెలిపారు. అక్షరాస్యతలో జాతీయ సగటు కంటే తెలంగాణ పూర్తిగా వెనుకబడి ఉండటం ఆందోళన కలిగిస్తోందని చెప్పారు. ఏళ్ల తరబడి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో లక్షలాది మంది పేద, మధ్యతరగతి ప్రజలు ఉన్నత చదువులకు దూరమవుతున్నారని చెప్పుకొచ్చారు. ఆరోగ్య శ్రీ బకాయిలు ఏళ్ల తరబడి చెల్లించకపోవడంతో కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రులు ఆరోగ్య శ్రీ కార్డుపై చికిత్స చేయించుకోలేని దుస్థితి ఏర్పడిందని తెలిపారు. ప్రభుత్వ భూములను ఎడాపెడా అమ్ముతూ భవిష్యత్తు తరాలకు గజం జాగా కూడా లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందన్నారు. ఇకనైనా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూలే ఆశయాలను మాటల్లో కాకుండా చేతల్లో చూపాలని బండి సంజయ్ కోరారు. పూలే దీనబంధు అనే పత్రికను స్థాపించి బీదల, కార్మికుల సమస్యలను సమాజానికి తెలిసేలా చేశారని బండి సంజయ్ కుమార్ ప్రస్తావించారు. అట్టడుగు వర్గాల్లో విజ్ఞానాన్ని నింపడానికి, పేదలను ఆదుకోవడానికి సర్వస్వం త్యాగం చేసిన మహోన్నతుడు పూలే అని చెప్పారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పూలేను గురువుగా ప్రకటించుకున్నారంటే ఆయన గొప్పదనం ఏంటో అర్థమవుతుందని అన్నారు. సతీమణి సావిత్రీబాయి పూలేతో కలిసి విద్యా ఉద్యమాన్ని ప్రారంభించి ఏకంగా 52 పాఠశాలలను ప్రారంభించి వేలాది మంది పేదలకు అక్షర జా&ఝనాన్ని అందించిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని కొనియాడారు. స్వాతంత్యం÷-ర రాని రోజుల్లోనే నిర్బంధాలను, అణిచివేతలను తట్టుకుంటూ అణగారిన వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగులు తెచ్చేందుకు జ్యోతిరావు పూలే చేసిన కృషి చిరస్మరణీయమని కీర్తించారు.

# క్లీన్ పాలిటిక్స్.. పాజిటివ్ ఓటింగ్

జగన్ మావిగన్ విమర్శలకు అమరావతి అభివృద్ధే సరైన సమాధానం ఇస్తుంది. పిచ్చిపట్టినట్లు చేసే మావిగన్ ప్రకటనలకు ప్రజలే సమాధానం చెబుతారు. అభివృద్ధి అనేది ఒకచోట ఆగేది కాదు. హైదరాబాద్‌కు ఓఆర్ఆర్, ఎయిర్‌పోర్టు, ఐటీ రంగం ఆదాయాన్ని పెంచాయి. సైబరాబాద్ వల్ల హైదరాబాద్ అభివృద్ధి చెందుతూనే ఉంది. అమరావతి కూడా ఇదే తరహాలో అభివృద్ధి చెందుతుందని సీఎం స్పష్టం చేశారు. పార్టీ కార్యకర్తల ఆర్థిక బలోపేతానికి ఇ3 కార్యక్రమం అమలు చేస్తామని ప్రకటించారు. 'క్లీన్ అండ్ గ్రీన్ చేపట్టాం... క్లీన్ ఎనర్జీని ఎంకరేజ్ చేస్తున్నాం... క్లీన్ పాలిటిక్స్ కూడా చేస్తున్నాం. క్లీన్ పాలిటిక్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా టీడీపీని నిలిపేలా కార్యకర్తలు పని చేయాలి. పాజిటివ్ పాలిటిక్స్ చేయాలని... పాజిటివ్ ఓట్లు పెంచుకోవాలి... గతానికంటే టీడీపీ ఓట్ బ్యాంక్ పెరగాలి' అని సీఎం చంద్రబాబు సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు.. ప్రభుత్వం పడుతున్న కష్టాన్ని కూడా ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలని నేతలకు తెలియజేశారు. పార్టీ నేతలు, కార్యకర్తల కోసం ఇ3 ప్రోగ్రాం తీసుకొస్తామని చెప్పారు. నీతి, నిజాయితీలతో కార్యకర్తలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు 'ఎథికల్ ఎకనమిక్ ఎంపవర్మెంట్' కార్యక్రమం చేపడతామన్నారు. 'నా కుటుంబం కోసం ఏ విధంగా ఆలోచన చేశానో... టీడీపీ కుటుంబం కోసం అదే విధంగా ఆలోచన చేస్తున్నా' అని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

# బిఆర్ఎస్‌లోకి వెళ్లి జీవన్‌రెడ్డి తప్పు చేశారు

ములుగు : కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరి మాజీ మంత్రి జీవన్ రెడ్డి తప్పుచేశారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. ఇన్నాళ్లూ తమకంటే ఎక్కువగా బీఆర్ఎస్ అవినీతిపై మాట్లాడిన ఆయన ఆ పార్టీతో చేతులు కలపడం బాధాకరమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ముక్కలైందని.. ఆస్తుల కోసం కొట్టుకుంటున్నారని విమర్శించారు. బీజేపీకి తెలంగాణలో ఆదరణ లేదని అన్నారు. శనివారం ములుగు జిల్లాలో మహేశ్ కుమార్ గౌడ్ పర్యటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇప్పటికే బిఆర్ఎస్‌లోకి వెళ్లిన వారి గతి ఏమయ్యిందో చూశామని అన్నారు. బిఆర్ఎస్‌లో కుటుంబానికే ప్రాధాన్యమని అన్నారు. కాంగ్రెస్ పట్ల ప్రజల్లో రోజురోజుకూ ఆదరణ పెరుగుతోందన్నారు. ఉన్నఫలంగా ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ 100స్థానాల్లో గెలుస్తుందని మహేశ్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. దశా, దిశా లేకుండా పదేళ్లు కేసీఆర్ పరిపాలన చేశారని, రూ.8 లక్షల కోట్లు అప్పు చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను తమ ప్రభుత్వం నిలబెట్టుకుంటుందని తెలిపారు. కాంట్రాక్టర్లు ఇచ్చే డబ్బులతో జేబులు నింపుకోవడంతోనే కాళేశ్వరం కూలిపోయిందని మహేశ్ కుమార్ గౌడ్ విమర్శలు చేశారు.

# ఈ సారి వర్షాలు తక్కువే

## జాగ్రత్తగా ఉండాలన్న వాతావరణ కేంద్రం

హైదరాబాద్,ఏప్రిల్11 : ఇప్పటికే ఎండలు దంచి కొడుతున్నాయి. అయితే అంతగా వర్షాలు మాత్రం పడవని వాతావరణ సంస్థ ప్రకటించింది. తాజాగా తెలంగాణలో ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. బలమైన ఎల్-నినో ప్రభావం, పాజిటివ్ ఇండియన్ ఓషన్ డైపోల్ పరిస్థితుల కారణంగా వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉండే అవకాశముందని తెలంగాణ వెదర్ మ్యాన్ ట్వీట్ చేసింది. 2026 వర్షపాతానికి సంబంధించిన అంచనాలు తెలంగాణలో కొంత ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొంది. కొన్నేళ్లుగా తెలంగాణలో మంచి వర్షాలు పడ్డాయని.. ముఖ్యంగా 2025లో అధిక వర్షపాతం నమోదైందని తెలిపింది. రైతులు సాగు చేసేందుకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయని పేర్కొంది. అయితే, 2026లో పరిస్థితి మారే సూచనలు కనిపిస్తున్నాయని తెలంగాణ వెదర్ మ్యాన్ హెచ్చరించింది. 2018 సంవత్సరం తరహాలో ఈసారి వర్షపాతం ఉండొచ్చని అంచనా వేసింది. జూన్- సెప్టెంబర్ కాలంలో అన్ని నెలలూ 'సగటు కంటే తక్కువ' వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని చెప్పింది. కానీ, 2014-15 సంవత్సరాల మాదిరిగా తీవ్రమైన వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం తక్కువగా ఉన్నట్లు వెల్లడించింది. అయితే, దక్షిణ తెలంగాణ జిల్లాలపై ఈ ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉందని అంచనా వేసింది. మహబూబ్‌నగర్, నారాయణపేట్, వనపర్తి, నాగర్‌కర్నూల్, జోగులాంబ గద్వాల్ వంటి ప్రాంతాలు ఎక్కువగా ప్రభావితమయ్యే అవకాశముందని హెచ్చరికలు జారీ చేసింది. ఈ ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులు తలెత్తే అవకాశం ఉండడంతో రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. మేరకు నీటి వనరులను అన్నదాతలు సమర్థవంతంగా వినియోగించుకోవాలని వాతావరణ నిపుణులు సూచిస్తున్నారు. వరి వంటి ఎక్కువ నీరు అవసరమైన పంటలకు బదులుగా పప్పు, జొన్న వంటి తక్కువ నీటితో పండే పంటలను ఎంచుకోవాలని చెబుతున్నారు. విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని, వర్షాభావాన్ని దృష్టిలో ఉంచుకుని సాగు ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని సూచిస్తున్నారు. సాధారణం కంటే తక్కువ స్థాయిలో వర్షాలు పడే సూచనలు ఉన్నందున ప్రభుత్వం, రైతులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.

# వర్ణవివక్షకు వ్యతిరకంగా పోరాడిన మహానుభావుడు

## పూలే జయంతి సందర్భంగా కెసిఆర్ ఘన నివాళి

హైదరాబాద్ : వర్ణ వివక్షకు వ్యతిరేకంగా తన జీవితకాలం పోరాడిన భారతదేశ సామాజిక విప్లవకారుడు, సమ సమాజ స్థాపన మార్గదర్శి, మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన జాతికి చేసిన సేవలను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్మరించుకున్నారు. భారత సమాజంలో వర్ణ, కుల లింగ వివక్షతను రూపుమాపి, సామాజిక న్యాయం దక్కాలని పోరాడిన దార్శనికుడు మహాత్మా పూలే అని కొనియాడారు. సబ్బండ వర్ణాలు సామాజిక ఆర్థిక రంగాల్లో ముందడుగు వేయాలంటే విద్య ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని చెప్పిన జ్యోతిరావు పూలే ఆశయాలు ఎల్లకాలం ఆచరణీయమైనవని కేసీఆర్ తెలిపారు. తన భార్య సావిత్రి బాయి పూలేకు చదువు నేర్పించి మరీ, చదువు నిరాకరించబడిన భారత మహిళకు విద్య నేర్పాలనే ధృఢ సంకల్పాన్ని అనేక కష్ట నష్టాల నడుమ అమలు చేసిన, మహిళాభ్యుదయ మార్గదర్శి మహాత్మా పూలే అని కొనియాడారు. పూలే ఆశయాలను నిజం చేస్తూ, తన పదేండ్ల ప్రగతి పాలనలో, నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం సబ్బండ కులాల అభ్యున్నతి కోసం అమలు చేసి ఫలితాలను సాధించిన పలు రకాల పథకాలను కార్యాచరణను కేసీఆర్ గుర్తు చేసుకున్నారు. సాగునీరు, విద్యుత్, రైతుబంధు, రైతు బీమా వంటి పథకాలు అమలు చేసి వ్యవసాయ రంగాన్ని పటిష్టపరిచామని తెలిపారు. పలు వృత్తికులాలను ప్రోత్సహిస్తూ గొర్రెల పెంపకం, చేపల పంపిణీ, నేతన్నకు చేయూత వంటి పథకాలను అమలు చేయడం ద్వారా నూటికి తొంభైశాతంగా ఉన్న దళిత బహుజన కులాలు ఆర్థికంగా నిలదొక్కుకున్నాయని తెలిపారు. తద్వారా, తెలంగాణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పునరుజ్జీవనం జరిగిందని అన్నారు. ఆసరా ఫించన్లు, బీసీ బంధు వంటి బహుజన సంక్షేమ పథకాల అమలు ద్వారా, వెనకబడి ఉన్న సబ్బండ కులాలను ఆర్థికంగా అభివృద్ధి చేసామన్నారు. బీసీ కులాల విద్యకోసం ప్రత్యేక రెసిడెన్షియల్ విద్యాసంస్థలను ఏర్పాటు చేసి వారికి అంతర్జాతీయ స్థాయి విద్యనందించినామని కేసీఆర్ తెలిపారు. బీసీ బిడ్డల భవిష్యత్తు తరాల ప్రయోజనాలను నెరవేర్చేందుకు రాష్ట్ర రాజధాని నగరం హైద్రాబాద్ లో ఆత్మగౌరవ భవన నిర్మాణాల కోసం, అత్యంత విలువైన స్థలాలను, నిర్మాణ నిధులను,బీసీ కుల సంఘాలకు కేటాయించినామని తెలిపారు. బీసీ కులాల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు పూలే ఆశయాలకు అనుగుణంగా తాము గత ప్రభుత్వంలో అమలులోకి తెచ్చిన ప్రగతి కార్యాచరణను చిత్తశుద్ధితో కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. తద్వారా మాత్రమే మహాత్మాపూలేకు మనం ఘన నివాళి అర్పించిన వారమవుతామని కేసీఆర్ స్పష్థం చేశారు.

# బెంగాల్లో తృణమూల్‌కు ఓటమి భయం

ఓటమి భయంతోనే టీఎంసీ నేతలు అరాచకాలకు పాల్పడుతున్నారని ఆయన విమర్శించారు.బీజేపీ అధికారంలోకి వస్తే మహిళలకు భద్రత కల్పిస్తామని, రాజకీయ హింసలో పాల్గొన్న వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. పూర్బ బర్ధమాన్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రధాని మాట్లాడుతూ.. 'పశ్చిమ బెంగాల్ నుంచి చొరబాటుదారులందరినీ తరిమేస్తాం. అలాంటి వారికి మద్దతునిచ్చి, వారు ఇక్కడ స్థిరపడటానికి సహాయపడిన వారిపై కూడా చర్యలు తీసుకుంటాం. అమాయక ప్రజలపై, రాజకీయ ప్రత్యర్థులపై దాడులకు పాల్పడిన వారిని చట్టం ముందు నిలబెడతాం. అవినీతి, శాంతిభద్రతలపై శ్వేతపత్రాన్ని విడుదల చేస్తాం. ప్రతి టీఎంసీ గూండా, సిండికేట్, అవినీతిపరుడైన ఎమ్మెల్యే లేదా మంత్రిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. రాజకీయ హింసపై విచారణ జరిపేందుకు, విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో ఒక విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేస్తాం. ఇప్పుడు అమలు అవుతున్న పథకాలను బీజేపీ అడ్డుకోదు. మేం అధికారంలోకి వస్తే తొలి కేబినెట్ సమావేశంలోనే పశ్చిమ బెంగాల్‌లో ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య పథకాన్ని అమలు చేస్తాం' అని అన్నారు. కాగా, పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 23, 29 తేదీలలో రెండు దశల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. మే 4న ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

# నేడు ఇంటర్ ఫలితాలు విడుదల

హైదరాబాద్ : తెలంగాణ ఇంటర్ పరీక్ష ఫలితాల విడుదలకు రంగం సిద్ధమైంది. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల ఫలితాలను ఆదివారం విడుదల చేయనున్నట్లు ఇంటర్ బోర్డు అధికారికంగా ప్రకటించింది. ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఈ ఫలితాలు విడుదల కానున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు ఇంటర్ పరీక్షలు జరగ్గా.. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు తొమ్మిదిన్నర లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. వెబ్‌సైట్‌లలో విద్యార్థులు తమ రోల్ నంబర్ ఎంటర్ చేయడం ద్వారా ఒక్క క్లిక్‌తోనే రిజల్ట్స్‌ని పొందొచ్చు. మరోవైపు, ఇంటర్ విద్యార్థులు తమ రిజల్ట్స్‌ని నేరుగా తమ వాట్సప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకొనే సదుపాయాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోంది. ఈ ఫలితాల కోసం మీ సేవా కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా.. వాట్సప్‌లోనే పొందేలా ఏర్పాటు చేసింది. స్మార్ట్ ఫోన్‌లలో 80969 58096 నంబర్‌ను సేవ్ చేసుకొని 'హాయ్ అని టైప్ చేయడం ద్వారా ఫలితాలు చెక్ చేసుకోవచ్చు.

# దక్షిణాదిపై కక్షకట్టిన కేంద్రం

సామాజిక మార్పు కోసం అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. మహాత్మా జ్యోతిరావు పూలే 200వ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న భట్టి విక్రమార్క.. దేశంలోనే మొదటిసారిగా తెలంగాణలో కులగణన చేపట్టి ఆదర్శంగా నిలిచామన్నారు . బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అందించాలనే పట్టుదలతో ఢిల్లీ వేదికగా ధర్నా కూడా చేశామని చెప్పారు. కానీ కేంద్ర ప్రభుత్వం మన చట్టాన్ని ఆమోదించకుండా కాలయాపన చేస్తోందన్నారు. తెలంగాణ గడ్డపై సామాజిక న్యాయమే లక్ష్యంగా.. ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. సీఎం రేవంత్ నాయకత్వంలో, సామాజిక స్పృహతో కూడిన పాలనను అందిస్తున్నామని అన్నారు భట్టి విక్రమార్క. మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలను ఊపిరిగా తీసుకుని కుల వివక్ష లేని సమాజం కోసం మేము అడుగులు వేస్తున్నామన్నారు భట్టి. ఆనాడు పూలే లాంటి మహనీయులే వివక్షకు గురైనా భవిష్యత్ తరాల కోసం వారు వేసిన పునాదులే మార్గదర్శకాలన్నారు భట్టి.

# పంటకొనుగోళ్లలో తీవ్ర నిర్లక్ష్యం

## సందర్శించిన ఎమ్మెల్యే హరీష్ రావు

సిద్దిపేట : పంట కొనుగోలు చేయకుండా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని మాజీ మంత్రి, సిద్దిపేట బిఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వ అలసత్వంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆగ్రహించారు. శనివారం సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ యార్డ్‌ని హరీశ్‌రావు సందర్శించారు. పొద్దు తిరుగుడు, మొక్కజొన్న ధాన్యాన్ని నాలుగు రోజుల నుంచి కొనుగోలు చేయడం లేదని హరీశ్‌రావుకి రైతులు విన్నవించారు. అన్నదాతల సమస్యలు విని అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. పూలే జయంతీ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. రైతుల పట్ల కాంగ్రెస్ సర్కార్ చిన్నచూపు చూపుతోందని ధ్వజమెత్తారు. నారాయణఖేడ్, ఆదిలాబాద్, నిజామాబాద్ కేంద్రాల్లో మొక్కజొన్న కొనుగోలు సెంటర్‌లను ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. వెంటనే కొనుగోలు సెంటర్‌లు ప్రారంభించి మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. మార్కెట్ యార్డ్‌లను అధికారులు సందర్శించాలని అన్నారు. చాలా చోట్ల కొనుగోలు సెంటర్‌లు ప్రారంభించకపోవడంతో తక్కువ ధరకు అమ్ముకుని రైతులు నష్టపోతున్నారని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి పంట మార్పిడి చేయమని చెబుతున్నారు.. కానీ రైతులు పంట మార్పిడి చేస్తే వాటిని కొనే దిక్కు లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెడుతోందన్ని÷ర్ అయ్యారు. పలు జిల్లాల్లో వడగళ్ల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు సమయానికి రైతు బంధు ఇవ్వాలని కోరారు. బీసీలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దగా చేసిందని దుయ్యబట్టారు. బీసీ డిక్లరేషన్ పేరుతో రేవంత్‌రెడ్డి బీసీలను మోసం చేశారని ఆగ్రహించారు. కేసీఆర్ హయాంలో అన్ని కుల వృత్తులను ప్రోత్సహించామని చెప్పుకొచ్చారు. బీసీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

## వాటర్ బిల్లు బకాయిల పేరుతో మెసేజ్‌లు

### లింకులు ఓపెన్ చేయవద్దని హెచ్చరిక
### అప్రమత్తంగా ఉండాలన్న కమిషనర్ సజ్జన్నార్

హైదరాబాద్,ఏప్రిల్11 : హైదరాబాద్ నగరంలో సైబర్ నేరగాళ్లు కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్న ఘటనలు వెలుగులోకి వచ్చాయని హైదరాబాద్ కమిషనర్ వీసీ సజ్జనార్ తెలిపారు. వాటర్ బోర్డు బిల్లుల పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ, వారి వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలను దోచుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని వెల్లడించారు. ఈ మోసాలు ముఖ్యంగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు పేరుతో జరుగుతున్నట్లు గుర్తించామని అన్నారు. ఈ మేరకు సీపీ సజ్జనార్ సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా ఓ ట్వీట్ పెట్టారు. మీ నీటి కనెక్షన్ కట్ చేస్తామంటూ వచ్చే ఫోన్ కాల్స్ లేదా మెసేజ్‌లతో భయపడవద్దని అన్నారు. సైబర్ కేటుగాళ్లు పన్నే వలలో చిక్కుకోవద్దని చెప్పారు. వాటర్ బోర్డు పేరుతో జరుగుతున్న ఈ కొత్త సైబర్ మోసాలు ప్రజలను లక్ష్యంగా చేసుకుంటారని తెలిపారు. ప్రజల భయాన్ని ఉపయోగించి వ్యక్తిగత సమాచారం, డబ్బును దోచుకునే ఈ తరహా స్కామ్‌లపై అప్రమత్తంగా ఉండటం అత్యంత అవసరమని చెప్పారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా తమ కష్టార్జితాన్ని రక్షించుకోవచ్చని పోలీసులు పేర్కొన్నారు. సైబర్ నేరగాళ్లు ముందుగా వినియోగదారులకు ఫోన్ చేసి, 'మీ వాటర్ బిల్లు బకాయి ఉందని, వెంటనే చెల్లించకపోతే కనెక్షన్ కట్ చేస్తాం' అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని పోలీసులు తెలిపారు. ఈ విధంగా ప్రజల్లో భయాన్ని సృష్టించి, ఒత్తిడి చేస్తున్నారని అన్నారు. ఆ తర్వాత ఒక అనుమానాస్పద లింక్‌ను పంపి, దాన్ని డౌన్‌లోడ్ చేసి ఇన్‌స్టాల్ చేయాలని సూచిస్తున్నారని చెప్పారు. ఇది అసలు అధికారిక యాప్ కాకుండా మాల్వేర్‌తో కూడిన ఫేక్ అని పోలీసులు హెచ్చరించారు. ఈ ఫేక్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసిన వెంటనే మొబైల్ ఫోన్‌పై పూర్తి నియంత్రణ సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. దీంతో వారు ఫోన్ కాల్స్‌ను డైవర్ట్ చేయగలరని, మెసేజ్‌లు, క్షిఖలను చదవగలరని, బ్యాంకింగ్ యాప్‌లను గమనించాలన్నారు. యూజర్ తెలియకుండానే ట్రాన్సాక్షన్లు చేయగలరని చెప్పారు. ఈ విధంగా క్షణాల్లో బ్యాంక్ ఖాతాలను ఖాళీ చేసే ప్రమాదం ఉందని పోలీసులు హెచ్చరించారు. నగర పాలక సంస్థలు, సైబర్ సెక్యూరిటీ నిపుణులు ప్రజలకు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు పంపే ఏ ఒఖబ్జ ÷ల్‌ను కూడా ఇన్‌స్టాల్ చేయకూడదని స్పష్టం చేశారు. ప్రజలు తమ నీటి బిల్లులను కేవలం అధికారిక వెబ్‌సైట్ లేదా అధికారిక మొబైల్ యాప్‌ల ద్వారానే చెల్లించాలని సూచించారు. అలాగే అనుమానాస్పద ఫోన్ కాల్స్ వస్తే వెంటనే స్పంది ంచకుండా అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

## నియోజకవర్గానికో మీడియా హౌజ్

### అంబాజీపేట ప్రెస్ క్లబ్ భవనాన్ని ప్రారంభించిన ఎంపి

అంబాజీపేట,ఏప్రిల్11 : ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి మీడియా హౌస్ నిర్మిస్తామని అమలాపురం ఎంపీ హరీష్ బాలయోగి అన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉండి అనేక సమస్యల పరిష్కారానికి దిక్సూచి వంటి వారని మీడియా ప్రతినిధులను కొనియాడారు. ది అసోసియేషన్ ఆఫ్ జర్నలిస్టు అంబాజీపేట ప్రెస్ క్లబ్ భవనాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పళ్ళ సూర్యప్రకాశరావు(బాబ్జి) అధ్యక్షతన జరిగిన సభలో ఎంపీ హరీష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో విలేకరులకు ఎటువంటి అసౌకర్యాలు కలవకుండా తగు చర్యలు తీసుకుంటా మన్నారు. సమాజంలో సుస్థిర పరిస్థితులకు మీడియా పాత్ర మరింత కీలకమని ఎంపీ గుర్తు చేశారు. మీడియా అక్రెడిటేషన్, రైల్వే పాస్ తదితర సదుపాయాల గురించి ప్రభుత్వంతో చర్చిస్తామని హామీ ఇచ్చారు. తన తండ్రి బాలయోగిపై చూపిన అభిమానం, ఆదరణ నాపై కూడా చూపాలని ఈ సందర్భంగా జర్నలిస్టు లను కోరారు. అనంతరం పి.గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, పత్రికా విలేకరులు సమాంతరంగా పనిచేసినప్పుడే సంఘంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తవన్నారు. తన నియోజకవర్గంలో కొంత మంది విలేకరులు తనపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని ఈ విషయాన్ని ప్రతి ఒక్కరు ఖండించాలని ఆవేదన వ్యక్తం చేశారు. నిజాలను నిర్భయంగా తెలిపే పత్రికలకు, వాస్తవాలను ఎటువంటి పక్షపాతం లేకుండా ఉన్నది ఉన్నట్లు రాసే జర్నలిస్టులకు సమాజంలో దానంతట అదే గుర్తింపు ఉంటుందని ఎంఎల్ఎ గుర్తు చేశారు. పి.గన్నవరం అక్విడెక్ట్ రిపేర్ల విషయంలో పలు నిందారోపణలు చేస్తూ పలు వార్తలను కొందరు రాయడం తగదన్నారు. అంబాజీపేట ప్రెస్ క్లబ్ భవనానికి మరిన్ని నూతన సదుపాయాలు చేకూర్చే ప్రయత్నం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపి చింతా అనురాధ, ఎంపిపి దొమ్మేటి వెంకటేశ్వరావు, ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## 13 నుంచి 18 వరకు అరైవ్-అలైవ్ కార్యక్రమం

### ప్రజాపాలనలో రోడ్డు భద్రతపై చైతన్యం: డిజిపి

హైదరాబాద్ : రోడ్డు ప్రమాదాలు నివారణ చర్యల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా అరైవ్-అలైవ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రభుత్వంలో ఉన్న అన్ని శాఖల సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈనెల 13వ తేదీ నుంచి 18వ తేదీ వరకు అరైవ్-అలైవ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రపంచ వ్యాప్తంగా ఎక్కువ రోడ్డు ప్రమాదాలు మన దేశంలోనే జరుగుతున్నాయని, ద్విచక్ర వాహనదారులు, పాదచారులు, రోడ్డు వెంట ఉన్న వారు ఎక్కువ సంఖ్యలో మృతిచెందుతున్నారని తెలిపారు. ప్రజా సంక్షేమం, భద్రతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వివిధ కార్యక్రమాలు అమలుచేస్తోందని అన్నారు. గ్రామాల్లో ఉన్న ఎంపీటీసీలు, సర్పంచ్‌ల నుంచి సీఎం వరకు ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలని తెలంగాణ ప్రభుత్వం ఆదేశించినట్లు డీజీపీ తెలిపారు.

# పారదర్శకంగానే మేడారం గద్దెల నిర్మాణం

### అవినీతిపై ఆధారాలు ఉంటే చూపాలి
### సెల్‌ఫోన్ కొనుగోళ్లపైనా కువిమర్శలు తగవు
### మంత్రి సీతక్క మరోమారు గట్టిగా జవాబు



ములుగు,ఏప్రిల్11 : మేడారం సమ్మక్క- సారక్క అమ్మవార్ల గద్దెల పునర్నిర్మాణ పనుల్లో ఎక్కడ అవినీతి జరగలేదని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. గద్దెల పున: నిర్మాణ పనుల్లో అవినీతి జరిగిందని అంటున్నారని.. ఆధారాలు ఉంటే చూపించాలని ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. అవసరమైతే సీబీఐ విచారణ జరపాలని సూచించారు. శనివారం ములుగులో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ పర్యటించారు. మహేశ్ గౌడ్‌కు గట్టమ్మ దేవాలయం వద్ద మంత్రి సీతక్క, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. గట్టమ్మ దేవాలయంలో మహేశ్ కుమార్ గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గట్టమ్మ దేవాలయం నుంచి భారీ బైక్ ర్యాలీగా ములుగు పట్టణ కేంద్రానికి నాయకులు, కార్యకర్తలు బయలుదేరారు. నాపై తప్పుడు ప్రచారం చేశారు.. ఈ సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడాన్ని బీఆర్ఎస్ నేతలు తట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. ఎన్నికల్లో తనను ఓడించేందుకు రూ.వందల కోట్లు ఖర్చుచేశారని, తనపై తప్పుడు ప్రచారం చేశారని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు తనను ప్రలోభాలకు గురిచేశారని.. అయినా తాను వారికి లొంగలేదని చెప్పారు. అంగన్‌వాడీ టీచర్లకు ఇచ్చే ఫోన్లలో అవినీతి జరిగిందని... అవినీతి సీతక్క అంటున్నారని.. జాగ్రత్తగా మాట్లాడాలని హెచ్చరించారు. తానెక్కడా అవినీతి చేయలేదని స్పష్టం చేశారు. రూ.11,650లకు ఫోన్లు కొంటే.. రూ.14000వేలని ప్రచారం చేస్తున్నారని మంత్రి సీతక్క ఆగ్రహించారు. ఇష్టానుసారంగా ఆరోపణలు చేసే ప్రతిపక్షాలకు మంత్రి సీతక్క వార్నింగ్ ఇచ్చారు. ఏది పడితే అది మాట్లాడితే ఊరుకోం.. చట్టపరమైన చర్యలు తప్పవు. దమ్ముంటే మీ ఆరోపణలు నిరూపించండంటూ సవాల్ విసిరారు. ములుగులో పోషణ పక్వాడ సందడి కార్యక్రమాన్ని ప్రారంభించారు మంత్రి సీతక్క. ఈ సందర్భంగా గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. గత ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీల పరిస్థితి అత్యంత దయనీయమన్నారు సీతక్క. కరెంటు లేదు, తాగునీరు లేదు, కనీస మౌలిక సదుపాయాలు లేవన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 12,500 అంగన్‌వాడీలకు భవనాలే లేకపోయినా నాటి పాలకులు పట్టించుకో లేదన్నారు. కానీ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మార్పు మొదలైందదన్నారు. ఇప్పటికే రెండు వేల కొత్త అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేశామని చెప్పారు. కేవలం పౌష్టికాహారం అందించడమే కాదు.. అంగన్‌వాడీలను సకల సౌకర్యాలతో 'ప్రీ-ప్రైమరీ స్కూల్స్'గా తీర్చిదిద్దుతుంటే.. అది ఓర్వలేక కొన్ని పార్టీలు అసత్య ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు సీతక్క. ఇక సెల్ ఫోన్ల కొనుగోలుపై క్లారిటీ ఇస్తూ.. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగానే ఐదుగురు నిపుణులైన అధికారుల కమిటీ పర్యవేక్షణలో అత్యంత పారదర్శకంగా టెండర్లు నిర్వహించామని స్పష్టం చేశారు. విమర్శలు పక్కన పెట్టి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతామని సీతక్క చెప్పారు.

## తెలుగు రాష్ట్రాల ఐటిడిఎల బలోపేతం

### ఒకరోజు కార్యశాలలో కేంద్ర డైరెక్టర్ సమీక్ష

హైదరాబాద్,ఏప్రిల్11 : తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని ఐటీడీఏల బలోపేత చర్యలపై కేంద్ర ప్రభుత్వం, గిరిజన మంత్రిత్వ శాఖ, హైదరాబాద్ లోని మాసబ్ టాంక్ లో ఉన్న గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో కార్యశాల నిర్వహించింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ డైరెక్టర్ డా. వర్నాలి డేకా హాజరయ్యారు. సమావేశంలో ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశాన్ని తెలియచేస్తూ డా. వి. సముజ్వల, సంచాలకులు, గిరిజన సాంస్కృతిక - శిక్షణా సంస్థ ఈ కార్యశాలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలనుండి హాజరైన గిరిజన సంక్షేమ శాఖ, ఐటిడిఎ అధికారులకు స్వాగతంపలికారు. ఐటీడీఏల ప్రస్తుత పరిస్థితి, వాటి బలోపేతం, విభిన్న రాష్ట్రాలలో అమలు అవుతున్న విధానాలలో తేడాలు, నిధుల వినియోగ విధానాలు వంటి అంశాలపై చర్చ జరిగింది. ఐటీడీఏల ద్వారా విద్య, ఆరోగ్యం, జీవనోపాధి, మౌలిక వసతుల అభివృద్ధిపై మరింత దృష్టి పెట్టాలని భావించారు. గిరిజన ప్రాంతాలలో జీవనోపాధి అవకాశాలను పెంపొందించడానికి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, యువతకు శిక్షణ, క్యాంపస్ ప్లేస్‌మెంట్లు నిర్వహించాల్సిన అవసరాన్ని గుర్తించారు. తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ ద్వారా యువతకు శిక్షణ అందించడం పై చర్చ జరిగింది. గిరిజన హక్కుల పరిరక్షణ, అటవీ హక్కుల చట్టం అమలు, భూమి సమస్యల పరిష్కారం, వలసల నియంత్రణ వంటి అంశాలపై కూడా సమగ్ర చర్చ జరిగింది. గ్రామ స్థాయిలో కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని సూత్రప్రాయంగా నిర్ణయించారు. గిరిజన విద్యా అభివృద్ధిలో భాగంగా స్థానిక భాషలలో ప్రాథమిక విద్య, కెరీర్ గైడెన్స్, మరియు ఆశ్రమ పాఠశాలల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు. కొన్ని ప్రాంతాలలో 100శాతం ఎస్సెస్సీ ఫలితాలు సాధించిన ఉత్తమ పద్ధతులను ఇతర ప్రాంతాలకు విస్తరించాలని నిర్ణయించారు. అంతేకాక, గిరిజన సహకార సంస్థల ద్వారా పెట్రోల్ బంకులు, ఎల్పీజీ, విత్తనాలు, ఎరువుల విక్రయ కేంద్రాల ఏర్పాటు, సహాయక సంఘాల ద్వారా జీవనోపాధి కార్యక్రమాల అభివృద్ధిపై చర్చించారు.

## ఆలస్యంగా ఇస్లామాబాద్ చర్చలు

### దౌత్యం విఫలం అయితే పంథా మార్చుకుంటామన్న ట్రంప్

ఇస్లామాబాద్,ఏప్రిల్11 : యూఎస్, ఇరాన్‌ల మధ్య ఇస్లామాబాద్ వేదికగా చర్చలు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. చర్చలకు ముందే ఇరాన్ పలు షరతులు విధించిందన్న వార్తల నేపథ్యంలో దాదాపు ఐదు గంటల ఆలస్యంగా చర్చలు ప్రారంభం అయ్యాయి. ఈ నేపథ్యంలో యూఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక హెచ్చరికలు చేశారు. ఇరాన్‌లో నిజాయతీ ఎంత ఉందో గమనిస్తుంటానని అన్నారు. చర్చల ఫలితం ఎలా ఉంటుందో తాను చెప్పలేనని కూడా అన్నారు. ఈ సందర్భంగా ఇరాన్‌పై ట్రంప్ విమర్శలు గుప్పించారు. ఇరాన్‌ను విఫలమవుతున్న దేశంగా అభివర్ణించారు. దౌత్యం విఫలమైతే యూఎస్ తన పంథాను పూర్తిగా మార్చుకుంటుందని అన్నారు. ఇరాన్‌తో మరింత కఠినంగా వ్యవహరించే అవకాశం ఉందని పరోక్షంగా సంకేతాలిచ్చారు. 'సమీప భవిష్యత్తులోనే హోర్ముజ్ తెరుచుకుంటుంది' అని కూడా చెప్పారు. హోర్ముజ్‌కు ప్రత్యామ్నాయాలు ఉన్న విషయాన్ని కూడా ప్రస్తావించారు. ఇక యూఎస్‌తో తమ ప్రభుత్వ చర్చలు కొనసాగుతాయని ఇరాన్ ప్రభుత్వ మీడియాలోనూ వార్తలు వెలువడ్డాయి. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం, ఇస్లామాబాద్‌లో దిగాక కూడా వాన్స్ బృందం ఇరాన్‌తో చర్చలు ప్రారంభించలేదు. ఇరాన్ విధించిన షరతులు, పరస్పర అపనమ్మకం కారణంగా చర్చలు ఆలస్యంగా ప్రారంభమైనట్టు సమాచారం. నేరుగా చర్చలు జరపడం సాధ్యం కాని పక్షంలో పాక్ మధ్యవర్తిగా త్రైపాక్షిక చర్చలు జరిగే అవకాశం ఉన్నట్టు కూడా అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి.

## లాయర్ ఫిర్యాదుకు ప్రతిగా మంగ్లీ కేసు

### నార్సింగ్ పోలీస్ స్టేసన్‌లో లాయర్‌పై ఫిర్యాదు

హైదరాబాద్,ఏప్రిల్11 : ప్రముఖ సింగర్ మంగ్లీ తనను సుభా సియపోగు అనే న్యాయవాది వేధిస్తున్నానంటూ నార్సింగి పోలీసులను ఆశ్రయించారు. తనపై తప్పుడు ఆరోపణలు చేస్తూ, అప్రతిష్ఠ పాలు చేస్తానని బెదిరిస్తున్నారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. మంగ్లీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. తాను రూ.150 కోట్ల మోసానికి పాల్పడ్డానంటూ సుభా సింగబోష్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంగ్లీ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని ఆమె స్పష్టం చేశారు. మార్చి 21న సుభా సియపోగు పేరుతో ఒక వ్యక్తి తనను పరిచయం చేసుకున్నాడని, అప్పటి నుంచి అమర్యాదగా, బెదిరించే ధోరణిలో మాట్లాడుతున్నాడని ఫిర్యాదులో వివరించారు. తనను కలవాలని సదరు వ్యక్తి తీవ్ర ఒత్తిడి చేశాడని, అందుకు నిరాకరించడంతో సోషల్ మీడియాలో, బయట అప్రతిష్ట పాలు చేస్తానని బెదిరించినట్లు మంగ్లీ ఆరోపించారు. తనకు ఎలాంటి సంబంధం లేని కరెన్సీ నోట్లు ఉన్న వీడియోలను చూపించి, మరో వ్యక్తితో కలిసి తనపై అవమానకర వ్యాఖ్యలు చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆమె పేర్కొన్నారు. ఈ పరిణామాల వల్ల తన కుటుంబ సభ్యులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, తన వ్యక్తిగత ప్రతిష్ట దెబ్బతింటోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మంగ్లీ ఇచ్చిన ఫిర్యాదును స్వీకరించిన నార్సింగి పోలీసులు, నిందితుడు సుభా సింగబోష్‌పై బిఎన్ఎస్ సెక్షన్లు 79, 351(3) కింద కేసు నమోదు చేశారు. అయితే ఇప్పటికే మంగ్లీపై పంజగుట్ట స్టేషన్‌లో న్యాయవాది కేసు నమోదు చేశారు. దీంతో పరస్పరం కేసులు నమోదు అయ్యాయి.

## హోర్ముజ్ దాటిన మరో భారతీయ నౌక

### కాల్‌ఉప విరమణ తరవాత ఇదే తొలి ప్రయాణం

న్యూఢిల్లీ,ఏప్రిల్11 : యూఎస్, ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరాక తొలిసారిగా ఒక భారత రిజిస్టర్డ్ నౌక హోర్ముజ్ జలసంధిని సురక్షితంగా దాటింది. ఎల్పీజీతో బయలుదేరిన జగ్ విక్రమ్ నౌక శుక్రవారం రాత్రి జలసంధిని దాటినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. దీంతో, మార్చి నుంచి ఇప్పటివరకూ హోర్ముజ్‌ను దాటిన భారత సరకు రవాణా నౌకల సంఖ్య 9కి చేరింది. అంతేకాకుండా, ప్రస్తుతం పర్షియన్ గల్ఫ్ జలాల్లో మరో 15 భారత రిజిస్టర్డ్ నౌకలు ఉన్నాయి. ఇవి కూడా త్వరలో హోర్ముజ్‌ను దాటనున్నట్టు తెలుస్తోంది. శనివారం మధ్యాహ్నానికి జగ్ విక్రమ్ నౌక హోర్ముజ్‌కు తూర్పున ఉన్న గల్ఫ్ ఆఫ్ ఒమాన్ జలాల్లో ప్రయాణిస్తోంది. ఈ నౌకలో సుమారు 20 వేల టన్నుల ఎల్పీజీ ఉన్నట్టు సమాచారం. మధ్యస్థాయి సరకు రవాణా సామర్థ్యం కలిగిన ఈ నౌక ముంబైలోని గ్రేట్ ఈస్టర్న్ కంపెనీకి చెందినది. మరికొన్ని రోజుల్లో ఈ నౌక భారత్‌కు చేరుకుంటుంది. గల్ఫ్‌లో ఉద్రిక్తతలు మొదలైన నాటి నుంచీ అనేక నౌకలు హోర్ముజ్‌కు పశ్చిమాన ఉన్న పర్షియన్ గల్ఫ్ జలాల్లో నిలిచిపోయాయి. జగ్ విక్రమ్‌తో పోలిస్తే రెండింతల సామర్థ్యం ఉన్న గ్యాస్ క్యారియర్లు కూడా వీటిల్లో ఉన్నాయి. ఇక ప్రస్తుతం పర్షియన్ గల్ఫ్‌లోని భారత నౌకల్లో ఒక ఎల్పీజీ ట్యాంకర్, నాలుగు ముడి చమురు ట్యాంకర్లు, ఒక ఎల్ఎన్జీ క్యారియర్, ఒక కెమికల్ ఉత్పత్తుల ట్యాంకర్, మూడు కంటెయినర్ ట్యాంకర్లు, రెండు బల్క్ క్యారియర్లు ఉన్నాయి. వీటితో పాటు కొన్ని ట్యాంకర్లకు మరమ్మతులు జరుగుతున్నట్టు సమాచారం.

## సూళ్లూరుపేట జ్యువెలరీ చోరీ కేసు ఛేదన

### తమిళనాడుకు చెందిన పాత నేరస్తుడి అరెస్ట్

తిరుపతి : తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో సంచలనం రేపిన జ్యువలరీ రాబరీ కేసును పోలీసులు ఛేదించారు. తమిళనాడుకు చెందిన అంతర్రాష్ట్ర నేరస్థుడు వేల్మురుగన్ బాబు అలియాస్ పల్సర్ బాబు అరెస్టు కావడం కేసుకు కీలక మలుపు తిరిగింది. మార్చి 14న మధ్యాహ్నం సుమారు 2-30 గంటల సమయంలో శ్రీ వెంకటేశ్వర జ్యువెలరీ షాపులో కస్టమర్ వేషంలో ప్రవేశించిన నిందితుడు సినీ పక్కిలో విధంగా యజమాని వెంకటేశ్వర్లు కళ్ళల్లో కారంపొడి చల్లి 12 బంగారు గొలుసు నందు దోచుకుని పరారయ్యాడు. సుమారు 14 లక్షల విలువైన ఈ ఆభరణాలు క్షణాల్లో మాయం అవడంతో పట్టణంలో కలకలం చెల్లరేగింది. దశాబ్ద కాలంగా నేర జీవితం గడుపుతున్న నిందితుడు తమిళనాడులోనే 24 కేసుల్లో నిందితుడిగా ఉండి అందులో 16 రాబరీలు, 7 దొంగతనాలు, ఒక హత్యాయత్నం కేసులు ఉన్నాయి. పలు నాన్ బెయిల్ వారెంట్ లు పెండింగ్ లో ఉండగా, తిరుపతి జిల్లాలోని పుత్తూరు, శ్రీకాళహస్తి ప్రాంతాల్లో కూడా శిక్ష అనుభవించాడు. జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు ఆదేశాలతో అదనపు ఎస్పీ శ్రీనివాసులు, నాయుడుపేట డిఎస్పి చెంచు బాబు, పర్యవేక్షణలో సూళ్లూరుపేట సి.ఐ.మురళీకృష్ణ నేతృత్వంలో ప్రత్యేక బృందం గాలింపు చర్యలు చేపట్టి, సూళ్లూరుపేట ఎస్సై జి. అజయ్ కుమార్, తడ ఎస్సై కే. కొండప్ప నాయుడు, ఏ.ఎస్.ఐ. పులిచెర్ల శ్రీ కుమార్ రెడ్డి చాకచక్యంగా ఏప్రిల్ 11 ఉదయం సత్యవేడు పట్టణంలో బిఎస్ఎన్ఎల్ సమీపంలోని మెకానికల్ షాపు వద్ద నిందితుని అదుపులోకి తీసుకుంది. నిందితుడి వద్ద నుంచి దొంగలించిన 12 బంగారు గొలుసులు నేరానికి ఉపయోగించిన స్కూటీ స్వాధీనం చేసుకోవడంతో కేసుకు పూర్తి పరిష్కారం లభించింది. నేరం ఎంత చాకచక్యంగా ఏన్నుకొన్న చట్టం కన్నుల నుండి తప్పించుకుపోవడం అసాధ్యం అనే విషయాన్ని ఈ ఘటన మరోసారి స్పష్టం చేసింది.

## ఎన్నో ఏళ్ల కల నెరవేరబోతోంది

### మహిళా బిల్లు ఆమోదంతో రాజకీయ అధికారం
### బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

హైదరాబాద్ : పార్లమెంట్‌లో నారీ శక్తి వందనం బిల్లును ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈనెల 16వ తేదీన ప్రవేశ పెట్టనున్నారని బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ వ్యాఖ్యానించారు. ఎన్నో ఏళ్లుగా ఈ బిల్లు కోసం మహిళలు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. ఈ బిల్లు అమలైతే మహిళలకు 33 శాతం రిజర్వేషన్ దక్కుతుందని చెప్పుకొచ్చారు. వచ్చే ఎన్నికల్లో 33 శాతం రిజర్వేషన్ల కోసం పార్లమెంట్‌లో ప్రత్యేక సమావేశాలు పెట్టారని.. ఈనెల 16, 17, 18 తేదీల్లో సెషన్ జరగనుందని వెల్లడించారు. శనివారం హైదరాబాద్‌లోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో ఎంపీ డీకే అరుణ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్‌తో సహా అనేక పార్టీలు మహిళా బిల్లును వ్యతిరేకించాయని తెలిపారు. గతంలో చాలామంది ఈ బిల్లు తేవాలని చూశారు.. తప్ప ఎవరి వల్ల అది సాధ్యమవ్వలేదని.. కానీ మోదీ ఈ బిల్లును సుసాధ్యం చేయనున్నారని అన్నారు. చట్టం చేయడమే కాదని.. అమలు చేయడంపైనా కసరత్తు జరుగుతోందని చెప్పారు. పార్టీకలతీతంగా ఈ బిల్లుకు మద్దతు పలకాలని సూచించారు. మహిళలు రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉందని ఎంపీ డీకే అరుణ ఆకాంక్షించారు. ఒకప్పుడు వంటింటికే పరిమితమైన మహిళ.. ఇప్పుడు అన్ని రంగాల్లో రాణిస్తోందని ఉద్ఘాటించారు. చట్టసభల్లో కూడా మహిళలు ఉంటే ఆయా ప్రాంతాలు, రాష్ట్రాల్లో వారికి ఇచ్చిన బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తారని తెలిపారు. ఆర్థిక, విద్య, ఉపాధి వంటి అన్ని రంగాల్లో తమ మార్క్ చూపిస్తారని వివరించారు. భారత ఖ్యాతిని ప్రపంచ స్థాయికి తీసుకెళ్తారన్నారు. ఈ బిల్లును అడ్డుకోవాలనే ఆలోచనను మార్చుకోవాలని చెప్పారు. మహిళలకు గౌరవాన్ని పెంచాలని సూచించారు. వికసిత్ భారత్ 2047 లక్ష్యానికి ఎంతో సమయం లేదని.. కానీ మహిళా శక్తికి రాజకీయ శక్తి తోడైతే వికసిత్ భారత్ లక్ష్యానికి సులువుగా చేరుకోవచ్చని వివరించారు. ఈ బిల్లుకు ఆమోదం తెలిపితే క్రెడిట్ బీజేపీకి ఎక్కడ పోతుందోనని ఆలోచించకుండా పార్టీలకతీతంగా మద్దతు తెలపాలని అన్నారు. మహిళలను తక్కువ అంచనా వేస్తున్నారనే అపవాదును దేశానికి తీసుకురావద్దని ఎంపీ డీకే అరుణ పేర్కొన్నారు. 2029 ఎన్నికల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలయ్యేలా చూడాలని ఎంపీ డీకే అరుణ కోరారు. ఇది ఒక చట్టం కాదని.. కోట్లాది మంది మహిళల ఆశ, ఆశయమని ఉద్ఘాటించారు. చట్టానికి ఆమోదం తెలిపితే కొత్త శకానికి నాంది పలకనుందని వ్యాఖ్యానించారు. తెలంగాణ నుంచి పార్లమెంట్‌లో ప్రస్తుతం ఇద్దరు మహిళలమే ప్రాతినిధ్యం వహిస్తున్నామని వివరించారు. ఈ బిల్లు అమలైతే స్థానాలు పెరుగుతాయని చెప్పుకొచ్చారు. డీ లిమిటేషన్ కూడా పూర్తయితే తెలంగాణ నుంచి 9 మంది మహిళలు పార్లమెంట్‌లో అడుగు పెడతారని తెలిపారు. తెలంగాణలో మొత్తం అసెంబ్లీ స్థానాలు 180 వరకు పెరుగుతాయని.. అంటే 60 మంది మహిళలు అసెంబ్లీలో ఉంటారని ప్రస్తావించారు. ఎస్సీ, ఎస్టీలకు కూడా మంచి అవకాశాలు రానున్నాయని వివరించారు. ఇది తాత్కాలికం కాదని.. మూడు టర్మ్‌ల వరకు ఈ రిజర్వేషన్లు కొనసాగుతాయని వెల్లడించారు.

## నర్మదాలో 11వేల లీటర్ల పాలు ఒలకబోత

### పర్యావరణవేత్తల ఆందోళన

భోపాల్,ఏప్రిల్11 : మధ్యప్రదేశ్‌లోని సీహోర్ జిల్లా భైరూందా సమీపంలో నర్మదా నది తీరాన నిర్వహించిన ఓ ఆధ్యాత్మిక ఉత్సవం ఇప్పుడు వివాదానికి కేంద్ర బిందువుగా మారింది. నది స్వచ్ఛతను కాపాడాలని ప్రార్థిస్తూనే, ఏకంగా 11,000 లీటర్ల పాలను నదిలోకి ఒంపడంపై పర్యావరణవేత్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భైరూందా ప్రాంతంలో గత 21 రోజులుగా భారీ ఎత్తున ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుక ముగింపు సందర్భంగా నర్మదా నదికి 'దుగ్ధాభిషేకం' నిర్వహించా లని నిర్వాహకులు నిర్ణయించారు. ఇందులో భాగంగా.. ట్యాంకర్ల ద్వారా భక్తులు జయజయ ధ్వానాల మధ్య సుమారు 11,000 లీటర్ల పాలను నేరుగా నర్మదా నదిలోకి వదిలేశారు. నది స్వచ్ఛంగా ఉండాలని కోరుకుంటూ ఈ అభిషేకం చేశామని వారు చెబుతున్నారు. ఇదిలా ఉంటే.. నదిని పూజించడం వరకు బాగానే ఉన్నా, పాలను ఈ స్థాయిలో నీటిలో కలపడం వల్ల పర్యావరణానికి తీవ్ర హాని జరుగుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పాలు నీటిలో కలిగినప్పుడు అవి కుళ్ళిపోయే క్రమంలో నీటిలోని కరిగిన ఆక్సిజన్ వేగంగా తగ్గిపోతుంది. ఇది చేపలు, ఇతర జలచరాల మరణానికి కారణమవుతుంది. అంతేకాదు, పాలలో ఉండే సేంద్రియ పదార్థాల వల్ల నీటిలో హానికరమైన బ్యాక్టీరియా వృద్ధి చెంది, నీరు కలుషితం అవుతుందని పర్యావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. నదులను పవిత్రంగా భావించడం భారతీయ సంస్కృతిలో భాగమే అయినప్పటికీ, ఆ పవిత్రతను కాపాడే క్రమంలో పర్యావరణానికి నష్టం చేకూర్చడం సరికాదని మేధావులు సూచిస్తున్నారు.

## 20న మోతెలో భారీ బహిరంగ సభ

### సభాస్థలిని పరిశీలించిన బిఆర్ఎస్ నేతలు

జగిత్యాల,ఏప్రిల్11 : జగిత్యాల జిల్లా మోతెలో ఈ నెల 20వ తేదీన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ భారీ బహిరంగ సభ జరగనుంది. ఈ సందర్భంగా సభాస్థలిని పార్టీ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్యే కల్వంకుట్ల సంజయ్, మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, జీవన్ రెడ్డి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, తుల ఉమ పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ.. ఈ నెల 20న మోతెలో కేసీఆర్ భారీ బహిరంగ సభ ఉండబోతుందని తెలిపారు. లక్షకు పైగా జనాభాకు అనుగుణంగా సభాస్థలిని ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ.. ప్రజాభీష్టం మేరకే జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో రెండున్నరేళ్లలో తెలంగాణ అస్తవ్యస్తమైందని విమర్శించారు. కేసీఆర్ పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. జీవన్ రెడ్డి ఏనాడూ అధికారం కోసం పాకులాడలేదని కల్వకుంట్ల సంజయ్ అన్నారు. బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని గుర్తించిన ఆయన బీఆర్ఎస్‌లో చేరారని తెలిపారు. స్థానిక ప్రజలు, కార్యకర్తల అభిప్రాయంతోనే బీఆర్ఎస్‌లోకి జీవన్ రెడ్డి వచ్చారని పేర్కొన్నారు. జీవన్ రెడ్డి మార్గదర్శనం, సూచనలతో ముందుకెళ్తామని స్పష్టం చేశారు.

## సంపాదకీయం

# ఆత్మరక్షణలో కాంగ్రెస్!

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బిఆర్ఎస్ అవినీతి కొట్టుకు పోయింది. వారిని విచారిస్తామన్న కేసులు వెనక్కి పోయాయి. కాళేశ్వరం, కార్ రేసు, ధరణివంటి వన్నీ ఇప్పుడు వెనక్కి పోయాయి. పదేపదే బిఆర్ఎస్ నేతలపై అవినీతి ఆరోపణలు చేసిన సిఎం రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు అయినా బిఆర్ఎస్ నేతల అవినీతి గురించి నిరూపించలేకపోయారు. ఇది యాదృచ్ఛికమా లేక మరేదైనా కారణం ఉందా అన్నది తెలియదు. ఈ క్రమంలో కాంగ్రెస్ మంత్రులపై అవినీతి అంశం తెరపైకి వచ్చింది.మంత్రులం దరిపైనా అంతో ఇంతో బురదపడుతూనే ఉంది. ప్రధానంగా మంత్రి పొగులేటిపై విపరీతమైన ఆరోపణలు వస్తున్నాయి. వాటిని ఆయన ఖండిస్తున్నా...ప్రజల్లో నమ్మకం కలగడం లేదు. తమపై బురదజల్లుతున్నారని మంత్రులు పొంగులేటి తదితరులు అంటున్నారు. నిప్పులేనిదే పొగరాదు. ప్రభుత్వంలో ఉంటూ అవినీతి గురించి ఆరోపణలు వచ్చినప్పుడు నేరుగా స్పందించాలి. నిజనిర్ధారణ జరగాలి. ముఖ్యంగా నాదర్‌గుల్ భూములపై తీవ్ర ఆరోపణలు వచ్చాయి. ఆయన తనయుడకి భాగం ఉందని ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో అక్కడి భూములు ప్రభుత్వానివే అయితే చర్యలు తీసుకుని ఉంటే నమ్మకం కలిగేది. కానీ అలా జరగలేదు. ఇవి ప్రభుత్వ భూములే అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మీడియా సమావేశంలో చెప్పి కంపెనీలకు వత్తాసు పలికారే గానీ రైతుల గురించి ఒక్కమాటైనా చెప్పలేదని తాజాగా రైతులు నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష నేతలను విమర్శించడం కాదు, రైతులకు ఏం చేస్తదో చెప్పాలని పట్టుబట్టారు. అధికారంలో ఉన్నది కాంగ్రెస్ పార్టీయే కదా.. మీరే న్యాయం చేయించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో నాదర్‌గుల్ రైతులు కదంతొక్కారు. దశాబ్దాలుగా సాగుచేసుకుంటున్న భూములకు దూరమై భూపోరాటానికి దిగిన రైతు కుటుంబాలు.. శుక్రవారం మరోసారి తమ భూముల వద్దకు వెళ్లి ప్రైవేట్‌సైన్యంపై విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ నేతలను కడిగిపారేసిన నాదర్‌గుల్ రైతులు ÷ాజకీయాలు చేయడం మానుకొని రైతులకు ఎలా న్యాయం చేస్తారో చెప్పాలని నాదర్‌గుల్ రైతులు కాంగ్రెస్ నేతలకు తెగేసి చెప్పారు. ప్రతిరోజూ రైతులు వంటావార్పుతో పాటు పలు రీతుల్లో నిరసన కొనసాగిస్తుండగా భూపోరాటానికి బీఆర్ఎస్ సహా వామపక్ష పార్టీలు, ఇతర ప్రజాసంఘాలు వారికి మద్దతు పలికాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నేతలు సైతం సంఘీభావం తెలుపుదామని భావించారు. మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నేతల ఆదేశానుసారం స్థానిక నాయకులు శుక్రవారం రైతుల వద్దకు వెళ్లి సమావేశం ఏర్పాటు చేశారు. వచ్చీరాగానే గత బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డిపై ఆరోపణలు గుప్పించడంతో రైతులు అడ్డుకున్నారు. రెండున్నరేండ్లుగా భూముల్లోకి వెళ్లనివ్వకుండా ప్రైవేట్ కంపెనీలు ఇబ్బందులు పెడుతుంటే ఎందుకు పట్టించుకోలేదని రైతులు నిలదీశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కాంగ్రెస్ పెద్దల వద్దకు వెళ్తే ఎవరూ న్యాయం చేయలేదని, గోడు వినలేదని ప్రశ్నించారు. రైతులు మాటలతో ఎదురుదాడి చేయడంతో హస్తం నేతలు కంగుతిన్నారు. ఏదో అనుకుంటో ఏదో జరిగిందని వారి ప్రశ్నలకు సమాధానం చెప్పకుండానే వెనుదిరిగారు. వాస్తవానికి రైతుల్లో విభేదాలు సృష్టించేందుకే కాంగ్రెస్ నేతలు వచ్చారని పలువురు రైతులు ఆరోపించారు.ఆ కంపెనీలు వేసిన రేకుల కంచెను దాటుకొని, పోలీసులు, బౌన్సర్లను సైతం లెక్క చేయకుండా భూముల్లోకి చొచ్చుకొని వెళ్లారు. ఈ అనూహ్య పరిణామాలతో అక్కడ కొన్ని గంటల పాటు ఉద్రిక్తత నెలకొన్నది. తమకు సంఘీభావం తెలిపేందుకు వచ్చిన ధర్మసమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహరాజ్‌ను తీసుకొని లోపలికి పోయేందుకు రైతులు ప్రయత్నించగా పోలీసులు మెయిన్ గేటు వద్దే నిలువరించారు. చాలాసేపు వాగ్వాదం చేసిన తర్వాత గేటు తీసి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు తాళ్లు పట్టుకొని గేటుకు అడ్డుగా రక్షణ వలయంగా నిల్చున్నా రైతులు లెక్క చేయలేదు.ఎన్ని కేసులు పెట్టుకుంటారో పెట్టుకోండి అంటూ ముందుకు తోసుకుంటూ వెళ్లారు. లోపలి వైపు ప్రైవేట్ సైన్యం గేటును అదిమిపట్టినా రైతులు పట్టువీడకపోవడంతో ఒక్కసారిగా గేటు తెరుచుకుంది. దీంతో పదుల సంఖ్యలో రైతులు లోపలికి వెళ్లి బౌన్సర్లను తరిమికొట్టారు. ఒకేసారి పెద్ద ఎత్తున రైతులు రావడంతో బౌన్సర్లు భయంతో భూముల్లోకి పరుగులు తీశారు. రెండేండ్లుగా తమల్ని తమ భూముల్లోకి వెళ్లనివ్వకుండా అడ్డుకుంటున్న బౌన్సర్లపై తీవ్ర ఆగ్రహంతో ఉన్న రైతులు వారిని ఉరికించారు. ఈ క్రమంలో కొంతమంది బౌన్సర్లు గుంతల్లో పడిపోగా మరికొందరిని రైతులు పట్టుకొని దాడి చేసేందుకు ప్రయత్నించడంతో పరిస్థితి గందరగోళంగా మారింది. అయితే ఎవరిపైనా దాడులు చేయొద్దని విశారదన్ మహరాజ్ వచ్చి రైతుల్ని వారించి, బౌన్సర్లను అక్కడినుంచి పంపించారు. ఆ తర్వాత రైతులు భూముల వద్దకు వెళ్లి ప్రైవేట్ కంపెనీలు ధ్వంసం చేసిన బోర్లను, బావులను పూడ్చిన తీరును విశారదన్ మహరాజ్‌కు చూపించారు. పొలాల కోసం వేసుకున్న పైపులను కూడా ధ్వంసం చేశారని, కాలువలను లేకుండా చేశారని, కరెంటు వైర్లను తగులబెట్టారని రైతులు వాటిని చూపుతూ ఆవేదన చెందారు. చాలాకాలం తర్వాత పొలాల్లోకి వెళ్లినందుకు రైతులంతా సంతోషం వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వంలో చలనం లేదు. మొన్న వట్టినాగుల పల్లి, ఇవాళ నాదర్‌గుల్ భూముల విషయంలో ప్రభుత్వం తీరుపై అనుమానాలు ఉన్నాయి. వీటిపై నిజాలు చెప్పాల్సిన బాధ్యత సిఎం రేవంత్ రెడ్డిపై ఉంది.

# 27లక్షల మందికి ఓటు లేనట్టేనా?



ఏనాడూ కనీవినీ ఎరుగని విధంగా ఈసారి పశ్చిమబెంగాల్ ఎన్నికల ఘట్టంపై దేశమంతా ఉత్కంఠతో చూస్తోంది. దీనికి కారణం దాదాపు 27 లక్షల మంది ఓటర్లు జాబితాలో లేకుండానే ఎన్నికలు జరగనుండడం. వీరందరి అభ్యంతరాలు ఇంకా న్యాయపరిశీలనలోనే ఉన్నాయి. పోలింగ్ నాటికి వీరి పరిస్థితి ఏమవుతుందో చెప్పలేం. ఇంతవరకు ఎటూ తేలక వీరంతా త్రిశంకు స్వర్గంలో తేలియాడుతున్నారు. ఫలితంగా ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (సర్) జరగక ముందున్న అసలు 7.66 కోట్ల ఓటర్ల జాబితా ఇప్పుడు 12% వరకు కుదించుకుపోయింది. వివాదాలమయంగా తయారైన ఈ సవరణ ప్రక్రియ ప్రజాస్వామ్య ఆదర్శాలనే సవాలు చేస్తోంది. ఓటర్ల జాబితాలో తప్పుల తడకలు, అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోవడం, తదితర సమస్యలు ప్రజాస్వామ్య మూలాలనే ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ఇది ఎన్నికల ప్రక్రియ విశ్వసనీయతను దెబ్బతీస్తుంది. చివరకు ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ అనుమానాస్పదంగా మారుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో రాజ్యాంగానికి ధర్మరక్షకులుగా ఉన్న రాష్ట్రపతి, రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను కాపాడవలసిన బాధ్యత కలిగిన సుప్రీం కోర్టు జోక్యం చేసుకుంటేగానీ ఈ ఎన్నికల ప్రక్రియ పవిత్రత సిద్ధించదు. రాజ్యాంగం లోని ఆర్టికల్ 326 చెబుతున్న ప్రకారం వయోజన ఓటు హక్కు ఆధారంగా పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు జరుగుతుంటాయి. భారత పౌరులు ఎవరైనా 18ఏళ్లు నిండితే ఓటు హక్కు పొందే బాధ్యత తప్పనిసరి. ఈ మేరకు నమోదు చేయించుకోవలసి ఉంటుంది. ఇక 324(1) ప్రకారం పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలకు సన్నద్ధం కావడం, ఓటర్ల జాబితాలను తయారు చేయడం, సవరించడం, ఎన్నికలను పర్యవేక్షించడం, మార్గదర్శకాలు జారీ చేయడం ఇవన్నీ ఎన్నికల కమిషన్ నిర్వర్తించాల్సిన విధులు. కానీ పౌరులు తమ పొరపాటు లేకుండానే ఓటు హక్కును కోల్పోయే పరిస్థితి పశ్చిమబెంగాల్‌లో ఇప్పుడు ఏర్పడింది. పౌరుల సార్వత్రిక వయోజన ఓటు హక్కు అనే భావనపై ఎన్నికల సంఘం వైఖరి తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తింది. పశ్చిమబెంగాల్‌లో దాదాపు 92 లక్షల మంది పేర్లను 'తార్కిక అసమానతలు' పేరున తొలగించడం, ఈ పేర్ల తొలగింపుపై 60 లక్షల మంది అభ్యంతరాలు లేవదీయడం, ప్రజాస్వామ్య సూత్రాలనే ప్రశ్నిస్తోంది. అసమానతలపై అనితర పౌరు ఈచర్య పౌరులు తమ ఓటు హక్కును, ఎన్నికల్లో నిలబడే హక్కును, వారి తప్పిదం లేకుండానే తొలగించిందనే విమర్శలు తీవ్రంగా వచ్చాయి. రాష్ట్రంలో ఎన్నికల ముందు ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియను ఎన్నికల కమిషన్ చేపట్టడం, దానికి పెట్టిన గడువులు కూడా అనుమానాస్పదంగా ఉన్నాయి. ఏప్రిల్ మే నెలల్లో ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడానికి ఎన్నికల కమిషన్ ఓ వైపు సిద్ధమవుతూ మరోవైపు 92 లక్షల మందిని ఓటర్ల జాబితాల్లోంచి తొలగించడం, ఓటర్ల నమూనా జాబితాను ఫిబ్రవరి 28న ప్రకటించడం ఇవన్నీ ఒక పద్ధతి లేకుండా ఎందుకింత హడావుడిగా చేశారో తెలియడం లేదు. తార్కిక వైరుధ్యం లేదా తార్కిక వ్యత్యాసం పేరున జాబితానుంచి పేర్లు తొలగించడంపై దాదాపు 60లక్షల మంది తమ అభ్యంతరాలను లేవదీశారు. వీరంతా సుప్రీం కోర్టును ఆశ్రయించడంతో ఈ పిటిషన్లపై సుప్రీం కోర్టు విచారణ చేపట్టింది. పేర్లు తొలగింపుపై ఎన్నికల కమిషన్ చేసిన వాదనలు సుప్రీం కోర్టును ఏమాత్రం ప్రభావితం చేయలేదు. భారత దేశ వాస్తవ పరిస్థితులకు, ఎన్నికల కమిషన్ అనుసరిస్తున్న విధానాలకు ఎక్కడా పొంతన కుదరడం లేదని సుప్రీం కోర్టు అసంతృప్తి వెలిబుచ్చింది. కష్టాల కడలిలో కరెంటు కార్మికులు అయినప్పటికీ ఎన్నికల కమిషన్ తన సవరణ ప్రక్రియను కొనసాగించుకోవచ్చని గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం చర్చనీయాంశం అవుతోంది. అయితే తొలగించబడిన లక్షలాది మంది ఓటర్ల పేర్లను తిరిగి జాబితాలో చేర్చుకునే ప్రక్రియకు సుప్రీం కోర్టు బాధ్యత వహించడం హర్షణీయమే. వాస్తవానికి ఆ పని ఎన్నికల కమిషన్ చేయాల్సింది. అభ్యంతరాలను పరిష్కరించి జాబితాలను కట్టుదిట్టం చేయడానికి సుప్రీం కోర్టు ఏప్రిల్ 7 వరకు ఎన్నికల కమిషన్‌కు గడువు ఇచ్చింది. గడువు లోగా పరిష్కరించడానికి వీలుగా 700 మందికి పైగా న్యాయమూర్తులను నియమించేలా సుప్రీం కోర్టు ఎన్నికల కమిషన్‌కు సహకరించింది. కానీ తార్కిక వ్యత్యాసం జాబితాలో ఉన్న 27 లక్షల మంది ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా అప్పీలుకు వెళ్లే హక్కున్నప్పటికీ, అది లేకుండా పోయింది. ఓటరు జాబితాలో తమ స్థానాలను చూసుకోలేని నిస్సహాయ స్థితిలో పడ్డారు. ఇజ్రాయెల్ దూకుడుతో మళ్లీ సంక్షోభం ఫిర్యాదులతో అప్పిలేట్ ముందు ఎవరైతే వేచి ఉన్నారో వారి వివాదాలు ఎటూ తేలకుండానే ఎన్నికల కమిషన్ తనపని తాను చేసుకునిపోతోంది. వీరి ఫిర్యాదులను గాలికి విడిచిపెట్టి ఎన్నికలను కమిషన్ నిర్వహించడానికి సిద్ధమైతే ఇది అత్యంత నీచమైన నాటకం అవుతుంది. పౌరులను ఓటరు జాబితా నుంచి ఎందుకు తొలగించారో దానికి తగిన సాక్ష్యాధారాలు ఎన్నికల కమిషన్ నిరూపించగలగాలి. అలా కాకుండా 'మిమ్మల్ని ఓటర్ల జాబితా నుంచి ఎందుకు కొనసాగించాలి?' అని పౌరులను ఎన్నికల కమిషన్ ప్రశ్నిస్తే అంతకన్నా విడ్డూరం మరొకటి ఉండదు. అది సహజ న్యాయ సూత్రాలకు, రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధం. ఒక పౌరుడ్ని ఓటరుగా నిరూపించుకోమనడం న్యాయబద్ధమైన ప్రక్రియను పాటించకపోవడమే అవుతుంది. పౌరుడి రాజ్యాంగపరమైన ఓటు హక్కుకు భంగం కలిగించేలా ఎన్నికల సంఘం బాధ్యతలను విస్మరించే పరిస్థితి ఎదురైనప్పుడు రాష్ట్రపతి, సుప్రీం కోర్టు జోక్యం చేసుకోవడం తప్పనిసరి. పౌరుల హక్కులను కాపాడేందుకు, రాజ్యాంగపరమైన ఆదేశాలను అమలు చేయాల్సిన బాధ్యత వారిపై ఉంది. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనది.

# న్యాయవాదికి బెదరింపులు

## గాయని మంగ్లీ తదితరులపై కేసు

హైదరాబాద్,ఏప్రిల్11 : తెలుగు రాష్ట్రాల్లో ఫోక్ సాంగ్స్‌తో విశేష గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ గాయని



మంగ్లీ ఇప్పుడు వివాదంలో చిక్కుకున్నారు. పెట్టుబడుల పేరుతో డబ్బులు సేకరించి మోసం చేయడం, అలాగే న్యాయవాదిని బెదిరించడం వంటి ఆరోపణలపై ఆమెపై కేసు నమోదవడం సంచలనంగా మారింది. పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఈ కేసు ప్రకారం, మంగ్లీ, ఆమె సోదరుడు శివ మరియు మరికొంత మంది కలిసి సుమారు 100 మంది నుంచి భారీ మొత్తంలో నిధులు సేకరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. వ్యాపారంలో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు ఇస్తామని నమ్మించి ఈ డబ్బులు తీసుకున్నట్లు బాధితులు తెలిపారు. అయితే, కాలం గడుస్తున్నా ఎటువంటి లాభాలు ఇవ్వకపోవడం మాత్రమే కాకుండా, పెట్టుబడిగా ఇచ్చిన అసలు డబ్బును కూడా తిరిగి ఇవ్వలేదని బాధితులు ఆరోపిస్తున్నారు. దీంతో వారు ఆందోళన చెందుతూ న్యాయం కోసం న్యాయవాది సుబ్బారావును ఆశ్రయించారు. ఈ వ్యవహారంలో న్యాయవాది జోక్యం చేసుకోవడంతో వివాదం మరింత ముదిరింది. బాధితుల తరపున డబ్బులు తిరిగి ఇవ్వాలని నిలదీయగా, మంగ్లీ మరియు ఆమె బృందం నుంచి బెదిరింపులు వచ్చాయని సుబ్బారావు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇంకా, ఈ కేసులో దర్శకుడు వేణు ఊడుగుల పేరు కూడా వెలుగులోకి రావడం గమనార్హం. మంగ్లీ, శివ, వేణు ఊడుగుల కలిసి ఫోన్ ద్వారా తీవ్రంగా బెదిరించారని, తనను యాక్సిడెంట్ చేయించి చంపేస్తామని హెచ్చరించారని న్యాయవాది ఆరోపించారు. ఈ నేపథ్యంలో తనకు ప్రాణహాని ఉందని పేర్కొంటూ పోలీసుల వద్ద రక్షణ కోరారు. ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు ప్రాథమిక విచారణ చేపట్టి, మంగ్లీ, శివ, వేణు ఊడుగుల మరియు ఇతరులపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసును పోలీసులు సీరియస్‌గా తీసుకుని దర్యాప్తు ప్రారంభించారు.వరుస హిట్ పాటలతో కెరీర్‌లో దూసుకుపోతున్న మంగ్లీపై ఈ తరహా ఆరోపణలు రావడం సినీ, సంగీత రంగాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ కేసులో నిజానిజాలు ఏవో దర్యాప్తులో తేలాల్సి ఉంది. కాగా, తన పాటలతో మంచి ఫేమ్ అందిపుచ్చుకున్న మంగ్లీ వివాదాలతో ఇమేజ్ బ్యాడ్ చేసుకుంటుంది.

# మా పోరాటం వల్లనే రైల్వేజోన్ వచ్చింది

## శిక్ష కేసును హైకోర్టులో సవాల్ చేస్తా: గుడివాడ

విశాఖపట్టణం,ఏప్రిల్11 : అప్పట్లో రైల్వేజోన్ కోసం పోరాటం చేయడం వల్లే ఇప్పుడు విశాఖకు జోన్ వచ్చిందని వైకాపా నాయకుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు.విశాఖకు ప్రత్యేక రైల్వేజోన్ కేటాయించాలని కోరుతూ 2016 ఏప్రిల్‌లో అమర్‌నాథ్ ఆందోళనలు నిర్వహించారు. స్థానిక జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేశారు. ఈ ఘటనపై అప్పట్లో టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో గుడివాడకు ఆరు నెలల జైలుశిక్షతో పాటు రూ.5 వేలు జరిమానా విధిస్తూ.. విశాఖపట్నంలోని రెండో అదనపు ప్రధాన న్యాయస్థానం న్యాయమూర్తి వరలక్ష్మి తీర్పు ఇచ్చారు. విచారణ పూర్తవడంతో, సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి మాజీ మంత్రికి శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు.


# గురుకుల వ్యవస్థ నిర్వీర్యం

## బిఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్

హైదరాబాద్ : కాంగ్రెస్ పాలనలో గురుకుల విద్యావ్యవస్థ పూర్తిగా భ్రష్టు పట్టిందని బిఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ అన్నారు.గురుకులాలపై ఒక్క రోజైనా సీఎం రేవంత్ రెడ్డి రివ్యూ చేసిండా అని ప్రశ్నించారు. గురుకులాలను పూర్తిగా నిర్వీర్యం చేశారని శ్రీనివాస్ మండిపడ్డారు. కేసీఆర్ సృష్టించిన బ్రాండ్‌ను నాశనం చేశారని విమర్శించారు. పేద విద్యార్థులంటే ఎందుకంత ద్వేషమని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. గురుకులాలు నాశనం కావడానికి కారణం ఎవరు అని ప్రశ్నించారు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయడానికేనా ఈ కుట్ర అని నిలదీశారు.

# అంతరంగ శుద్ధికి.. నమాజ్!

జీవితం అంటే కేవలం ఉరుకులు పరుగుల ప్రయాణం మాత్రమే కాదు.. అలసిన ఆత్మకు ప్రశాంతత చేకూర్చే ఆధ్యాత్మిక సౌరభం కూడా! నేటి యాంత్రిక జీవనంలో మనం శరీరానికి ఇచ్చే ప్రాధాన్యం మనసుకి, ఆత్మకి ఇవ్వడం లేదు. శరీరానికి ఆహారం ఎంత అవసరమో, ఆత్మకు 'ప్రార్థన' అంతకంటే ఎక్కువ అవసరం. నమాజ్ అంటే కేవలం కొన్ని కదలికల సమాహారం కాదు.. అది సృష్టికర్తతో మన మనసు చేసే సంభాషణ. అరబిక్ భాషలో నమాజ్‌ను 'అస్-సలాహ్' అంటారు. దీనికి 'అనుబంధం' అని అర్థం. అంటే, అల్లాహ్‌తో బంధాన్ని బలపరుచుకునే మార్గం. రోజుకు ఐదుసార్లు మనం చేసే ప్రార్థన, సృష్టికర్తతో మనల్ని నేరుగా కలుపుతుంది. ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) చెబుతూ 'ఒక వ్యక్తి సజ్దా (సాష్టాంగ నమస్కారం)లో ఉన్నప్పుడు తన ప్రభువుకు అత్యంత సమీపంలో ఉంటాడు. ఆ క్షణంలో అహంకారం నశిస్తుంది, వినయం జనిస్తుంది' అంటారు. క్రమశిక్షణకు మారుపేరు. ఇస్లాం ధర్మంలో ప్రార్థన రెండో ప్రధానమైన స్తంభం. యుద్ధ రంగంలో ఉన్నా, ప్రయాణంలో ఉన్నా ప్రార్థనకు మినహాయింపు లేదు. అంటే, జీవితంలో ఎలాంటి కష్టనష్టాలు ఎదురైనా దైవస్మరణ వీడకూడదని దీని అర్థం. కేవలం 24 గంటల్లో ఒక అరగంట సమయాన్ని దైవానికి కేటాయించడం అంటే.. మనల్ని మనం సంస్కరించుకోవడమే! ప్రార్థనతో కలిగే ప్రయోజనాలు.. చెడు నుంచి రక్షణ: మనిషి బలహీనుడు. కానీ, మనస్ఫూర్తిగా ప్రార్థించే వ్యక్తిని అల్లాహ్ చెడు పనుల నుంచి, అనైతికత నుంచి రక్షిస్తాడు. ఆత్మకు శాంతి: 'అల్లాహ్ స్మరణతోనే హృదయాలకు శాంతి చేకూరుతుంది' అని ఖురాన్ చెబుతున్నది. ఒత్తిడితో నిండిన మనసుకి నమాజ్ ఒక దివ్యౌషధం. సమానత్వ సందేశం: మసీదులో ప్రార్థన చేసేటప్పుడు ధనిక, పేద, కుల, మత, వర్ణ వివక్షలు ఉండవు. అందరూ భుజం భుజం కలిపి ఒకే వరుసలో నిలబడతారు. ఇది విశ్వమానవ సౌభ్రాతృత్వానికి నిదర్శనం.



ఆధ్యాత్మికం

# మహిళా విద్యకు మార్గదర్శకులు పూలే దంపతులు

## ● మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా పెద్దపల్లి పట్టణంలోని అమర్ నగర్ చౌరస్తాలో జ్యోతిరావు పూలే విగ్రహానికి మాజీ శాసనసభ్యులు దాసరి మనోహర్ రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ, జ్యోతిరావు పూలే గారు అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళల అభ్యున్నతికి విశేష కృషి చేసిన మహానుభావుడని పేర్కొన్నారు. 1873 సెప్టెంబర్ 24న ఆయన సత్యశోధక్ సమాజ్‌ను స్థాపించి దిగువ కులాల ప్రజలకు సమాన హక్కులు సాధించేందుకు నిరంతరం పోరాటం చేశారని అన్నారు. ఈ సంఘంలో అన్ని మతాలు, కులాలకు చెందిన ప్రజలకు సమాన అవకాశాలు కల్పించబడినట్లు ఆయన వివరించారు. భారతదేశంలో సామాజిక సంస్కరణ ఉద్యమంలో జ్యోతిరావు పూలే ఒక ప్రముఖ వ్యక్తిగా నిలిచారని, ఆయన తన భార్య సావిత్రిబాయి పూలే గారితో కలిసి మహిళా విద్యకు మార్గదర్శకులుగా నిలిచారని కొనియాడారు. 1848లో పూణేలో బాలికల కోసం మొదటి పాఠశాలను ప్రారంభించడం ద్వారా మహిళా విద్యకు నాంది పలికారని గుర్తుచేశారు. అణగారిన వర్గాలు, మహిళల అభివృద్ధి కోసం విద్యను ఆయుధంగా ఉపయోగించిన గొప్ప సంస్కర్త జ్యోతిరావు పూలే ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్ కుమార్, కౌన్సిలర్ వెన్నం సుజాత రవీందర్, మాజీ కౌన్సిలర్ పెంచాల శ్రీధర్ రమాదేవి, పూదరి చంద్రశేఖర్, మండల ఉపాధ్యక్షుడు సలేంద్ర రాములు యాదవ్, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు..

# హాలియా మున్సిపాలిటీలో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చర్యలు వేగవంతం: చైర్మన్ చింతల చంద్రారెడ్డి





**నల్గొండ జిల్లా ప్రతినిధి: ఏప్రిల్ 11 (ది క్రైమ్ న్యూస్):** హాలియా మున్సిపాలిటీ నందు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాల్లో భాగంగా హాలియా మున్సిపాలిటీ పరిధిలో పరిశుభ్రత కార్యక్రమాలు మరింత వేగవంతంగా కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమాల్లో భాగంగా మున్సిపాలిటీ చైర్మన్ చింతల చంద్రా రెడ్డి గారు స్వయంగా పర్యవేక్షణ చేపట్టి అధికారులకు, సిబ్బందికి మార్గనిర్దేశం చేశారు. హాలియాలోని మిర్యాలగూడ రోడ్డులో మెయిన్ రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన మట్టి కుప్పలు, రాళ్లు, చెత్తాచెదారం వంటి వాటిని గుర్తించి వెంటనే శానిటేషన్ సిబ్బందితో తొలగింపునకు చర్యలు చేపట్టారు. ప్రత్యేక యంత్రాలతో శుభ్రపరిచే పనులు నిర్వహించి, పరిసరాలను పరిశుభ్రంగా మార్చారు. ఈ సందర్భంగా చైర్మన్ చంద్రా రెడ్డి మాట్లాడుతూ, పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ప్రజలు కూడా తమ ఇళ్ల పరిసరాల్లో చెత్త వేయకుండా, మున్సిపాలిటీ అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హాలియా పట్టణాన్ని స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన నగరంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. హాలియా మున్సిపాలిటీ పరిధిలో రోడ్లు, డ్రైనేజీలు, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు కట్టుబడి ఉందని అధికారులు తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ద్వారా పట్టణ అభివృద్ధికి కొత్త దిశలో ముందడుగు పడుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# జ్యోతిరావు పూలే స్ఫూర్తితో ఉపాధి హక్కుల కోసం పోరాటం: కార్మికులకు పిలుపు





**నల్గొండ జిల్లా ప్రతినిధి: ఏప్రిల్ 11 (ది క్రైమ్ న్యూస్):** నల్లగొండ జిల్లా నిడమనూరు మండలంలో మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి సందర్భంగా ఉపాధి పనుల వద్ద కార్మికులు ఘనంగా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1873లోనే జ్యోతిరావు పూలే "సత్యశోధక్ సమాజ్" స్థాపించి అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన గొప్ప నాయకుడని గుర్తు చేశారు. శ్రమ దోపిడీకి గురవుతున్న పేదలకు విద్యా అవగాహన కల్పించి, న్యాయమైన వేతనాల కోసం ఉద్యమాలు నిర్వహించిన పూలే స్ఫూర్తితో కార్మికులంతా ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అసైన్మెంట్ భూముల విషయంలో భూ కమిషన్ ఏర్పాటు చేసి పూర్తి స్థాయి విచారణ జరపాలని, పేదలకు కేటాయించిన భూములు కబ్జా కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామసభల్లో భూముల వివరాలను బహిరంగంగా ప్రకటించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను మాట్లాడుతూ, ఉపాధి హామీ కార్మికులపై జరుగుతున్న అన్యాయాలను ఖండించారు. రెండు నెలల వేతన బకాయిలను వెంటనే విడుదల చేయాలని, కార్మికులపై భారం పెంచే నిబంధనలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా జరుగనున్న ఉద్యమాల్లో కార్మికులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, కందుకూరి కోటేష్ మండల కార్యదర్శి, వ్యవసాయ కార్మిక సంఘం గ్రామ కార్మిక సంఘ ప్రతినిధులు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

# శాంతి భద్రతల దృష్ట్యా పట్టణంలో కార్డెన్ సెర్చ్ ...

### - అంతర్ రాష్ట్రీయుల నుంచి తగిన ఆధారాలు తీసుకోవాలి
### - పెద్దపల్లి ఏసిపి గజ్జి కృష్ణ యాదవ్



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ప్రజల శాంతి భద్రతల దృష్ట్యా పట్టణంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించడం జరిగిందని అద్దె ఇంటిలో నివాసముండే అంతర్ రాష్ట్రీయుల వద్ద నుంచి తగిన ఆధారాలు తప్పక తీసుకోవాలని పెద్దపల్లి ఏసిపి గజ్జి కృష్ణ యాదవ్ సూచించారు. శనివారం పెద్దపల్లి పట్టణంలోని సాగర్ రోడ్డు లో కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఏసిపి గజ్జి కృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో సబ్ డివిజన్ పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొని సాగర్ రోడ్ లోని ప్రతి ఇల్లును తనిఖీ చేసి సరైన ధ్రువపత్రాలు లేని 70 ద్విచక్ర వాహనాలను నాలుగు ఆటోలను, ఒక ట్రాలీ ను పట్టుకోవడం జరిగిందని, బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న వారి వద్ద నుండి మద్యం సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. పట్టణంలో ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జరగకుండా ఉండాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు వెల్లడించినారు. ఇతర రాష్ట్రాల నుండి వచ్చి కిరాయికి ఉంటున్న వారి గుర్తింపు వివరాలు తీసుకోవాలని కాలనీ వాసులకు సూచించారు. పట్టణంలో నెంబర్ లేకుండా తిరుగుతున్న వాహనాలను సీజ్ చెయ్యడం జరుగుతుందని, వాహనదారులు సరైన ధ్రువపత్రాలు కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, ఎస్సైలు జే లక్ష్మణరావు, నరేష్, మల్లేష్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మద్యం తాగి వాహనం నడిపితే జైలు శిక్ష తప్పదు

### - రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి. రాజేశ్వరరావు



**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** మద్యం తాగి వాహనం నడిపితే జైలు శిక్ష తప్పదని రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి. రాజేశ్వరరావు హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వారిని శనివారం గోదావరిఖని సెకండ్ అడిషనల్ మేజిస్ట్రేట్ వెంకటేష్ దుర్వ ముందు హాజరుపరిచారు. తనిఖీల్లో 7 మంది పట్టుబడగా, వారిలో 6 గురికి 12000 రూపాయల జరిమానా విధించినట్లు తెలిపారు. ఒక వ్యక్తి రెండవసారి మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడటంతో కోర్టు 03 రోజుల జైలు శిక్ష విధించిందని వెల్లడించారు. శిక్ష పడిన వ్యక్తిని కరీంనగర్ జిల్లా జైలుకు తరలించడం జరిగిందని చెప్పారు. మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతాయని, నిబంధనలు అతిక్రమిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారులు తప్పనిసరిగా వాహన పత్రాలు కలిగి ఉండాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. రాంగ్ రూట్లో వెళ్లడం, అతివేగంగా వాహనాలు నడపడం వంటివి చేయరాదని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు.

# కెల్లేడులో ఉచిత వైద్య శిబిరం.... గ్రామ ప్రజలు ఆరోగ్య స్పృహతో ఉండాలి



**కరీంనగర్ టౌన్, ఏప్రిల్11(ది క్రైమ్ న్యూస్):** గ్రామ ప్రజలు ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత వైద్య సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కెల్లేడు గ్రామ సర్పంచ్ ఆడెపు రజిత విజయ్ పిలుపునిచ్చారు. శనివారం వెల్ది ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో కెల్లేడు గ్రామ పంచాయతీ ఆవరణలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ ఆడెపు రజిత విజయ్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. "ఆరోగ్యమే మహాభాగ్యం" అని, ప్రతి ఒక్కరూ ఆరోగ్య స్పృహ కలిగి ఉండాలని కోరారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి, ఇలాంటి శిబిరాల ద్వారా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మాతంగి సహదేవ్, 5వ వార్డు సభ్యులు దాసరి అంజలి చంద్రయ్య, ప్రభుత్వ వైద్య అధికారులు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సమాజ సంస్కరణలకు మార్గదర్శి మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి

### - పెద్దవూర మండల దళిత నాయకుల ఆధ్వర్యంలో.....



**నల్గొండ జిల్లా ప్రతినిధి: ఏప్రిల్ 11 (ది క్రైమ్ న్యూస్):** నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం ఎమ్మార్వో కార్యాలయం ఆవరణలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు ఆడెపు నాగార్జున మాదిగ మాట్లాడుతూ, మహాత్మ జ్యోతిరావు పూలే భారతదేశంలో ప్రముఖ సామాజిక సంస్కర్త, విద్యావేత్త, కుల వ్యతిరేక ఉద్యమకారుడని అన్నారు. స్త్రీ విద్య, దళిత వర్గాల అభ్యున్నతి, కుల నిర్మూలన కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. అణగారిన వర్గాలకు సమాన హక్కులు అందించేందుకు కృషి చేసిన గొప్ప మేధావిగా ఆయనను అభివర్ణించారు. మహిళా విద్యకు మార్గదర్శకుడిగా నిలిచిన మహనీయుడని గుర్తుచేశారు. అనంతరం మండల కేంద్రంలోని జాతీయ నాయకుల విగ్రహాల కూడలిలో కూడా పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పెద్దవూర సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటయ్య, ఆర్.ఐ. ఎం.డి హబీబ్, దళిత నాయకులు పులి మాల కృష్ణారావు, బొంగరాల వెంకటేశ్వర్లు, వంగూరి మహేందర్ బాబు, తగరం శ్రీను, వంగూరి ఈదయ్య, పరమేష్, ముత్యాలు, హైమద్, రామకృష్ణతో పాటు గ్రామ పెద్దలు, మేధావులు, వివిధ పార్టీల నాయకులు, కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# మహాత్మా జ్యోతిరావు పూలేకు విద్యార్థుల ఘన నివాళి... కళాశాల అధ్యాపకులు





**నల్గొండ జిల్లా ప్రతినిధి: ఏప్రిల్ 11 (ది క్రైమ్ న్యూస్):** నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో స్థానిక మహాత్మా జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ బీసీ డిగ్రీ కళాశాలలో మహాత్మా జ్యోతిబాపూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చే. మాధవి లత మాట్లాడుతూ, జ్యోతిరావు పూలే ఒక గొప్ప సంఘ సంస్కర్తగా, విద్యావేత్తగా సమాజంలో మార్పు తీసుకువచ్చిన మహానుభావుడని తెలిపారు. బాల్య వివాహాలను అరికట్టడంలో, స్త్రీలకు విద్య అందించడంలో ఆయన చేసిన సేవలు అపారమని కొనియాడారు. తన భార్య సావిత్రీబాయి పూలేకు విద్యను అందించి దేశంలోని తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా తీర్చిదిద్దిన గొప్ప కృషి ఆయనదేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏటీపీ నరేష్, డీడబ్ల్యూ రఘు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ లలిత, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి: సర్పంచ్ ఆడెపు రజిత



**మానకొండూర్, ఎప్రిల్ 11(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం కెల్లేడులో శనివారం గ్రామపంచాయతీ ఆవరణలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(వెల్ది) ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సర్పంచ్ ఆడెపు రజిత ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ... ఆరోగ్యంపై శ్రద్ధ వహించి తమ ఆరోగ్యాల్ని కాపాడుకోవాలని, ఏ అనారోగ్య సమస్యలున్నా ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. ఉపసర్పంచ్ మాతంగి సహదేవ్, వార్డు సభ్యురాలు దాసరి అంజలి, నాయకులు ఆడెపు విజయ్, చంద్రయ్య వైద్యాధికారులు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది, గ్రామస్తులు అధిక సంఖ్యలో వైద్యశిబిరంలో పాల్గొన్నారు.

# సామాజిక అణిచివేతపై కార్మిక వర్గం పోరాడాలి

## • సిఐటీయు జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు



**సుల్తానాబాద్, ఏప్రిల్ 11(ది క్రైమ్ న్యూస్):** కార్మిక వర్గం కేవలం ఆర్థిక పరమైన హక్కుల కోసమే కాకుండా, సమాజంలో నెలకొన్న అణిచివేత, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా నిరంతరం పోరాడాలని సిఐటియు సి ఐ టి యూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు పిలుపునిచ్చారు. గురువారం పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలోని గోశాల పెద్దమ్మ గుడి వద్ద మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను సిఐటియు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం "భారత రాజ్యాంగం - సవాళ్లు" అనే అంశంపై ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్యంరావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసే కుట్రలు చేస్తోందని, రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని హెచ్చరించారు. సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఏప్రిల్ 6 నుండి 14 వరకు సామాజిక న్యాయ సాధన క్యాంపెయిన్ నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగానే మహనీయుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సామాజిక అణిచివేతకు వ్యతిరేకంగా పోరాడుతున్న శక్తులకు అండగా నిలవడానికి "సామాజిక ఉద్యమ సంఘీభావ నిధి"ని సేకరిస్తున్నట్లు వెల్లడించారు. కుల, లింగ వివక్షలపై కార్మికులు లోతుగా అధ్యయనం చేసి, బాధితులకు అండగా నిలబడాలని కోరారు. ఆర్థిక దోపిడీ, సామాజిక అణిచివేతలపై జమిలిగా (కలిసికట్టుగా) పోరాడినప్పుడే సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్ ఆపరేటర్ల సంఘం అధ్యక్షులు తాండ్ర అంజయ్య, గుమస్తాల సంఘం అధ్యక్షులు మాతంగి రాజమల్లు, ఆపరేటర్ల సంఘం కార్యదర్శి నౌవుండ్ల బ్రహ్మచారి, బండారి స్వామి, శీను, తిరుపతి, ఓదెలు, స్వామి, రాము, హరీష్, రమేష్, ప్రశాంత్, మల్లేశం, రాజన్న, శంకర్, సంతు, దుర్గయ్య, సుధాకర్ రావు, ప్రసాద్, శ్రీధర్, సంపత్, లింగన్న, మహేందర్, రాజేశం, సతీష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# కళ, పోరాట స్ఫూర్తికి ప్రతీకలు పైలా వాసుదేవరావు ...

## • పైలా వాసుదేవరావు, కానూరి తాత ఆశయ సాధనకు ఉద్యమిద్దాం • ప్రజల కోసం పోరాడిన మహనీయుల జ్ఞాపకార్థం నివాళులు • విప్లవ స్ఫూర్తిని కొనసాగిద్దాం • సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి అశోకన్న



**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి ఎప్రిల్ 11(ది క్రైమ్ న్యూస్):-** సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా కార్యాలయంలో విప్లవ నాయకులు కామ్రేడ్ పైలా వాసుదేవరావు 16వ వర్ధంతి, అరుణోదయ వ్యవస్థాపకులు కామ్రేడ్ కానూరి వెంకటేశ్వరరావు (తాత) 11వ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి అఖిల భారత రైతు కూలి సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి బండపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. కార్యక్రమం ప్రారంభంలో నాయకుల చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి వారి సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ అశోకన్నా మాట్లాడుతూ, శ్రీకాకుళం గిరిజన సాయుధ రైతాంగ పోరాటంలో కీలక పాత్ర పోషించిన పైలా వాసుదేవరావు పీడిత ప్రజల విముక్తి కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడని కొనియాడారు.అన్యాయం, దోపిడీకి వ్యతిరేకంగా నిరంతరం పోరాడుతూ ప్రజల హక్కుల కోసం అహర్నిశలు కృషి చేసిన ఆయన పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని అన్నారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ సామాజిక న్యాయం సాధించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అలాగే కామ్రేడ్ కానూరి వెంకటేశ్వరరావు (తాత) గురించి మాట్లాడుతూ, ప్రజా సాంస్కృతిక రంగంలో ఆయన చేసిన సేవలు అపూర్వమని తెలిపారు. తన కలం, గళం ద్వారా ప్రజల్లో చైతన్యం నింపిన గొప్ప కవి, రచయితగా ఆయన నిలిచారని చెప్పారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట కాలంలో కళా ప్రదర్శనలు, పాటలు, నాటకాల ద్వారా ప్రజలలో అవగాహన పెంచి ఉద్యమాలకు బలం చేకూర్చారని వివరించారు. కళ కళ కోసం కాదు, కళ ప్రజల కోసమే అన్న భావనతో వందలాది కళాకారులను తీర్చిదిద్దిన మహోన్నత వ్యక్తిగా ఆయనను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి సనప పోమ్మయ్య మాట్లాడుతూ, పైలా వాసుదేవరావు, కానూరి వెంకటేశ్వరరావు (తాత)ల త్యాగాలు, పట్టుదల నేటి యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. వారి ఆశయ సాధన కోసం ఉద్యమాలు మరింత బలంగా కొనసాగించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. సామాజిక సమానత్వం, హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఓడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి శారు కవిత, రాష్ట్ర నాయకురాలు భాగ్యలక్ష్మి, పిడిఎస్యు తెలంగాణ రాష్ట్ర నాయకుడు బానోత్ దేవేందర్ పివైఎల్ నాయకుడు గుగులోతు గణేష్, ఏఐకేఎంఎస్ నాయకుడు దేవరపల్లి నర్సిరెడ్డి, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుంది

## • వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి



**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** స్వచ్ఛతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుంది వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి అన్నారు. శనివారం గోదావరిఖని 1 టౌన్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో శ్రమదానం చేపట్టారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బందితో కలిసి పరిసరాల పరిశుభ్రతకు శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. స్టేషన్ లోపల మరియు వెలుపల పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించడమే కాకుండా, అస్తవ్యస్తంగా ఉన్న ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలను పూర్తిగా క్లీన్ చేయించామని వివరించారు. ముఖ్యంగా స్టేషన్‌లోని రికార్డులను దుమ్ము పట్టకుండా జాగ్రత్తగా సర్దినట్లు తెలిపారు. నిరంతరం విధుల్లో నిమగ్నమయ్యే సిబ్బంది సామాజిక బాధ్యతలో భాగంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని కొనియాడారు. స్టేషన్‌కు వచ్చే ప్రజలు ఇక్కడి ప్రశాంతమైన వాతావరణాన్ని చూసి ఉపశమనం పొందాలనే లక్ష్యంతోనే ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. పరిశుభ్రత అనేది పని ఒత్తిడిని తగ్గించడానికి దోహదపడుతుందని, ప్రజలకు పోలీసులపై మంచి అభిప్రాయం కలిగేలా చేస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ పరిసరాలను క్లీన్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు రమేష్, మనోహర్, అనూష తో పాటు పోలీస్ సిబ్బంది అంతా పాల్గొన్నారు.



# సుల్తానాబాద్‌లో ఘనంగా మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి వేడుకలు



**సుల్తానాబాద్, ఏప్రిల్ 11(ది క్రైమ్ న్యూస్):** స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద మహనీయుల జయంతోత్సవ కమిటీ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షులు న్యాతరి ప్రభాకర్, న్యాయ సలహాదారులు కోడం అజయ్, గౌరవ సలహాదారులు న్యాతరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. సమాజంలోని అట్టడుగు వర్గాలకు, ఎస్సీ, ఎస్టీలకు విద్య ద్వారానే అన్ని సాధ్యమవుతాయని పూలే నమ్మారని కొనియాడారు. తన భార్య సావిత్రిబాయి పూలే సహకారంతో మొట్టమొదటిసారి పాఠశాలలు ఏర్పాటు చేసి, ఎన్నో అవమానాలు ఎదుర్కొని విద్యను అందించిన మహనీయుల అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని వారు పిలుపునిచ్చారు. అలాగే, సుల్తానాబాద్‌లో జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షులు చిలుక రాజేశం, ఆరేపల్లి రాహుల్, ఆరేపల్లి రాకేష్, ప్రధాన కార్యదర్శి కన్నూరి ప్రభాకర్, ముఖ్య సలహాదారు సంకేనపల్లి లక్ష్మణ్, మాజీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు కల్వల శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ తిప్పారపు దయాకర్, నాయకులు ఆరేపల్లి ఇలారావు, ఎనగందుల నాంపల్లి, గొర్రె వెంకటస్వామి, తాళ్లపల్లి లక్ష్మణ్, ఆరేపల్లి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# సమానత్వ సందేశం.. పూలే బాటలో నడుద్దాం

## - పెద్దపల్లి పార్లమెంటు అభ్యర్థి కట్కూరి సందీప్



**బ్యూరో,(ది క్రైమ్ న్యూస్):** వెనుకబడిన వర్గాల సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి పార్లమెంటుకు ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన కర్నూరి సందీప్ మాట్లాడుతూ జ్యోతిభా పూలే ఆశయాలు ఈరోజుకీ సమాజానికి మార్గదర్శకం అని తెలిపారు. విద్యా సమానత్వం, మహిళా సాధికారత, కుల వివక్ష నిర్మూలన వంటి అంశాలలో పూలే చేసిన కృషి అమూల్యమని కొనియాడారు. సమాజంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన త్యాగాలు, పోరాటాలు మనకు స్ఫూర్తి. ఆయన చూపిన మార్గంలోనే మనం ముందుకు సాగాలని సందీప్ పేర్కొన్నారు. సమాజంలో సమాన అవకాశాలు అందించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే పూలే ఆశయ సాధన కోసం తాను ఎప్పటికీ కట్టుబడి ఉంటానని ప్రజల అభివృద్ధి కోసం శక్తి వంచన లేకుండా పని చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చర్లపల్లి సురేష్ గౌడ్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కందుల సదాశివ పటేల్, ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు గుండేటి ఐలయ్య యాదవ్, నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

# సామాజిక సమానత్వం పూలే ఆశయం

## - బీసీ జేఏసీ జిల్లా చైర్ పర్సన్ దాసరి ఉష



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** మహిళా విద్య, సామాజిక సమానత్వం మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయం అని పెద్దపల్లి జిల్లా బీసీ జేఏసీ చైర్మన్ దాసరి ఉష కొనియాడారు. పెద్దపల్లి పట్టణ కేంద్రంలో శనివారం మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను బీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పూలే విగ్రహానికి ఉష పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ భారతదేశంలో బహుజన వర్గాల అభ్యున్నతి, మహిళల విద్యా వికాసానికి జ్యోతిరావు పూలే చేసిన కృషి అనన్య సామాన్యమని అన్నారు. పూలే చూపిన చొరవతోనే నేడు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. తన భర్త ఆశయాల కోసం సావిత్రిబాయి పూలే ఎన్నో అవమానాలను భరించి దేశంలోనే మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా నిలిచి విద్యా ప్రభంజనాన్ని సృష్టించారని గుర్తు చేశారు.? వారి ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాదిగశక్తి వ్యవస్థాపకుడు బొంకూరి సురేందర్ సన్నీ, బీసీ జేఏసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లవెల్లి శంకర్, జిల్లా వైస్ చైర్మన్ కొండి సతీష్, జిల్లా కన్వీనర్లు, బీసీ జేఏసీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# సుల్తానాబాద్ అభివృద్ధిలో సరికొత్త అధ్యాయం

## - ఎమ్మెల్యే విజయరమణ రావుకు మున్సిపల్ పాలకవర్గం కృతజ్ఞతలు - మినీ ట్యాంక్ బండ్ నిధుల మంజూరుపై పట్టణంలో మిన్నంటిన సంబరాలు - మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, వైస్ చైర్మన్ అంతటి పుష్పలత ఆధ్వర్యంలో పాలభిషేకం

**సుల్తానాబాద్, ఏప్రిల్ 12(ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ పట్టణ ప్రజల దశాబ్దాల కల అయిన ఊర చెరువు సుందరీకరణ (మినీ ట్యాంక్ బండ్) కోసం రూ. 8.77 కోట్లు మంజూరు చేయించిన ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావుకి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ అధికారులు ఘనంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, వైస్ చైర్మన్ అంతటి పుష్పలత, పట్టణ ప్రజలతో కలిసి ఎమ్మెల్యే చిత్రపటానికి పాలభిషేకం నిర్వహించారు. బాణసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేస్తూ పట్టణంలో సంబరాలు జరుపుకున్నారు. చైర్మన్ బిరుదు రాధాకృష్ణ మాట్లాడుతూ.."గత పాలకులు కాలయాపన చేసినా, ఎమ్మెల్యే విజయరమణ రావు పట్టుబట్టి జీవో 170 ద్వారా నిధులు మంజూరు చేయించడం పట్టణ అభివృద్ధికి నిదర్శనం" అని కొనియాడారు. కమిషనర్ రమేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు వెంటనే టెండర్లు పిలిచి, పనులను అత్యంత నాణ్యతతో వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. వైస్ చైర్మన్ పుష్పలత మాట్లాడుతూ, ఈ ప్రాజెక్టు వల్ల సాగునీటితో పాటు భూగర్భ జలాలు పెరుగుతాయని, పట్టణానికి కొత్త శోభ వస్తుందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది, పెద్ద ఎత్తున పట్టణ ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

# అబ్బాపూర్‌లో చలివేంద్రం ప్రారంభం



**జూలపల్లి, ఏప్రిల్ 11(ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం అబ్బాపూర్ గ్రామ బస్టాండ్ ఆవరణలో శనివారం చలివేంద్రాన్ని ఘనంగా ప్రారంభించారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా బాటసారులు, ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఈ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ దండే వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ఎండ వేడి నుంచి ఉపశమనం కలిగించేందుకు, చల్లని తాగునీరు అందుబాటులో ఉండేలా బస్టాండ్ వద్ద ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామంలోని ప్రజలు , బాటసారులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు చిప్ప అరుణ్, బోడిగె లక్ష్మణ్, పబ్బుల శంకర్, శేరి నర్సింగ్, జన్నారపు పద్మ, మారం నాగరాజు, టెక్కం రమేష్, గ్రామ ప్రముఖులు గన్ను లక్ష్మారెడ్డి, వడ్లకొండ సురేష్, ఫైర్ చిన్నయ్య, శ్రీరాముల అంజయ్య, మహి, నర్సయ్య, బొమ్మనవేని కోమురయ్య , ఇతర గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అనుముల గ్రామంలో ఉదారత చాటిన యువకులు

## - నాగలి లింగయ్య కుటుంబానికి ఆర్థిక సహాయం



**నల్గొండ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్11(ది క్రైమ్ న్యూస్):** నల్గొండ జిల్లా హాలియా మున్సిపాలిటీలోని అనుముల గ్రామానికి చెందిన నాయిని బ్రాహ్మణి కుటుంబానికి చెందిన కీర్తిశేషులు నాగలి లింగయ్య కుటుంబానికి గ్రామ యువకులు తమ వంతుగా ఆర్థిక సహాయం అందించారు. ఇటీవల మృతి చెందిన నాగలి లింగయ్య కుటుంబానికి అండగా నిలవాలని భావించి, యువకులు ముందుకు వచ్చి సహాయం చేయడం అభినందనీయమని గ్రామస్థులు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ఆ కుటుంబానికి కొంత భరోసా కలిగిందని, ఇలాంటి నిరుపేద కుటుంబాలను ఆదుకోవడం సంతోషకరమని సహాయం చేసిన మిత్రులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో గంపల సత్యనారాయణ, తోటి పెల్లి బాలకృష్ణ, చరబండ రాజు, భైరవైన కొండలు, కొర్రపిట్ట వెంకటయ్య, తూటిపల్లి శివ, జానపాటి శ్రీనివాస్ యాదవ్, జిల్లా బోయిన మల్లేష్ తదితరులు పాల్గొన్నారు. మొత్తం రూ.10,000 ఆర్థిక సహాయం అందించిన మిత్రులందరికీ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# అక్రమ నిర్మాణాలపై హైడ్రా భారీ ఆపరేషన్

• ఐలాపూర్‌లో ఆరు అంతస్తుల భవనం కూల్చివేత • ఫార్మ్ హౌసులు, అపార్ట్‌మెంట్లపై చర్యలు • 20 ఏళ్లుగా సాగిన భూదందాకు చెక్





**పటాన్చెరు(అమీన్ పూర్) ఏప్రిల్ 11, (ది క్రైమ్ న్యూస్):** అక్రమ నిర్మాణాలు, భూకబ్జాలపై హైడ్రా అధికారులు భారీ స్థాయిలో దాడులు చేపట్టారు. ప్రభుత్వ భూములు, చెరువుల ఫుల్ ట్యాంక్ లెవల్ పరిధిలో నిర్మించిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని కూల్చివేతలు కొనసాగుతున్నాయి. ఈ చర్యలతో అక్రమ నిర్మాణదారుల్లో ఆందోళన నెలకొంది. ప్రత్యేకంగా సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం ఐలాపూర్‌లో హైడ్రా ఆపరేషన్ తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. భారీ పోలీస్ బందోబస్తు మధ్య రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి హైడ్రా అధికారులు ఆక్రమణలను తొలగిస్తున్నారు. గ్రామంలో ఇళ్లను ఎక్కువగా తాకకుండా చర్యలు చేపడుతున్నప్పటికీ, అక్రమంగా నిర్మించిన భారీ భవనాలు, ఫార్మ్ హౌసులపై బుల్డోజర్లు నడుస్తున్నాయి. ఐలాపూర్‌లో అజీమ్ అనే వ్యక్తి అక్రమంగా నిర్మించిన ఆరు అంతస్తుల భవనాన్ని హైడ్రా అధికారులు కూల్చివేస్తున్నారు. ఈ భవనంలో ఎవరూ నివాసం ఉండకపోయినా, కొంతమందిని అద్దెలకు దించి నివాసాలున్నట్లు చూపించినట్లు అధికారులు గుర్తించారు. భవనంలో ఉన్న వారిని ఖాళీ చేయించి కూల్చివేతలు కొనసాగిస్తున్నారు. **బాధితుల ఆవేదన:** ఇదే సమయంలో, మరో అపార్ట్‌మెంట్‌లో సుమారు 35 కుటుంబాలు అద్దెకు నివసిస్తున్నాయని, ముందస్తు నోటీసులు ఇవ్వకుండా కూల్చివేతలు ప్రారంభించడంతో వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇంట్లోని సామాన్లు తీసుకునే సమయం కూడా ఇవ్వలేదని, చిన్నపిల్లలు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారని బాధితులు ఆరోపించారు. కొందరు నివాసితులు అధికారులతో వాగ్వాదానికి దిగగా, పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పోలీసులు భారీగా మోహరించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. **కమిషనర్ రంగనాథ్ వివరణ:** హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ, ఐలాపూర్ భూములపై 1998లో హైకోర్టు స్టేటస్ కో ఉన్నప్పటికీ, ముఖీమ్ అనే



వ్యక్తి ప్రభుత్వ భూములను ఆక్రమించి ఫాంహౌస్ నిర్మించుకున్నాడని తెలిపారు. 2006లో ప్రారంభమైన ఈ ఫాంహౌస్ ప్రస్తుతం సుమారు 40 ఎకరాలకు విస్తరించిందని చెప్పారు. గత 20 ఏళ్లుగా భూదందా సాగిస్తూ ప్రభుత్వ భూములను ప్లాట్లుగా మార్చి విక్రయించారని, 100 గజాలకు రూ.10 లక్షల వరకు వసూలు చేసినట్లు వెల్లడించారు. హైకోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తూ అక్రమ నిర్మాణాలు చేపట్టారని, ఈ కూల్చివేతలపై ఎలాంటి స్టే లేదని స్పష్టం చేశారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం జరుగుతుందని మండిపడ్డారు. అధికారుల ప్రకారం, ఇప్పటికే పలుమార్లు నోటీసులు ఇచ్చిన తర్వాతే ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అక్రమ నిర్మాణాలపై ఎలాంటి సడలింపులు ఉండవని హెచ్చరించారు. ఈ పరిణామాలతో ఐలాపూర్ ప్రాంతంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. స్థానిక ప్రజలు, ప్రజాసంఘాలు బాధితులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరుతుండగా, హైడ్రా అధికారులు మాత్రం అక్రమ కట్టడాలపై చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

# మహాత్మ జ్యోతిబా పూలే ఆశయాలను, ఆలోచనలను ఆచరించాలి

◆ సామాజిక అసమానతనలు తొలగించడమే పూలే ఆశయం ◆ మహాత్మ జ్యోతిబా పూలే 200వ జయంతి వేడుకలలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** మహాత్మా జ్యోతిబా పూలే ఆశయాలను, ఆలోచనలను మనమందరం ఆచరించాలి అని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశం మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ మహాత్మ జ్యోతిబా పూలే 200వ జయంతి వేడుకల్లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అదనపు కలెక్టర్ డి.వేణు లతో కలిసి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి, జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, మన దేశం అభివృద్ధి చెందాలంటే మహాత్మ జ్యోతిబా పూలే ఆశయాలను ,ఆలోచనలు మనమందరం ఆచరిస్తూ అమలు చేస్తూ దేశ అభివృద్ధిని సాధించవచ్చు అని, సమాజంలోని అసమాన తలను తొలగించవచ్చని అన్నారు.సామాజిక సమానత్వం సాధన కోసం జ్యోతి బా పూలే అప్పటి సమాజంలో పోరాటం చేశారని, ఆ స్ఫూర్తి మనమంతా తీసుకోవాలని, సామాజిక అసమానతలు దూరమయ్యేందుకు మన వంతు కృషి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. బాలికల విద్యపై పూలే దంపతులు చిత్తశుద్ధితో పనిచేశారని, స్త్రీలు విద్యా వంతులు కావాలని ఆకాంక్షించారని తెలిపారు. అంతకంటే ముందు పెద్దపల్లి లోని మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థిని లు కూచిపూడి నృత్యం ప్రదర్శన చేసి అలరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి జే.రంగా రెడ్డి, కలెక్టరేట్ పరిపాలన అధికారి బి. ప్రకాష్ ప్రకాశ్, వివిధ బీసీ సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

# సిఎస్ఈ విద్యార్థులకు స్వాగత... మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు ఫ్రెషర్స్ పార్టీ







**తిమ్మాపూర్, ఎప్రిల్ 11(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలకేంద్రంలోని శ్రీ చైతన్య అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విద్యార్థులకు స్వాగత, మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు గైరేషన్-2కే26 ఫ్రెషర్స్ పార్టీ వేడుకలను శనివారం ఏర్పాటు చేశారు.విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించినానంతరం మాట్లాడుతూ.... క్రమం తప్పకుండా కళాశాలకు వస్తూ వృత్తిపట్ల సమగ్ర విజ్ఞానాన్ని కలిగి ఉండాలని విద్యార్థును కోరారు.కళాశాల స్థాపించినప్పటి నుండి నాణ్యతతో కూడిన విద్యను అందించడం వల్ల విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత రావడమే కాక 100% ఉద్యోగ అవకాశాలు కూడా పొందుతున్నారని, విద్యపై అంకితభావం నిబద్ధత కలిగి ఉంటే ప్రస్తుత విద్యార్థులు కూడా వివిధ కంపెనీలో ఉద్యోగావకాశాలు పొందగలరని వైస్ ప్రిన్సిపాల్ శశికాంత్ తెలిపారు.సిఎస్ఈ విద్యార్థులకు వివిధ కంపెనీలో మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మిషన్ లర్నింగ్, డాటా సైన్స్ గేమింగ్ అండ్ యానిమేషన్ వంటి నూతన కోర్సుల పట్ల కూడా సమగ్ర విజ్ఞానాన్ని కలిగి ఉండాలని కంప్యూటర్ సైన్స్ అండ్ డిజైన్ విభాగాధిపతి డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ప్రైవేట్ కంపెనీల్లోనే కాక నిర్మాణ రంగ, ప్రభుత్వ రంగ సంస్థలలో కూడా సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలున్నాయని క్రమం తప్పకుండా కళాశాలకు హాజరైనట్లయితే మంచి భవిష్యత్తు ఉంటుందని సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి రామ్ చందు తెలిపారు.విద్యార్థులు చాట్ జిపిటిపై ఆధారపడకుండా స్వయంగా బుక్స్ రెఫర్ చేస్తూ విజ్ఞానాన్ని మెరుగుపరుచుకుంటూ తీరిక సమయాల్లో లైబ్రరీలో వివిధ రకాల పుస్తకాలను క్షుణ్ణంగా చదువుతూ స్వయంగా నోట్ తయారు చేస్తుంటే విద్యార్థుల మెదడు చురుకుగా పనిచేస్తుందని పాలనాధికారి పారువెల్ల రామారావు సూచించారు.వివిధ డిపార్ట్మెంట్ల విభాగ్యపతులు మీడియా ఇన్చార్జి గొంతు రమేష్, అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సెంటనరీ కాలనీ టౌన్ నూతన కాంగ్రెస్ అధ్యక్షుని ఎంపికకు ఆశావాహుల పేర్ల నమోదు

◆ స్థానిక ఐఎన్టీయూసీ శ్రీపాద భవనంలో కీలక సమావేశం ◆ మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్





**రామగిరి, ఏప్రిల్ 11(ది క్రైమ్ న్యూస్):-** రామగిరి మండలం పన్నూర్ గ్రామపంచాయతీ పరిధిలోని సెంటనరీ కాలనీ టౌన్ నూతన కాంగ్రెస్ అధ్యక్షుని ఎంపిక ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది.రామగిరి మండల కాంగ్రెస్ అధ్యక్షులు రొడ్డ బాపన్న మాజీ టౌన్ అధ్యక్షులు కాటం సత్యం ఆధ్వర్యంలో స్థానిక ఐఎన్టీయూసీ శ్రీపాద భవనంలో కీలక సమావేశం నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై నాయకులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా సెంటేనరీ కాలనీ టౌన్ పరిధిలోని సీనియర్ నాయకులు, యువ నాయకులు, అధ్యక్ష పదవిని ఆశిస్తున్న ఆశావాహులు హాజరై తమ పేర్లను నమోదు చేసుకున్నారు.ఈ రోజు సమావేశానికి హాజరు కాలేని ఆశావాహులు ఈ నెల 15వ తేదీ వరకు మండల అధ్యక్షులు రొడ్డ బాపన్న ని సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని తెలియజేయబడింది.నమోదు చేసిన అభ్యర్థుల పేర్లను తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు దృష్టికి తీసుకెళ్లి, అధిష్టానం పరిశీలన అనంతరం త్వరలోనే సెంటేనరీ కాలనీ టౌన్ అధ్యక్షుని పేరును అధికారికంగా ప్రకటించబడుతుందని మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ తెలిపారు. ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు మరియు ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజా పద్ధతినిధులు మహిళా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కృషి,పట్టుదలతో ముందుకు సాగితే విజయాలు సాధ్యం

### - శ్రీచైతన్య చైర్మన్ ముద్దసాని రమేష్ రెడ్డి



**తిమ్మాపూర్, ఎప్రిల్ 11(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలకేంద్రంలోని శ్రీ చైతన్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజికల్ సైన్సెస్ కళాశాలలో నూతన విద్యార్థులకు "ఉషస్సు" పేరుతో స్వాగత వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు.కళాశాల చైర్మన్ ఎం.రమేష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ... జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కృషి, పట్టుదలతో ముందుకు సాగితే విజయాలు సాధ్యమని తెలిపి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఏ.ప్రసాద్ రాజు మాట్లాడుతూ...నూతన విద్యార్థులు కళాశాల వాతావరణానికి త్వరగా అలవాటు పడి తమ ప్రతిభను వెలికితీయాలని సూచిస్తూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కళాశాల అన్ని విధాలుగా సహకరిస్తుందని హామీ ఇచ్చారు.నూతన విద్యార్థులకు ఆత్మీయ స్వాగతం పలుకుతూ సీనియర్ల పాటలు, నృత్యాలు, వినోదాత్మక కార్యక్రమాలతో వేడుక ఆకట్టుకుంది.విభాగాధిపతి డాక్టర్ పెద్ది కిషోర్, డాక్టర్ సిహెచ్ సంపత్ రెడ్డి, టిపిఓ డాక్టర్ కె. చంద్రసేన చారి, అధ్యాపక బృందం డాక్టర్ ఎన్ శ్రీనివాస్, డాక్టర్ ఎస్ నవీన్ కుమార్, డాక్టర్ హరిత మేడం, డాక్టర్ బి రమేష్ అధ్యాపక బృందం ఇతర విభాగాల హెడ్స్, ఇన్‌చార్జ్‌లు సిబ్బంది సభ్యులు వేడుకలో పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# అంబేద్కర్ జయంతోత్సవాలను విజయవంతం చేయండి



**మానకొండూర్, ఎప్రిల్ 11(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలకేంద్రంలో తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన అంబేద్కర్ జయంతోత్సవాల గోడ ప్రతుల ఆవిష్కరణలో ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రవీంద్ర చారి హజరై ప్రతులను ఆవిష్కరించారు.సంఘ మండలాధ్యక్షుడు జీడి శ్యామ్ మాట్లాడుతూ.... దళిత సంఘాలు, అంబేద్కర్ వాదులు, అభిమానులు, బీసీ,ఎస్సీ,ఎస్టీ మైనార్టీ సోదరులు ఏకమై బాబా సాహెబ్ ఆలోచనా విధానాన్ని బలపరచడానికి ఈనెల14న జరిగే జయంతి ఉత్సవాల్లో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా కోరారు.సంఘ రాష్ట్ర అధికార ప్రతినిధి కోంద్ర సంపత్, మండల ప్రధాన కార్యదర్శి కుక్క శ్రీనివాస్, నాయకులు కోంద్ర సురేష్, లక్ష్మీనారాయణ,సంతోష్ తదితరులు ఆవిష్కరణలో పాల్గొన్నారు.

## కులం పేరుతో దూషణ...ముగ్గురిపై కేసు నమోదు

**ఇల్లంతకుంట, ఎప్రిల్ 11(ది క్రైమ్ న్యూస్):** రాజన్న జిల్లా ఇల్లంతకుంట మండలం రామోజీపేటలో పిల్లి భాగ్య, పిల్లి నర్సయ్య, మామిండ్ల ఐలయ్య అనే ముగ్గురు ఈనెల 2న తన ఇంటికి వచ్చి కులం పేరుతో దూషిస్తూ బెదిరింపులకు పాల్పడ్డారంటూ బాధితుడు భూత్కూరి ఆంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సిరిసిల్ల అశోక్ తెలిపారు.

# యూత్ అధ్యక్షుని కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



**రామగిరి, ఏప్రిల్ 11(ది క్రైమ్ న్యూస్):-** రామగిరి మండలం రత్నాపూర్ గ్రామ బిఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు మన్నాల రాహుల్ కుటుంబాన్ని శనివారం మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ పరామర్శించారు. ఇటీవల రాహుల్ తండ్రి సాయిలు అకాల మరణం చెందాడు. సాయిలు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు, మండల పార్టీ అధ్యక్షుడు శంఖేషి. రవీందర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పూదరి సత్యనారాయణ,కార్పొరేటర్ రాజా గౌడ్, గ్రామ అధ్యక్షుడు భాద్రపు ప్రశాంత్, సందేవెన కుమార్,పానగంటి వీరేశం, దామెర.శ్రీనివాస్, కొవ్వూరి సురేష్, ముడుసు నర్సయ్య, బంద్ర శంకర్,రమేష్, మన్నాల సతీష్పాల్గొన్నారు.

## ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు



**ధర్మపురి, ఎప్రిల్ 11, (ది క్రైమ్ న్యూస్):** ధర్మపురి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే చేసిన సామాజిక ఉద్యమాలు, సేవలను కొనియాడారు. సమాజంలో సమానత్వం, విద్యా విస్తరణ కోసం ఆయన చేసిన కృషి ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని అధ్యక్షులు బందెల రమేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మామిడాల శ్రీకాంత్ కుమార్, మహిళ ప్రధినిథి కలమడుగు కీర్తి, మరియు న్యాయవాదులు రౌతూ రాజేష్, అలుక వినోద్ కుమార్, జాజల రమేష్, కస్తూరి శరత్ కుమార్‌లు పాల్గొన్నారు.

# అవమానం..బానిసత్వం రూపుమాపేందుకే నా పోరాటం

- మహనీయులను అర్థం చేసుకుంటేనే చరిత్ర సృష్టిస్తం
- పోరాటం చేసే ప్రతి వ్యక్తిని ప్రోత్సహించేది అగ్రవర్ణాలే
- మన ఓట్లతో గెలిచి సమాజం గురించి ఆలోచన చేయని దుద్దిళ్ల
- రెండున్నర ఏండ్లలో తమ్ముడికి పదవి ఇప్పించిన చరిత్ర ఆయనదే
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మదూకర్





**రామగిరి, ఏప్రిల్ 11(ది క్రైమ్ న్యూస్):-** అట్టడుగు వర్గాల కోసం ఆనాడే ఆలోచన చేసిన మహనీయులను అర్థం చేసుకోకపోతే చరిత్ర సృష్టించలేమని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. మహనీయుల మాహో సోత్సవాల్లో బాగంగా రామగిరి మండలం సెంటనరీ కాలనీలో మహాత్మ జ్యోతిరావుపూలే విగ్రహానికి దీక్షాపరులతో కలిసి ఆయన పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులను చూడకపోయినా చిన్నప్పటి నుంచే న్యాయబద్దంగా సమాజం కోసం భవిష్యత్ కోసం అనేక నిర్ణయాలు తీసుకున్నట్లు చెప్పారు. 1988లో తనకు అవమానం అంటే అర్థం అయిందని, దౌర్జన్యం, గుండాయిజం అంటే మంథనిలోని క్రీడామైదానంలో చూశానని తెలిపారు. ఎక్కడి నుంచే క్రికెట్ చూసేందుకు వచ్చి గ్రౌండ్‌లో నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తిని మంథనికి చెందిన మరో వ్యక్తి మధ్యలో ఆపి కొడుతుంటే చూసి ఇంత అన్యాయమా అని బాధలో ఆలోచన చేసి అవమానం బానిసత్వాన్ని రూపుమాపేందుకు నియోజకవర్గంలో యుద్దం మొదలుపెట్టానని అన్నారు. మహాత్మ జ్యోతిబా పూలే, డా బీఆర్ అంబేద్కర్‌ల గురించి 2011లో శంకర్‌లాల్ ద్వారా తెలుసుకుని అర్థం చేసుకుని ఆనాటి నుంచి ఇప్పటి వరకు వారి ఆశయాల కోసం పనిచేస్తున్ననని అన్నారు. తాను ఎమ్మెల్యేగా ఓడిపోయిన తర్వాతనే మహనీయులను వాడుకుంటున్నరని మాట్లాడుకుంటున్నారని, కానీ 2014లో ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత 2015లోనే జ్యోతిబా పూలే క్యాంస విగ్రహం ఆవిష్కరణ చేశామని, రాష్ట్రంలో కాంస్య విగ్రహం ఏర్పాటు చేయడం ఇక్కడే మొదటిదని ఆయన అన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన మరుసటి సంవత్సరం నుంచే మహనీయుల మాసమని ప్రచార కర్యక్రమం నిర్వహించినట్లు ఆయన గుర్తు చేశారు. చాలా మంది ఇప్పటి వరకు అనుకుంటూనే ఉన్నరని మహనీయుల గురించి ఎంత చెప్పినా పుట్ట మధు ఓడిపోయాడని చులకనగా చూస్తూ అపహాస్యం చేస్తున్నరని, కానీ మహాబారతంతో అర్జునిడి లక్ష్యం ఏవిధంగా ఉంటుందో అదే విధంగా తనకు అంతిమ విజయం కన్పిస్తుందన్నారు. ఓటమిలో కూడా గెలుపును చూశానన్నారు. మహనయుల చరిత్ర చెప్తున్నం కనుకనే నిన్నటి వరకు ఉచితంగా ఓట్లు దండుకుని గెలిచిన మంథని ఎమ్మెల్యే ఈనాడు వేయి రూపాయలుపెట్టి ఓట్లు కొంటున్నాడని అయన అన్నారు. ఆనాడు కాన్సీరాం పదేపదే ప్రభుత్వాలను కూలదోస్తున్నరని అడిగితే ఎన్నిసార్లు ఎన్నికలకు వస్తే అన్నిసార్లు నా సమాజానికి పైసలు వస్తయని సంతోషపడ్డడని, అలాగే ప్రస్తుతం తాను సంతోషపడుతున్నానని అన్నారు. పదేండ్లు మనం అధికారంలో ఉన్నం ఓసీలకు, మన కులాలకు వ్యతిరేకమని కొందరు పిచ్చికుతలు కూస్తున్నరు కానీ పదేండ్లలో ఏ ఒక్క అగ్రవర్ణాన్ని ఇబ్బంది పెట్టని చరిత్ర చూపామన్నారు. ఈనాడు సమాజం ద్వంసమైతాందని, లారీల కింద పడి చనిపోయిన వారిని ఆ కుటుంబం రాకముందే పోస్టుమార్టం రూంలో పడేస్తున్నరని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ కులాలకు వ్యతిరేకం కాదని, మహాత్మపూలే, అంబేద్కర్‌లాంటి మహనీయుల పోరాటానికి అగ్రవర్ణాలే బ్యాక్ గ్రౌండ్‌గా నిలిచారని, పోరాటం చేసే ప్రతి వ్యక్తికి బ్యాక్ గ్రౌండ్ ఉండి ముందుకు నడిపిచ్చిన వాళ్లు అగ్రవర్ణాలే అని అన్నారు. వందల సంవత్సరాల ముందు నుంచి చైతన్యవంతులు, ఆలోచన పరులు, సమాజాన్ని మేలుకొలుపాలనే వారు ఉంటరని, ఆనాడు పూలేకు అంబేద్కర్‌కు సహకారం చేసింది బ్రాహ్మణులేనని, తనకు ఈనాడు సహకారం అందించేది బ్రాహ్మణులే అని అన్నారు. గతం నుంచి ప్రభుత్వాలు ఎన్ని పథకాలు ఇచ్చినా, ముందుకు తీసుకెళ్లాలని ఆశించినా వెనుకబడే ఉన్నామని దానికోసమే ఈ పోరాటమన్నారు. మంథని నియోజకవర్గంలో ప్రస్తుత ఎమ్మెల్యే మన సమాజం గురించి ఏనాడు ఆలోచన చేయలేదని, నియోజకవర్గ అభివృద్ధి కోసం ఆలోచన చేయలేదన్నారు. రాజ్యాంగం ఎప్పుడైతే మనకు అర్థం అయిందో, ఎప్పుడైతే ఏ విధంగా దేశాలు ముందుకు వెళ్తున్నయ్, నియోజకవర్గాలు ముందుకెళ్తయో అర్థం కావడం మూలంగానే వాళ్ల గురించి మాట్లాడుతున్నామే కానీ వాళ్లతో భూమస్యలు లేవు కుటుంబపంచాయతీ లేదు, ఆస్తుల సమస్యలేదని కేవలం మా ఓట్లు వేసుకున్న మీరు మా గురించి మా సమాజం గురించి ఎందుకు ఆలోచన చేయడం లేదనే పోరాటం చేస్తున్నామన్నారు. ఓడేడ్ గ్రామంలో ఓ యువకుడు స్టాఫ్టవేర్ ఉద్యోగం నుంచి తొలగించడంతో తీవ్ర మనస్థాపానికి గురై తన కుటుంబానికి అండగా నిలువలేకపోతున్నానని చనిపోయాడని, అందుకు కారణం మనం ఓటు వేసి గెలిపించిన నాయకులు కాదా అని ప్రశ్నించారు. మానిఫెస్టో రాసి అందులో పొందుపర్చిన ఒక్క అంశాన్ని అమలు చేయకుండా 370హామీలను పూర్తి చేసినని అబద్దాలు చెప్తున్నాడని ఆయన వివరించారు. దీనిపై ప్రశ్నించే తత్వం రాకపోతే వెనుకబడే ఉంటామన్నారు. బీసీలు మహనీయుల చరిత్ర ఎప్పటి వరకు వినరో అప్పటి వరకు చరిత్ర సృష్టించరన్నారు. అలాగే ఎస్సీలను ప్రేమించకుండా కలుపుకుని పోనంత వరకు మనం కిందకే పోతామన్నారు. ప్రతి బీసీ పూలే చరిత్ర వినాలని ఆయన పిలుపునిచ్చారు. ఆనాడు పూలేను గురువుగా స్వీకరించి అర్థం చేసుకున్నడు కనుకనే అంబేద్కర్ అంత గొప్పవాడయ్యారన్నారు. ఈనాడు బీసీల్లోని కులాలను వేరు చేసుకుంటూ పటేల్, గౌడ్, ముదిరాజ్, యాదవ్ అంటూ జెట్కాలు పెట్టుకుంటున్నామని, ముందు ఆ జెట్కాలను పెట్టుకోవడం మానుకోవాలన్నారు. కేవలం బీసీలు అంటే అన్ని కులాలను కలుపుకుపోవాలే కానీ అందులో విభజన చేసుకోవద్దన్నారు. కులాల పేరుతో మనల్ని విభజించారని, మనలో వైషమ్యాలు పెంచారని ఆయన గుర్తు చేశారు. మాలమాదిగలు, బీసీలను కలువకుండా చేసిన చరిత్రను అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తాను ఈనాడు ఏ కుల సంఘ మీటింగ్‌కు వెళ్లడం లేదని, కేవలం బీసీల మీటింగ్ అంటేనే వెళ్లాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఆనాడు బీసీలకు రిజర్వేషన్‌లు ఉండాలని కోరుకున్న అంబేద్కర్‌ను కాంగ్రెస్ పార్టీ మనకు దూరం చేసిందని, ఒక్కవర్గానికి చెందినవారని ప్రచారం చేసిందన్నారు. అంబేద్కర్ రిజర్వేషన్‌ల పుణ్యాన ఈనాడు ఎస్సీలు అసెంబ్లీ, పార్లమెంట్‌లో కూర్చుంటరనే విషయాన్ని బీసీలు గుర్తించాలన్నారు. ఆనాడు అంబేద్కర్‌ను అర్థం చేసుకుని ఆయన వెంట ప్రయాణం చేసి ఉంటే ఇప్పటికే గొప్పగా ఎదిగివాళ్లమని అన్నారు. నియోజకవర్గంలో 40ఏండ్లు ఒక కుటుంబం ఇంత పెద్ద సంఖ్యలో ఉన్న మనల్ని విడగొట్టి వాళ్ల రాజ్యం ఏలుతాండ్లని, రెండున్నర ఏండ్లలో అన్న తర్వాత తమ్ముడికి పదవి వచ్చిందే తప్ప మరొకరికి పదవులు ఇచ్చారా అని ప్రశ్నించారు. మహనీయుల చరిత్ర చెప్పడం మూలంగానే కాంగ్రెస్‌పార్టీలో ఐదు, పదిశాతం మందికి పదవులు ఇచ్చి గౌరవిస్తున్నారనే విషయాన్ని చాటి చెప్పాలన్నారు. బీసీలు మహనీయుల చరిత్రను అర్థం చేసుకోవాలని, ఆ దిశగానే తన పోరాటం కొనసాగుతుందని ఈ సందర్బంగా ఆయన స్పష్టం చేశారు. అనంతరం మంథనిలోని జ్యోతిబా పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం సహపంక్తి బోజనం ఏర్పాటు చేయగా మంథని మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ దీక్షపరులకు బోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పూదరి సత్యనారాయణ గౌడ్, రామగిరి మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శంకేష్ రవీందర్, ఆర్ జి-త్రీ తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఉపాధ్యక్షులు నాగేల్లి సాంబన్న, సెంటనరీ కాలనీ టౌన్ అధ్యక్షులు కాపరుబోయిన భాస్కర్, రత్నాపూర్ గ్రామ సర్పంచ్ పల్లె ప్రతిమ- పివి రావు బేగంపేట గ్రామ సర్పంచ్ మంతెన చంటి, మాధరవైన కుమార యాదవ్, అల్లం తిరుపతి, మెడగొని రాజన్న, గాజుల ప్రసాద్, బడికల విజయ-శ్రీనివాస్, మైదం కుమార్, ఇసంపల్లి రమేష్, దేవ శ్రీనివాస్, యాసం తిరుపతి, పుల్లెల కిరణ్, బూరుగు రాజు గౌడ్, వేగోళపు మల్లయ్య, వేగోళపు శ్రీనివాస్, గద్దల శంకర్, దామెర శీను, బాద్రాపు ప్రశాంత్, సైన్ల సత్యనారాయణ, రేండ్ల కుమారస్వామి, రోడ్డ శ్రీనివాస్, గుర్రం రాజమల్లు, లక్కారం అత్తే చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.





# అంబేడ్కర్, పూలే జీవితాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

- ఆర్.జి-త్రీ , ఎ.పి.ఎ ఏరియా లో ఘనంగా మహాత్మా జ్యోతిరావు పూలే వేడుకలు





**రామగిరి, ఏప్రిల్ 11(ది క్రైమ్ న్యూస్):-** అణగారిన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపిన అంబేద్కర్, జ్యోతిరావు పూలే జీవితాలను యువత స్ఫూర్తి గా తీసుకోవాలని మహిళా విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేశారని రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు లు అన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతిని పురస్కరించుకొని రామగుండం-త్రీ , అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాల ఆధ్వర్యంలో శనివారం జయంతి వేడుకలు నిర్వహించడం జరిగింది. ముందుగా సెంటినరీ కాలనీ లోని మార్కెట్ కూడలి వద్ద గల మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం జిఎం కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. తదుపరి కేక్ కట్ చేసి అందరికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే అణగారిన వర్గాల అభ్యున్నతితో పాటు, అంటరానితనం రూపుమాపడానికి అహర్నిశలు కృషి చేశారని, వారు సమాజాభివృద్ధి కోసం చేసిన సేవలు మరువలేనివని అన్నారు. ఆ రోజుల్లోనే బాలికల కోసం ప్రత్యేక పాఠశాలలు నెలకొల్పి మహిళా విద్యాభివృద్ధికి కృషి చేశారని అన్నారు. వారి ఆశయాలకు అనుగుణంగా పని చేస్తూ, వారి బాటలో నడవాలన్నారు. ఈ కార్యక్రమం లో ఎస్వోటు జిఎం బి.వి.సత్య నారాయణ, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు యం.రామచంద్రరెడ్డి, కోట రవీందర్ రెడ్డి, ఏరియా అధికారుల సంఘం అధ్యక్షుడు కోల శ్రీనివాస్, బిసి ఉద్యోగుల సంఘం నాయకులు కె.ఐలయ్య, బెల్లం శ్రీనివాస్, ఒబిసి ఉద్యోగుల సంఘం నాయకులు నాగెల్లి సాంబయ్య, ఇసంపెల్లి రమేష్, ఏరియా ఇంజినీర్ సుధాకర్ రెడ్డి, ప్రాజెక్ట్ ఆఫీసర్ ప్రవీణ్ వి ఫాటింగ్, విభాగాల అధిపతులు బి.టి.మురళీ కృష్ణ, రాజారెడ్డి, రాజేంద్ర కుమార్, సి.జె.సురేఖ, రవి చరణ్, సునీల్ ప్రసాద్, షబ్బీరుద్దీన్, తోపాటు ఇతర అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.







# జ్యోతిరావ్ పూలే ఆశయ సాధనకు అందరు కృషి చేయాలి

- రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ధర్మపురి, ఎప్రిల్ 11, (ది క్రైమ్ న్యూస్):** సమాజంలో అంటరానితనం కుల వ్యవస్థ నిర్మూలన పై పోరాడిన మహనీయులు జ్యోతిరావు పూలే అని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా జగిత్యాల జిల్లా ధర్మపురి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన వేడుకల్లో మంత్రి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ జ్యోతిరావు పూలే తీసుకువచ్చిన అనేక సంస్కరణలు అణగారిన వర్గాల పాలిట వరంగా మారాయని అన్నారు. స్వేచ్ఛ సమానత్వం కోసం పూలే చేసిన సేవలు, పోరాటాలు చేశారని మంత్రి అడ్లూరి ఈ సందర్భంగా గుర్తు చేశారు. మహిళలకు చదువు నేర్పిస్తే సమాజం బాగుంటుందని భావించి తన భార్య సావిత్రిబాయి పూలే కు చదువు నేర్పించారని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. సావిత్రిబాయి పూలే ద్వారా మహిళలకు చదువు నేర్పించారని మంత్రి లక్ష్మణ్ కుమార్ గుర్తు చేశారు. జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు అందరం కట్టుబడి ఉండాలి అని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య తో పాటు పలువురు మున్సిపల్ కౌన్సిలర్ లు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# మహాత్మ జ్యోతిరావు పూలే 199వ జయంతి వేడుకలు ..

- పూలమాలవేసి నివాళులర్పించిన తెలంగాణ రాష్ట్ర బీసీ సంఘం నాయకులు

**జగిత్యాల, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** మహాత్మ జ్యోతి పూలె జయంతి వేడుకలు బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది.. ఈ సందర్బంగా బీసీ నాయకులు మాట్లాడుతూ ....మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయాలు భారత సమాజంలో సమానత్వం, న్యాయం, విద్య, సామాజిక సంస్కరణల మీద ఆధారపడి ఉన్నాయి. ఆయన ఆలోచనలు చాలా ముందుచూపుతో కూడినవి... సమానత్వం (జునఖుశ్రీఉఎ)కుల, మత, లింగ భేదాలు లేకుండా అందరికీ సమాన హక్కులు ఉండాలి అని భావించారు. సమాజంలో అణగారిన వర్గాలకు గౌరవం కల్పించాలని కృషి చేశార. విద్య ప్రాముఖ్యత విద్య ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుంది అని నమ్మారు..బాలికల విద్యకు ప్రాధాన్యం ఇచ్చి మొదటి అమ్మాయిల పాఠశాలను ప్రారంభించారు..మహిళా సాధికారత మహిళల హక్కులు, విద్య, స్వేచ్ఛ కోసం పోరాటం చేశారు. బాల్య వివాహాలు, సతి వంటి దురాచారాలకు వ్యతిరేకంగా నిలబడ్డారు.. కులవ్యవస్థ వ్యతిరేకం కులవ్యవస్థ అన్యాయం అని ఖండించారు. అణగారిన వర్గాల కోసం సమాన అవకాశాలు కల్పించాలని కోరుకున్నారు. రైతుల హక్కులు రైతుల సమస్యలను గమనించి, వారికి న్యాయం జరగాలని కోరుకున్నారు. రైతులపై జరిగే దోపిడీకి వ్యతిరేకంగా పోరాడారు. సామాజిక సంస్కరణ సమాజంలో ఉన్న మూఢనమ్మకాలు, అన్యాయాలపై విమర్శలు చేశారు. సమాజాన్ని విజ్ఞానపరంగా మార్చాలని ప్రయత్నించారు అని ఇట్టి కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బీసీ సంఘం కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ, తెలంగాణ వంజరి సంఘం జాయింట్ సెక్రెటరీ ఆరె శంకర్ మరియు డాక్టర్ గొల్లపల్లి చంద్రశేఖర్ గౌడ్, మానాల కిషన్ బ్రహ్మాండభేరి నరేష్ పాపన్న శ్రీనివాస్, పిండేరు శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# ధర్మపురిలో పూలే విగ్రహం ఏర్పాటు చేయాలి



**ధర్మపురి, ఎప్రిల్ 11, (ది క్రైమ్ న్యూస్):** ధర్మపురి మండల కేంద్రంలోని స్థానిక గాంధీ విగ్రహం వద్ద బీసీ సంఘం, అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో శనివారం మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి వివిధ రాజకీయ పార్టీల నాయకులు, బీసీ సంఘాల ప్రతినిధులు, అంబేద్కర్ సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించి జయంతి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే చేసిన సామాజిక ఉద్యమాలు, సేవలను కొనియాడారు. సమాజంలో సమానత్వం, విద్యా విస్తరణ కోసం ఆయన చేసిన కృషి ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అనంతరం బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు, న్యాయవాది జాజాల రమేష్ మాట్లాడుతూ ధర్మపురి మండల కేంద్రంలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ విషయాన్ని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ని కలసి విగ్రహ స్థాపనకు చర్యలు తీసుకోవాలని కోరుదామని దీనికి అందరూ కలసి ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అయ్యోరి రాజేష్, బీసీ యువజన సంఘం మండల అధ్యక్షుడు బోగ రమేష్, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు అరికేల సతీష్, రాష్ట్ర నాయకులు పారపెల్లి రాజమల్లయ్య, అవునూరి శ్రీకాంత్, వివిధ పార్టీల నేతలు సంగి శేఖర్, కుంట సుధాకర్, గాజు భాస్కర్, బెజ్జరపు లవన్, పెరుమాండ్ల ఎల్లగౌడ్, సతీష్, మహేందర్, కాంతారావు తదితరులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## పరగడుపున టమాటాలు తింటే ఇలా అవుతుందా..?

ఇంట్లో కూరగాయలు, పప్పు రుచిని పెంచడానికి ఉపయోగించే టమాటాలు తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. టమాటాలను తరచుగా కూరలు, సలాడ్‌లు, సూప్‌లు, చట్నీలలో ఉపయోగిస్తారు. టమాటాలు చర్మ ఆరోగ్యానికి చాలా ఉపయోగకరంగా పనిచేస్తాయి. టమాటాలను అందం కోసం కూడా చాలా హోం రెమెడీస్ లో ఉపయోగిస్తుంటారు. అంతే కాదు, టమాటాలను అనేక సౌందర్య ఉత్పత్తులలో కూడా ఉపయోగిస్తారు. టమాటాలో విటమిన్ సి, లైకోపీన్, విటమిన్ కె, పొటాషియం పుష్కలంగా ఉన్నాయి. దీన్ని తినడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. టమాటా బరువు తగ్గడానికి కూడా సహాయపడుతుంది. టమోటాలు తినడం వల్లకలిగే ప్రయోజనాలను తెలుసుకుందాం. టమాటా తినడం వల్ల కలిగే ప్రయోజనాలు.. 1- బాగా పండిన టమాటాలను ఉదయం పూట నీళ్లు తాగకుండా ఖాళీ కడుపుతో తింటే ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. 2- రికెట్స్‌తో బాధపడుతున్న పిల్లలకు రోజూ ఒక గ్లాసు టమాటా రసం ఇవ్వాలి. దీంతో వారికి ఎంతో మేలు జరుగుతుంది. 3- టమాటా తినడం వల్ల పిల్లల శారీరక, మానసిక అభివృద్ధి మెరుగుపడుతుంది. 4- బరువు తగ్గడానికి, మీరు టమాటాలు తినండి. మీరు టమాటాను సలాడ్‌లో కూడా చేర్చుకుని తినవచ్చు. లేదా 1-2 గ్లాసుల టమాటా రసం చేసుకుని కూడా తాగొచ్చు. 5- ఆర్థరైటిస్‌తో బాధపడేవారు టమాటా తినాలి. టమాటా జ్యూస్‌లో సెలెరీని కలిపి తాగడం సహాయపడుతుంది.

# ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణమే లక్ష్యం

## ఆరెకపూడి గాంధీ

**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణమే లక్ష్యమని ఆరెకపూడి గాంధీ అన్నారు. శనివారం శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని హఫీజ్పేట్ డివిజన్ ఆర్టీసీ కాలనీలో రూ.25 లక్షల అంచనాతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌తో పాటు పిల్లల ఆటవిడుపు పరికరాలను పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా విచ్చేసి, మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యమే ప్రధాన ఆస్తి అని, భవిష్యత్తు తరాలకు మంచి ఆరోగ్యం, ప్రశాంత జీవితం అందించాల్సిన బాధ్యత అందరిదని పేర్కొన్నారు. ఓపెన్ జిమ్ ద్వారా పిల్లలు, యువకులు, వృద్ధులు వ్యాయామం చేయడానికి మంచి అవకాశముంటుందని అన్నారు. ప్రస్తుత జీవనశైలిలో ప్రతి ఒక్కరూ వ్యాయామాన్ని అలవాటు చేసుకోవాలని, ఆరోగ్యం బాగుంటే ఏదైనా సాధ్యమవుతుందని తెలిపారు. "ఆరోగ్యమే మహాభాగ్యం" అని గుర్తుచేశారు. హఫీజ్పేట్ డివిజన్‌లోని పార్కులను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి, వాకింగ్ ట్రాక్‌లు, మొక్కలు, ఇతర మౌళిక సదుపాయాలతో అందంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ప్రజలు కూడా పార్కులను సంరక్షించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ




కార్యక్రమంలో దాత్రి గౌడ్, లక్ష్మారెడ్డి, మిరియాల ప్రీతమ్, యాదగిరి, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మనమంతా విద్యావంతులుగా ఎదగడమే వారికి నిజమైన నివాళి

## ● రవికుమార్ యాదవ్

**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** నేడు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ, విద్యలో సమానత్వం వెనుక జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల కృషి ఎంతో ఉందని, కుల, మత భేదాలు లేకుండా అందరం కలిసిమెలిసి జీవించడం, విద్యావంతులుగా ఎదగడమే వారికి నిజమైన నివాళి అని రవికుమార్ యాదవ్ అన్నారు. శనివారం మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆల్విన్ కాలనీ డివిజన్‌లోని పటేల్‌కుంట పార్క్ ఎదురుగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్ పాల్గొని పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే ఒక గొప్ప సామాజిక విప్లవకారుడని కొనియాడారు. భారతదేశంలో సామాజిక సమానత్వానికి పునాది వేసిన మహనీయుడు పూలే అని తెలిపారు. విద్య లేకపోతే సమాజం అభివృద్ధి చెందదని నమ్మి, అణగారిన వర్గాలు, మహిళలకు విద్య అందించేందుకు ఆయన చేసిన కృషి అమోఘమని అన్నారు. తన భార్య సావిత్రిబాయి పూలేను చదివించి దేశంలోనే తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా తీర్చిదిద్దిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. కుల వివక్షను నిర్మూలించేందుకు సత్యశోధక సమాజ్‌ను స్థాపించి సమాజంలో సమానత్వం కోసం నిరంతరం పోరాడిన మహానుభావుడని పేర్కొన్నారు. మహాత్మా గాంధీ కూడా పూలేని "నిజమైన మహాత్మా"గా అభివర్ణించారని, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆయనను తన




గురువుగా భావించారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రామరాజు, కేశవులు, నర్సింగ్ యాదవ్, మణిభూషణ్ నరసింహచారి, కృష్ణంరాజు, సందీప్ గౌడ్, కమలాకర్ రెడ్డి, భూపాల్ రెడ్డి, బాలు యాదవ్, గోపాల్ రావు, ఆంజనేయులు యాదవ్, నర్సింగ్ రావు, రాయల్ రఘు, సురేష్, విష్ణువర్ధన్ రెడ్డి, చాంద్, రాజు, సాయి, వేణు, దినేష్, కళ్యాణ్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ రహిత సమాజం కోసం రాజీ లేని కృషి : ఆరెకపూడి గాంధీ

**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ట్రాఫిక్ రహిత సమాజం కోసం రాజీ లేని కృషి చేస్తున్నామని ఆరెకపూడి గాంధీ అన్నారు. శనివారం చందానగర్ డివిజన్ పరిధిలోని దీప్తిశ్రీనగర్‌లో నెలకొన్న ట్రాఫిక్ సమస్య పరిష్కారంపై పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ అధికారులు, మాజీ కార్పొరేటర్లు నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకుడు రఘునాథ్ రెడ్డిలతో కలిసి స్థల పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ దీప్తిశ్రీనగర్‌లో నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమస్య పరిష్కారానికి రోడ్డు విస్తరణ అవసరమని గుర్తించి, అధికారులతో కలిసి పాదయాత్రగా పరిశీలన నిర్వహించామని చెప్పారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రయాణించేందుకు సమగ్ర చర్యలు తీసుకుంటామని, ట్రాఫిక్ రద్దీ నివారణకు ప్రత్యేక రోడ్ డివిజన్ ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. రోడ్డు ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకుని తొలగిస్తామని స్పష్టం చేశారు. అదేవిధంగా, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, రోడ్డుకు అడ్డంకిగా ఉన్న విద్యుత్ స్తంభాలను త్వరితగతిన తొలగించాలని సూచించారు. అవసరమైన చోట రోడ్డు విస్తరణ చేపట్టి ట్రాఫిక్ సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి సమస్యను పరిష్కరించేందుకు సిద్ధంగా



ఉన్నామని, శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని గాంధీ పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ప్రసాద్, అక్బర్ ఖాన్, సాజిద్, నరేందర్ బల్లా, కాలనీ వాసులు సీతారామయ్య, పూర్ణచంద్రరావు, చంద్రశేఖర్, రామారావు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# లొంకా కేసారం గ్రామ అభివృద్ధికి కొత్త ఊపు

● రూ.10 లక్షల సీసీ రోడ్డు పనులకు ఘనంగా శంకుస్థాపన ● రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న ● మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ ● గ్రామంలో సిసి రోడ్డు రహదారుల నిర్మాణంతో మెరుగైన సౌకర్యాలు ● సర్పంచ్ వీరగోని రమాదేవి- శ్రీనివాస్






**రామగిరి, ఏప్రిల్ 11(ది క్రైమ్ న్యూస్):-** రామగిరి మండలంలోని లొంకా కేసారం గ్రామ ప్రజల కోరిక మేరకు తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు సీసీ రోడ్డు నిర్మాణానికి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్ఆర్) ఈజీఎస్ నుంచి రూ పది లక్షలు నిధులు మంజూరు చేశారు. రామగిరి మండలంలోని లొంకా కేసారం గ్రామ పంచాయతీలో సీసీ రోడ్డు పనులకు మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్, గ్రామ సర్పంచ్ వీరగోని రమాదేవి శ్రీనివాస్‌లు కొబ్బరికాయ కొట్టి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం, గ్రామాభివృద్ధికి కట్టుబడి ఉందని తెలిపారు. గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. అలాగే గ్రామ సర్పంచ్ వీరగోని రమాదేవి శ్రీనివాస్ లు మాట్లాడుతూ గ్రామాన్ని అన్ని రంగాల్లో తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని, వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను నివారించేందుకు పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమం లో ఉప సర్పంచ్ రంగు వనిత-రాజబాబు, వార్డ్ మెంబర్స్ ఇరుగురాల నగేష్, ప్రణీత్ , నమని సారయ్య,ఎండీ సుభాన్.మాజీ ఎంపీపీ ఆరెల్లి దేవక్క-కొమురయ్య, రామగిరి మండలం ఎస్సీ సెల్ అధ్యక్షుడు కండె పోషం, మాజీ సర్పంచ్ తీగల సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఓయూ విద్యార్థుల కోసం మూడు బస్సులను విరాళంగా ఇచ్చిన ఎస్బీఐ...

## ● సామాజిక, విద్యా వికాసం కోసం బాధ్యతగా ముందుకొచ్చిన ఎస్బీఐని అభినందించిన ఓయూ వీసీ...

**హైదరాబాద్ (ది క్రైమ్ న్యూస్):** ఉస్మానియా విశ్వవిద్యాలయం: ఓయూ క్యాంపస్ సహా విద్యార్థుల రవాణా అవసరాల కోసం కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మూడు బస్సులను విరాళంగా అందజేసింది. ఈ మేరకు బస్సుల తాళాలను అధికారులు ఓయూ ఉపకులపతి ఆచార్య కుమార్ మొలుగరం కు అ అందజేశారు. ప్రతిష్టాత్మక ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో సామాజిక బాధ్యత, విద్యా వికాసమే లక్ష్యంగా, భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) బస్సులను అందజేసే కార్యక్రమం వైభవంగా జరిగింది. సుమారు కోటి రూపాయల విలువైన ఈ విరాళం విశ్వవిద్యాలయ రవాణా సౌకర్యాలను గణనీయంగా మెరుగుపరచనుంది. రెండు సాధారణ బస్సులతో పాటు ఓ ఏసీ బస్సు కూడా ఎస్బీఐ అధికారులు ఓయూ కు అందజేశారు. ఈ సందర్భంగా ఉస్మానియా విశ్వవిద్యాలయ గౌరవ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం మాట్లాడుతూ... ఓయూ విద్యార్థుల పట్ల భారతీయ స్టేట్ బ్యాంక్ అంకిత భావాన్ని ప్రశంసించారు. కోటి రూపాయల వ్యయంతో ఇచ్చిన మూడు బస్సులు కేవలం రవాణా సౌకర్యాన్ని మెరుగు పరచటమే కాకుండా.... విద్యార్థుల విద్యా ప్రయాణానికి వెన్నుదన్నుగా నిలుస్తుందని కొనియాడారు. ప్రతిభకు నిలయమైన ఉస్మానియా వంటి విశ్వవిద్యాలయానికి, దేశంలోని అతిపెద్ద బ్యాంక్ అండగా నిలవడం భావితరాల నిర్మాణానికి ఎంతో తోడ్పడుతుందని గుర్త చేశారు. భవిష్యత్తులోనూ ఈ సహకారం కొనసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ ప్రధాన అధికారి శ్రీ ఎస్. రాధాకృష్ణన్ మాట్లాడుతూ... 219 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన స్టేట్ బ్యాంక్, 109 ఏళ్ల అద్భుత విద్యా వారసత్వం కలిగిన ఉస్మానియా విశ్వవిద్యాలయం కలిసి పనిచేయటం చారిత్రాత్మకమని అన్నారు. ఈ అవకాశం తమకు దక్కిన గొప్ప గౌరవంగా అభివర్ణించారు. గత శతాబ్ద కాలంగా దేశ మేధో సంపత్తిని పెంపొందించడంలో ఉస్మానియా పోషిస్తున్న పాత్ర అనితరసాధ్యంమని ప్రశంసించారు. మా ఈ సామాజిక బాధ్యత చొరవ ద్వారా విద్యార్థులకు మరింత మెరుగైన వసతులు కల్పించడం మాకు సంతోషాన్నిస్తోందని వ్యాఖ్యానించారు. ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ శ్రీ సతీష్ కుమార్ మాట్లాడుతూ: దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని తాము నమ్ముతున్నామని ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడం ద్వారా దేశాభివృద్ధిలో భాగస్వాములమవుతున్నామని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో భాగంగా ఓయూ, ఎస్బీఐ అధికారులు జెండా ఊపి వాహనాలను అధికారికంగా ప్రారంభించారు. చారిత్రాత్మక ఆర్ట్స్ కళాశాల ముందు నిలిచిన నూతన వాహనాలు విశ్వవిద్యాలయ శోభను మరింత ద్విగుణీకృతం చేశాయి. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేష్ రెడ్డి, ఓఎస్డీ ప్రొఫెసర్ జితెంద్ర కుమార్ నాయక్, ప్రొఫెసర్ రాజశేఖర్ రెడ్డి, ప్రొఫెసర్ సి. కాశీం... ఎస్బీఐ అధికారులు పంకజ్ ప్రియదర్శి, రోహిత్ కుమార్, కొండ రవి శేఖర్, తంగి గణపతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వాచ్‌మెన్ మృతి



**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** అతివేగం ఒక నిండు ప్రాణాన్ని బలిగొన్న ఘటన గోదావరిఖనిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కాకతీయ నగర్‌కు చెందిన ఇందారపు రాయపోషం అనే వ్యక్తి వాచ్‌మెన్‌గా పనిచేస్తుండేవారు. నిన్న (ఏప్రిల్ 10) రాత్రి సుమారు 06:30 గంటల సమయంలో, మునిసిపాలిటీ ఎలక్ట్రీషియన్ చిన్నయ్యతో కలిసి టీ తాగడానికి మునిసిపాలిటీ ఆఫీసు నుండి బస్టాండ్ వైపు టీవీఎస్ సెంట్రా మోటార్ సైకిల్‌పై బయలుదేరారు. చౌరస్తా వద్ద సిగ్నల్ దాటి కుడివైపునకు మలుపు తిరుగుతున్న క్రమంలో, వెనుక నుండి అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చిన హోండా సిటీ కారు వీరి బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ముత్తారం నివాసి అయిన డ్రైవర్ ఇనుముల కుమార్ నడుపుతున్న ఈ కారు ఢీకొనడంతో చిన్నయ్య, రాయపోషం ఇద్దరూ కిందపడి తీవ్ర రక్తగాయాలపాలయ్యారు. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ కుమార్ స్పందించి బాధితులను తన కారులోనే గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే, తలకు తీవ్ర గాయం కావడంతో చికిత్స పొందుతూ రాయపోషం రాత్రి 8 గంటల సమయంలో మృతి చెందారు. మృతుని భార్య ఇందారపు సమ్మక్క ఇచ్చిన ఫిర్యాదు మేరకు గోదావరిఖని వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు.

# ఏప్రిల్ 14న దేశవ్యాప్తంగా ప్రభుత్వ కార్యలయాలకు సెలవు...

**జగిత్యాల, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా, ఏప్రిల్ 14 (మంగళవారం) నాడు దేశవ్యాప్తంగా అన్ని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, బ్యాంకులకు సెలవు ప్రకటించారు..కేంద్ర ప్రభుత్వంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ ఈ మేరకు అధికారిక సర్క్యులర్ జారీ చేసింది. ఈ నిర్ణయంతో దేశవ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు ఏప్రిల్ 14న మూసివేయబడనున్నాయి.

# 49వ డివిజన్ కార్పొరేటర్ ఎన్నం లక్ష్మి ప్రకాష్‌కు ఘన సత్కారం



**కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 11(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ నగర పాలక సంస్థ 49వ డివిజన్ కార్పొరేటర్‌గా గెలుపొందిన సీనియర్ బీసీ సంఘాల నాయకుడు ఎన్నం లక్ష్మి ప్రకాష్ ని రజక సంఘం జిల్లా అధ్యక్షుడు రాచకొండ నరేష్, దిక్సూచి స్వచ్ఛంద సంస్థ చైర్మన్ బిజిగిరి నవీన్ కుమార్ కలిసి శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,ఎన్నం ప్రకాష్ బీసీ సంఘాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్నారని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునే విధంగా ఆయన సేవలు కొనసాగించాలని ఆకాంక్షించారు. ప్రజల విశ్వాసంతో విజయం సాధించిన ఎన్నం లక్ష్మి ప్రకాష్ డివిజన్ అభివృద్ధి కోసం కృషి చేసి ప్రజల ఆశయాలను నెరవేర్చాలని ఆకాంక్షించారు. అలాగే ఆయన సామాజిక సేవలో మరింత ముందుకు సాగాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో రేకుర్తి రజక సంఘం అధ్యక్షుడు గంగిపల్లి నారాయణ, కోశాధికారి గంగిపల్లి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# సెంటనరీకాలనీలో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

**- రాజాపూర్ సర్పంచ్ ఆధ్వర్యంలో మంత్రి శ్రీధర్ బాబును కలిసిన గ్రామస్తులు - సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లిన సర్పంచ్ - సానుకూలంగా స్పందించి వెంటనే కలెక్టర్‌కు ఫోన్ చేసిన మంత్రి - మంత్రి శ్రీధర్ బాబుకు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపిన సర్పంచ్, గ్రామస్తులు**



**రామగిరి, ఏప్రిల్ 11(ది క్రైమ్ న్యూస్):-** సింగరేణి ఓసీ-టు విస్తరణలో భాగంగా రాజాపూర్ గ్రామాన్ని త్వరలో సేకరించి తరలించనున్న నేపథ్యంలో సెంటనరీకాలనీలో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రాజాపూర్ గ్రామ సర్పంచ్ పుల్లెల భాగ్యలక్ష్మి-కొమురయ్య ఆధ్వర్యంలో గ్రామ కమిటీ, గ్రామస్తులు శనివారం సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పుల్లెల భాగ్యలక్ష్మి కొమురయ్య గ్రామంలో నెలకొన్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సర్పంచ్ మాట్లాడుతూ సింగరేణి ఓసీ-టు విస్తరణలో భాగంగా రాజాపూర్ గ్రామాన్ని సింగరేణి సేకరిస్తున్న విషయం విదితమే. త్వరలో గ్రామాన్ని సేకరించి తరలించనున్న నేపథ్యంలో సెంటనరీకాలనీలో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామంలో ఎంతోకాలంగా నివసిస్తున్న వారి ఇండ్లకు సైతం అధికారులు పర్మినెంట్ నెంబర్ కేటాయించకుండా టెంపరరీ నెంబర్ కేటాయించారని, కావున అర్హులందరికి పర్మినెంట్ నెంబర్లను కేటాయించాలని వెల్లడించారు. గ్రామంలో ఎస్సారెస్పీ కెనాల్ కు ఆనుకుని ఉన్న ఇండ్లకి సైతం పరిహారం చెల్లించాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అంతేకాకుండా గ్రామంలోని సింగరేణి సేకరించే భూమి కాకుండా మిగతా భూమికి పట్టాలు ఇప్పించాల్సిందిగా విన్నవించారు. సానుకూలంగా స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు వెంటనే జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష కు ఫోన్ చేసి రాజాపూర్ గ్రామస్తులకు సెంటినరీ కాలనీలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని, మిగతా సమస్యలను త్వరితగతిన కూడా పరిష్కరించాలని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు కు, ఇందుకు సహకరించిన మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్ కు రాజాపూర్ గ్రామ సర్పంచ్ పుల్లెల భాగ్యలక్ష్మి కొమురయ్య, గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు.

# విశ్వజ



## బ్రేక్‌ఫాస్ట్‌ను బ్రేక్ చేస్తున్నారా?


ఉదయం బ్రేక్‌ఫాస్ట్ మిస్ చేస్తున్నారా? అయితే, మీ మానసిక ఆరోగ్యం దెబ్బతినే అవకాశం ఉన్నదట. 'అల్పాహారం–మానసిక ఆరోగ్యం'పై చేసిన ఓ సర్వే.. ఈ విషయాలను వెల్లడిస్తున్నది. 'హాంకాంగ్ యూత్ ఎపిడెమియోలాజికల్ స్టడీ ఆఫ్ మెంటల్ హెల్త్' పరిశోధకులు ఓ అధ్యయనం నిర్వహించారు. ఇందుకోసం 15 నుంచి 24 ఏళ్ల వయసుగల 3,154 మందిని ఎంపిక చేశారు. వీరి రోజూవారి ఆహార అలవాట్లను పరిశీలించారు. ప్రతిరోజూ ఉదయం ఏదో ఒకటి తిన్నవారితో పోలిస్తే.. అల్పాహారం దాటవేసినవారు ఎక్కువ ఉద్రేకంతో, ఆందోళనతో, నిరాశతో కనిపించినట్లు పరిశోధకులు గుర్తించారు. అధ్యయనంలో పాల్గొన్న వారిలో 85% మంది ప్రతిరోజూ లేదా అడపాదడపా ఏదో ఒక అల్పాహారం తీసుకున్నారు. మిగిలిన 15% మంది బ్రేక్‌ఫాస్ట్‌ను పూర్తిగా దాటవేశారు. ఈ సందర్భంగా అల్పాహారం తీసుకోని వారిలో శ్రద్ధ తగ్గిపోవడం, స్వీయ నియంత్రణను కోల్పోవడం లాంటి సమస్యలను గుర్తించినట్లు అధ్యయనకారులు చెబుతున్నారు. ఇక అల్పాహారం దాటవేసేవారు తక్కువ ఉత్పాదకత కలిగి ఉన్నారని, పేలవమైన పనితీరును కనబర్చినట్లు గుర్తించారు. ఉద్యోగాలలోనూ తక్కువ సామర్థ్యం కలిగి ఉన్నారని నివేదించారు. బ్రేక్‌ఫాస్ట్‌ను దాటవేయడం వల్ల మధ్యాహ్నం వరకే నిస్సత్తువ ఆవహిస్తుందనీ, దాంతో దేనిమీదా శ్రద్ధ పుట్టదని చెబుతున్నారు. అందుకే, ఏ రకమైన ఆహారం, ఎంత పరిమాణంలో తింటారనే విషయాలతో సంబంధం లేకుండా.. ఉదయంపూట ఏదో ఒకటి తినడం మంచిదని సలహా ఇస్తున్నారు. ఇక అల్పాహారం వల్ల మానసిక ఆరోగ్య ప్రయోజనాలతోపాటు శారీరక ప్రయోజనాలు కూడా ఉన్నాయి. బ్రేక్‌ఫాస్ట్ చేసిన తర్వాత.. మధ్యాహ్నంపూట తక్కువ కేలరీలు తీసుకుంటారు. దాంతో బరువు అదుపులో ఉంటుంది. రక్తంలోనూ చక్కెర స్థాయులు నియంత్రణలో ఉంటాయి.

## ఇల్లంటే ఓ ఎమోషన్!



కొందరికి ఇల్లు అంటే స్టేటస్ సింబల్‌గా భావిస్తారు. రిచ్‌గా కనిపించాలని అనుకుంటారు. నటి అదితి రావ్ హైదరీ మాత్రం ఇల్లంటే నాలుగు గోడల నిర్మాణం కాదనీ, ఓ ఎమోషన్ అని చెబుతున్నది. అభిరుచికి తగ్గట్టు, చిన్ననాటి జ్ఞాపకాలతో తన నివాసాన్ని ఓ అందమైన గూడుగా మార్చుకుందామె! 'నేను పనిచేసేది పొగడ్తల ప్రపంచంలో.. కానీ, నాకు నిజమైన కాంప్లిమెంట్ ఏంటో తెలుసా? ఎవరైనా నా ఇంటికి వచ్చినప్పుడు వాళ్లు చాలా కంఫర్ట్ ఫీల్ అవ్వాలి. వాళ్ల ఇల్లే అన్నట్టుగా భావించాలి! అదే నాకు ఎక్కువ సంతృప్తినిస్తుంది' అని చెప్పుకొచ్చింది అదితి. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన ఇంటి గురించి చెబుతూ.. 'మీరు నమ్మరు!! చిన్నప్పుడు నాన్న నాకు ఒక అద్భుతమైన బొమ్మల ఇల్లు తయారు చేసిచ్చారు. అందులోనే బెడ్‌రూమ్‌లు, మంచాలు, చిన్న చిన్న మనుషుల బొమ్మలు, ఇంటి చుట్టూ లైట్లు, మెలికలు తిరిగిన మెట్లు ఇలా భలేగా ఉండేది. నేను ఈ ఇంటికి వచ్చినప్పుడు.. నా బొమ్మల ఇల్లే అనిపించింది' అని తన జ్ఞాపకాలను గుర్తుచేసుకుంది. 'నాకు వెంటిలేషన్ అంటే చాలా ఇష్టం. హాల్‌లో కిటికీ పక్కన కూర్చుని, అలా ఎక్కడికో చూస్తూ ఆలోచనల్లో ఉండిపోతాను. మా ఇల్లు కాస్త చిన్నదే! కానీ, చాలా సౌకర్యంగా ఉంటుంది. ముంబయి లాంటి నగరంలో చిన్న ఓపెన్ స్పేస్ ఉండటం ప్రత్యేకమే! మనం కోరుకున్న ఇంట్లో ఉన్నప్పుడు.. అనుకున్న డెస్టినీకి చేరుకున్న ఫీలింగ్ కలుగుతుంది. మనల్ని మనమే కొత్తగా కనుక్కున్నట్టు అనిపిస్తుంది. నావరకైతే ఇల్లంటే ఓ నిర్మాణం కాదు.. భావోద్వేగం' అని ఇంటితో ఉన్న బంధాన్ని పంచుకుంది అదితి.

# షుగర్ పేషెంట్స్ ఎంత సేపు నడవాలి





### - ఈ జాగ్రత్తలు తప్పనిసరి..!!

మధుమేహం. ఒక్క సారి వచ్చిందంటే జీవితాంతం జాగ్రత్తగా ఉండాల్సిందే. ప్రస్తుత కాలంలో మధు మేహ వ్యాధి గ్రస్తుల సంఖ్య పెరగటానికి అనేక కారణాలు ఉన్నాయి. సక్రమమైన జీవనశైలి, ఆహారపు అలవాట్లు పాటిస్తే డయాబెటిస్ ముప్పు తగ్గుతుందని నిపుణులు సూచిస్తున్నారు. అందు లో భాగంగా ముఖ్యంగా రోజూ వాకింగ్ చేస్తే డయాబెటిస్?తో బాధపడుతున్న వారికి ఎంతో మేలు జరుగుతుందని స్పష్టం చేస్తున్నారు. అయితే, మధుమేహం ఉన్న వారు ఎంత సేపు నడవాలి .. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే దాని పైన నిపుణులు కీలక సూచనలు చేస్తున్నారు. రక్తంలో షుగర్ లెవల్స్ అదుపులో ఉంచటం లో నడక సహకరిస్తుంది. డయాబెటిస్ బాధితులు రోజుకు కనీసం 30 నిమిషాలు నడిస్తే మంచిదని నిపుణులు చెబుతున్నారు. వారంలో 5 రోజులు, రోజుకి 30 నిమిషాలు వాకింగ్ చేస్తే మేలని పరిశోధనలు వెల్లడించాయి. అదే విధంగా క్రమం తప్ పకుండా ఏరోబిక్ వ్యాయామం చేయడం వల్ల రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు తగ్గుతాయని అధ్యయనం లో తేలింది. శరీరంలో ఒత్తిడిని పెంచే కార్టిసాల్ హార్మోన్ ఉత్పత్తి పెరిగితే రక్తంలో షుగర్ లెవల్స్ పెరుగుతాయి. యోగా, ధ్యానం, వ్యాయామం లాంటివి చేయాలని సూచిస్తున్నారు. ఎవరికైనా శారీరక శ్రమ అవసరమని, అందుకోసం క్రమం తప్పకుండా వాకింగ్ చేయాలని చెబుతున్నారు. ఫలితంగా రక్తంలో షుగర్ స్థాయిలు అదుపులో వస్తాయని వివరిస్తున్నారు. ఉదయం బ్రేక్ ఫాస్ట్ .. లంచ్.. డిన్నర్ తరువాత కనీసం పది నిమిషాలు నడిస్తే రక్తంలో షుగర్ లెవల్స్ అదుపులోకి వస్తాయని వెల్లడిస్తున్నారు. వాకింగ్ చేసేటప్పుడు గంటకు మూడు నుంచి నాలుగు మైళ్ల మితమైన వేగంతో నడిస్తే ఇన్సులిన్ స్థాయిలు పెరగడంతోపాటు గుండె సంబంధిత సమస్యలు అదుపులో ఉంటాయి. అయితే, వాకింగ్ వేళ పలు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. జాయింట్లపై ఒత్తిడి పడకుండా ఉండాలంటే సమాంతరంగా ఉన్న నేలపై నడక కొనసాగించాలని చెబుతున్నారు. ఆ తర్వాత మెట్లు ఎక్కడం, దిగడం చేయాలని తెలిపారు. వాతావరణం అనుకూలంగా ఉన్నప్పుడు ఉదయం లేదా సాయం త్రం వేళల్లో వాకింగ్?కు ప్రత్యేక సమయం కేటాయించుకోవాలి. వాకింగ్ చేయడం వల్ల రక్త ప్రసరణ పెరిగి చర్మానికి ఆక్సిజన్, పోషకాలు సరిగ్గా అందుతాయని నిపుణులు చెబుతున్నారు. ఫలితంగా ముఖంలో నీరసం పోయి సహజ కాంతితో ఉండేలా చేస్తుందని వెల్లడిస్తున్నారు.

# స్టీల్ డబ్బాల్లో వద్దు..



ప్లాస్టిక్ డబ్బాల వినియోగం ఆరోగ్యానికి హానికరం. అందుకే, ఆహార పదార్థాల నిల్వకోసం స్టీల్ పాత్రలనే ఎక్కువగా వాడుతున్నారు. కానీ, కొన్ని పదార్థాలు స్టీల్‌తో రసాయన చర్య జరుపుతాయని నిపుణులు చెబుతున్నారు. అలాంటి వాటిని స్టీల్ పాత్రల్లో స్టోర్ చేయొద్దని సూచిస్తున్నారు. టమాటాల్లోని సహజ ఆమ్లాలు.. ఉక్కుతో చర్య జరుపుతాయి. దాంతో, ఆహార పదార్థాల రుచితోపాటు పోషకాలు కూడా దెబ్బతింటాయి. కాబట్టి, టమాటా వంటకాలను స్టీల్ డబ్బాల్లో నిల్వ చేయకపోవడమే మంచిది. సిరామిక్ బౌల్, గాజు కంటెయినర్లు వాడుకోవచ్చు. అసిడిక్ లక్షణాలు ఉండే పచ్చళ్లను కూడా స్టీల్ డబ్బాలకు దూరంగా ఉంచాలి. మామిడి, నిమ్మ, ఉసిరి, చింతపండులో ఉండే ఆమ్ల లక్షణాలు.. దీర్ఘకాలంలో స్టీల్‌తో రసాయన చర్య జరుపుతాయి. ఫలితంగా పచ్చళ్ల రుచి మారడంతోపాటు ఓ రకమైన మెటాలిక్ టేస్ట్ కూడా వస్తుంది. పచ్చళ్లు కూడా త్వరగా పాడవుతాయి. అందుకే, పచ్చళ్లకు స్టీల్ డబ్బాల కన్నా.. గాజు పాత్రలు, సిరామిక్ జాడీలే మంచివి. ఇక కట్ చేసిన పండ్లు, ఫ్రూట్ సలాడ్ వంటివి కూడా.. స్టీల్ గిన్నెల్లో పెట్టడం మంచిది కాదట. వాటిని ఎక్కువ సమయంపాటు స్టీల్ కంటెయినర్లలో ఉంచితే.. నీటిశాతం పెరుగుతుంది. రుచి కూడా దెబ్బతింటుంది. బదులుగా.. గాజు పాత్రల్లో ఉంచితే ఫ్రెష్‌గా ఉంటాయి. సిట్రస్ జాతికి, స్టీల్‌కు పడనే పడదు. అందుకే, నిమ్మపండ్లతో చేసే లెమన్ రైస్, లెమన్ జ్యూస్ కూడా స్టీల్ డబ్బాల్లో స్టోర్ చేయొద్దు. మామిడికాయలు, చింతపండుతో తయారైన పదార్థాలను స్టీల్ డబ్బాలో నిల్వ చేసినా.. వాటి రుచి తగ్గుతుంది. ఇక పెరుగులోనూ సహజసిద్ధమైన ఆమ్ల లక్షణాలు ఉంటాయి. కాబట్టి, పెరుగును స్టీల్ డబ్బాల్లో ఎక్కువ సమయంపాటు పెడితే.. దాని రుచితోపాటు టెక్చర్ కూడా మారుతుంది. పెరుగును సిరామిక్, గాజు పాత్రల్లో నిల్వ చేయడమే ఉత్తమం.

# మార్కెట్

## సౌత్ ఇండియాలో ఆషాఢం సేల్స్


### ఆర్ఎస్ బ్రదర్స్‌లో ఆఫర్లే ఆఫర్లు

హైదరాబాద్ : కొనుగోలుదారులను ఆకట్టుకోవడంలో ఎప్పుడూ ఆర్ఎస్ బ్రదర్స్ ముందుంటుంది. ఆషాఢ మాసాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రకటించిన 'సూపర్ ఆషాఢం కేజీ సేల్' క్యాప్షన్‌తో ప్రకటించిన ప్రత్యేక ఆఫర్లకు కస్టమర్ల నుంచి భారీ స్పందన లభిస్తున్నది. అన్ని రకాల వస్త్రాలపై 70 శాతం వరకు తగ్గింపు ధరతో అందిస్తున్నది. సంస్థ అందిస్తున్న పలు ఆఫర్లు రూ.3,695 ధర కలిగిన అలంకారీ ప్రింట్ చీరను కొనుగోలు చేసిన వారికి రెండో చీరను రూ.39కే అందిస్తున్నది. అన్ని రకాల లేడీస్ వేర్, మెన్స్ వేర్, కిడ్స్ వేర్‌పై ఆకర్షణీయమైన ధరకే విక్రయిస్తున్నది. 22 క్యారెట్ కలిగిన బంగారు ఆభరణాల కొనుగోలుపై ప్రతీగ్రాముకి రూ.200 తగ్గింపునిస్తున్నది. పాత బంగారం ఎక్సేంజ్‌పై గ్రాముకు రూ.100 అదనంగా పొందవచ్చును. కేజీ వెండి వస్తువులపై రూ.5 వేల తగ్గింపునిస్తున్నది.




# టీసీఎస్‌లో భయం.. భయం..

### కొత్త పాలసీతో ఎంప్లాయీస్‌లో గుబులు
### ముగిసిన 35 రోజుల బెంచ్ పాలసీ డెడ్‌లైన్
### లేఆఫ్‌లు, డిమోషన్లపై పెరుగుతున్న ఆందోళన
### కేంద్రం జోక్యానికి ఉద్యోగ సంఘాల లేఖ



ఆడుతూ పాడుతూ పని, ఆకర్షణీయ వేతనాలు, విలాసవంతమైన జీవితం. ఇదీ.. ఐటీ రంగంలో కొలువుల తీరు. అయితే నిన్నమొన్నటిదాకా ఇలా ఉండచ్చేమోగానీ.. ఇప్పుడు మాత్రం సీన్ రివర్సైంది. కొరవడిన ఉద్యోగ భద్రత, జీతాల్లో కోతలు, ఒత్తిడితో కూడిన జీవనం. ఇదీ.. ఐటీ రంగ ఉద్యోగుల ప్రస్తుత పరిస్థితి. సాంకేతిక మార్పులు, పెరుగుతున్న పోటీ, పడిపోతున్న ఆదాయం ఇలా.. ఎన్నెన్నో అంశాలు ఐటీ కంపెనీలను ప్రభావితం చేస్తున్నాయి. ఈ క్రమంలోనే టీసీఎస్ ఓ కొత్త పాలసీని తీసుకొచ్చింది. ఇప్పుడిది అటు ఉద్యోగుల్లో, ఇటు పరిశ్రమలో హాట్ టాపిక్‌గా మారింది. న్యూఢిల్లీ దేశీయ ఐటీ రంగ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) తెచ్చిన కొత్త పాలసీ ప్రకంపనల్ని సృష్టిస్తున్నది. గత నెల జూన్ 12న అమల్లోకి వచ్చిన ఈ విధానంలో 35 రోజుల బెంచ్ పాలసీ డెడ్‌లైన్ తాజాగా ముగిసింది. దీంతో సంస్థ ఉద్యోగులకు గుబులు పట్టుకుంటున్నది. వేలాది ఉద్యోగులు తమ భవిష్యత్తుపై అనిశ్చితిని చూడాల్సి వస్తున్నది మరి. కిందిస్థాయి నుంచి పైస్థాయి వరకు అన్ని విభాగాల్లో పనిచేసే ఉద్యోగులకు ఈ పాలసీ వర్తిస్తుండటం గమనార్హం. ఏమిటీ కొత్త పాలసీ? ఏ ప్రాజెక్టులో భాగస్వామి కాకుండా ఏడాదిలో గరిష్ఠంగా 35 రోజుల కంటే ఎక్కువ రోజులు సంస్థలో పనిచేసే ఏ ఉద్యోగీ ఉండరాదు. అలా ఉన్నైట్లైతే వారి ఉద్యోగం రిస్క్‌లో పడ్డట్టే. ఫ్రెషర్లైతే ఉద్యోగాల్ని కోల్పోయే ప్రమాదం ఉంది. అలాగే పైస్థాయి ఉద్యోగులైతే కిందిస్థాయికి దిగజారే వీలున్నది. సీనియర్ ఉద్యోగులకు పదోన్నతులు దక్కకపోవచ్చు. వేతనాలు, ఇతర అలవెన్సుల్లో కోతలుపడే అవకాశాలూ లేకపోలేదు. ఇక ఏడాది కాలవ్యవధిలో ప్రతీ ఉద్యోగి నేరుగా క్లైయింట్ లేదా ప్రాజెక్టుతో కనీసం 225 రోజులు తప్పక పనిచేయాల్సి ఉంటుంది. మిగతా సమయాన్ని ఇంటర్నల్ టాస్క్‌లు, శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, ఏఐ–క్లౌడ్ టెక్నాలజీ వంటి కొత్త సాంకేతికతల్ని అందిపుచ్చుకోవడం, ఇతర కార్యకలాపాల కోసం వెచ్చించవచ్చు. ఉద్యోగులేమంటున్నారు? కొత్త పాలసీతో తాము విపరీతమైన ఒత్తిడిలోకి వెళ్లిపోతున్నామని టీసీఎస్ ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 'వినియోగం ఆధారంగా ఉద్యోగుల్ని హేతుబద్ధీకరించడం ఇదే తొలిసారి. ఉద్యోగాల తొలగింపునకే ఇది దారితీయగలదు' అని సోషల్ మీడియా వేదిక రెడిట్‌లో ఓ టీసీఎస్ ఉద్యోగి పేర్కొన్నారు. అలాగే 'టీసీఎస్‌లో నేను ఇటీవలే చేరాను. జావాలో శిక్షణ పొందుతున్నాను. కానీ నెల రోజులు కూడా కాకముందే అందుకు భిన్నం గా సపోర్టింగ్ ప్రాజెక్టులో చేరాలన్న ఒత్తిళ్లు వస్తున్నాయి' అని మరో ఉద్యోగి చెప్తున్నారు.



## వేగంగా ఆర్ఎంయూ పనులు

### 2026 మార్చిలో రైల్వే బోగీల యూనిట్ ప్రారంభం

కాజీపేట : కాజీపేట రైల్వే జంక్షన్ పరిధిలో నిర్మిస్తున్న రైల్వే మల్టీ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ (ఆర్ఎంయూ) పనులు వేగంగా జరుగుతున్నాయని, వచ్చే మార్చి నాటికి ప్రారంభించాలనుకుంటున్నట్టు దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ వెల్లడించారు. జీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా ఆయన కాజీపేటకు వచ్చారు. ఈ పర్యటనలో భాగంగా రైల్వే సర్క్యులేటింగ్ ఏరియా, అమృత్ భారత్ పథకం పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. అయోధ్యపురం శివారులో నిర్మిస్తున్న ఈ యూనిట్‌ను సందర్శించి సంబంధిత అధికారులతో పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. షెడ్డులో నిర్మాణ పనులను పరిశీలించి, వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ నిర్మాణ పనులు ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తవుతాయని, వెంటనే ట్రయల్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. 160 ఎకరాల స్థలంలో రూ.716 కోట్లతో నిర్మిస్తున్న ఈ యూనిట్‌లో తొలి ఏడాది 600 బోగీలు, ఆ తర్వాత ఏడాదిలో 2,400 బోగీలు తయారుకానున్నాయి.

# ఆంధ్రప్రదేశ్

## బ్రోకర్ దందాలో బెదిరింపులు

### వీడియోలు తీసి భారీగా వసూళ్లు మాచర్ల ఉఎస్ఐ సస్పెన్షన్

పల్నాడు ,ఏప్రిల్11 : పోలీసులంటే సమాజానికి రక్షణగా నిలవడంతో పాటు, ఎలాంటి సందర్భం ఎదురైనా ప్రజలకు తామున్నామంటూ రక్షణగా నిలుస్తుంటారు. అలాంటి పోలీసులే గాడి తప్పితే సమాజం ఏమవుతుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. తాజాగా అలాంటి పనే చేసిన ఓ పోలీసు.. ఆ వృత్తికే కళంకంగా మారాడు. విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో చివరికి సస్పెషన్‌కు గురయ్యాడు. అతను చేసిన పని చూసి డిపార్ట్‌మెంట్ మొత్తం ముక్కున వేలేసుకుంటోంది. మాచర్ల ఏఎస్సై శ్రీనివాసరావుపై సస్పెషన్ వేటు పడింది. విద్యార్థినిలు, మహిళలను వేధిస్తుండడంతో ఉన్నతాధికారులు అతనిపై చర్యలు తీసుకున్నారు. నియోజకవర్గంలో పర్యాటక ప్రదేశాలకు వెళ్లే విద్యార్థినిలు, మహిళలను ఏఎస్సై శ్రీనివాసరావు టార్గెట్ చేశాడు. . ప్రేమ జంటల వీడియోలు తీసి బెదిరింపులకు దిగేవాడు. అడిగినంత డబ్బు ఇవ్వాలని, ఆపై తన కోరిక తీర్చాలని బెదిరించేవాడు. తాను చెప్పినట్లు వినకపోతే వీడియోలను సోషల్ మీడియాలో పోస్టు చేస్తానంటూ హెచ్చరించేవాడు. మాచర్ల మండలానికి చెందిన ఓ ఆటో డ్రైవర్ కూడా ఏఎస్సైకు సహకరించాడు. వీడియోలు తీసి శ్రీనివాసరావుకు పంపేవాడు. వీరిద్దరూ కలిసి ఈ దందా మొదలు పెట్టారు. ఇటీవల స్థానిక వ్యాపారి ఒకరు ఓ మహిళతో వెళ్లారు. వారిద్దరు సన్నిహితంగా ఉన్న వీడియోలను తీసి నగదు వసూలు చేశారు. పర్యాటక ప్రాంతాలకు వెళ్లే వారి సంఖ్య అధికంగా ఉండడం, అతని ఆగడాలు పెరిగిపోవడంతో పాపం పండింది. ఏఎస్సై వీడియోలు సోషల్ మీడియాలో లీక్ కావడంతో వారి దందా వెలుగులోకి వచ్చింది. ఈ విషయం కాస్తా ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. దీంతో విచారణ చేపట్టి ఏఎస్సై శ్రీనివాసరావును విధుల నుంచి తొలగించారు.

## నాదెండ్ల భాస్కర రావు క్షేమం

### ఆయన ఆరోగ్యంపై పుకార్లు వద్దు

### మంత్రి మనోహర్ కార్యాలయం ప్రకటన

అమరావతి,ఏప్రిల్11 : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్‌రావు ఆరోగ్యంగానే ఉన్నట్లు ఆయన కుమారుడు, ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. భాస్కర్ రావు ఆరోగ్యం సరిగా లేదని, ఆస్పత్రిలో ఉన్నారంటూ ప్రసారమాధ్యమాల్లో వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని పేర్కొంది. దయచేసి అలాంటి వార్తలు ప్రసారం చేయొద్దని కోరింది. అయితే మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర రావు ఆరోగ్య పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు వార్తలు వచ్చాయి. వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆయన ప్రస్తుతం హైదరాబాద్‌లోని కాంటినెంటల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గత 10 రోజులుగా ఆసుపత్రిలోనే మాజీ సీఎం ఉన్నారు. వృద్ధాప్య సంబంధిత సమస్యలు తీవ్రమవడంతో వైద్యులు ఆయన్ను ఐసీయూలో ఉంచి పర్యవేక్షిస్తున్నారు. మల్టిపుల్ ఆర్గాన్స్ దెబ్బతినడం, డయాలసిస్ కారణంగా ఆయన ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం వచ్చింది. అయితే ఇదంతా అబద్ధమని ప్రకటన విడుదల చేశారు.

## మా వద్ద నాణ్యమైన చమురు ఉంది

### కొనడానికి ముందుకు రండి: ట్రంప్ పిలుపు

వాషింగ్టన్,ఏప్రిల్11 : ఇరాన్‌తో శాంతి చర్చలకు ముందు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. రెండు అతిపెద్ద చమురు ఆర్థిక వ్యవస్థలైన రష్యా, సౌదీ అరేబియా కంటే తమ వద్దే ఎక్కువ చమురు ఉందన్నారు. ప్రపంచంలోనే అత్యంత నాణ్యత కలిగిన చమురు, గ్యాస్‌ను నింపుకోవడానికి ప్రపంచ దేశాలకు చెందిన అనేక ఖాళీ చమురు ట్యాంకర్లు అమెరికా తీరం వైపు వస్తున్నాయని పేర్కొన్నారు. 'మేము మీకోసం ఎదురు చూస్తున్నాం.. త్వరితగతిన స్పందించండి' అంటూ ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చారు. ప్రపంచంలో ఎక్కడికైనా చమురు ఎగుమతి చేసేందుకు అమెరికా సిద్ధంగా ఉందన్నారు. మరికొన్ని గంటల్లో ఇరుదేశాల మధ్య చర్చలు ప్రారంభమవ్వనున్న నేపథ్యంలో ఇరాన్ అమెరికాకు పలు షరతులు విధిస్తుండడంతో కాల్పుల విరమణ ప్రయత్నాలు ఆలస్యమవుతున్నాయి. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ బృందం పాకిస్థాన్‌కు వచ్చి నాలుగు గంటలకు పైగా అయినప్పటికీ, ఇరాన్ ప్రతినిధులతో ఇంకా ప్రత్యక్ష చర్చలు జరపలేదు. పాకిస్థాన్ ప్రధాని షరీఫ్ ఇప్పటికే వాన్స్‌తో సమావేశమయ్యారు. ప్రస్తుతం ఇరాన్ అధికారుల బృందం పాక్ అధికారులతో చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. లెబనాన్‌లో కాల్పుల విరమణ, స్తంభింపజేసిన ఇరాన్ నిధుల విడుదల అనే రెండు షరతులను ఇరాన్ అమెరికా ముందు ఉంచింది. అవి అమలైతేనే చర్చలు జరుగుతాయని స్పష్టం చేసింది.

## హైవేపై నిలిపిన వాహనాలే టార్గెట్

### డీజిల్ దొంగల ముఠాను అరెస్ట్ చేసిన పోలీసులు

నల్గొండ : రోడ్డుపక్కన నిలిపి ఉంచిన వాహనాల్లో డీజిల్ దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. ఆరుగురు అంతరాష్ట్ర దొంగల ముఠాను నల్గొండ పోలీసులు పట్టుకున్నారు. నిందితులలో ఓ మైనర్ కూడా ఉన్నాడు. ఆ ముఠా నుంచి 1000 లీటర్ల డీజిల్ సహా.. రెండు డీసీఎం వాహనాలు, 6 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై తెలుగు రాష్ట్రాల్లో 20కి పైగా డీజిల్ దొంగతనాల కేసులు ఉన్నట్లు జిల్లా అదనపు ఎస్పీ జి.రమేష్ వెల్లడించారు. హైవేలపై ఆగి ఉన్న వాహనాలే లక్ష్యంగా అర్ధరాత్రి డీజిల్ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. నల్లగొండ పోలీసులు అరెస్ట్ చేశారు. జిల్లా అదనపు ఎస్పీ జి. రమేష్ శనివారం మీడియా సమావేశంలో ఈ ముఠాకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. చాలా కాలంగా తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన రహదారుల పక్కన నిలిపి ఉంచిన లారీలు, ఇతర భారీ వాహనాల ట్యాంకుల నుండి డీజిల్ దొంగలిస్తున్నట్లు పోలీసులకు ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ క్రమంలో నిఘా పెంచిన పోలీసులు ఆరుగురు సభ్యుల ముఠాను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ఒకరు మైనర్ కావడం గమనార్హం. అదుపులోకి తీసుకున్న నిందితుల వద్ద నుంచి సుమారు రూ. 40 లక్షల విలువైన ఆస్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 1000 లీటర్ల డీజిల్, రెండు డీసీఎం వాహనాలు, 6 మొబైల్ ఫోన్లు, దొంగతనానికి వాడే ఇతర పనిముట్లు ఉన్నాయి. ఈ ముఠా సభ్యులపై గతంలోనే 20కి పైగా కేసులు నమోదై ఉన్నట్లు అదనపు ఎస్పీ తెలిపారు. ఈ ముఠా అర్ధరాత్రి సమయాల్లో హైవేల వెంట ఆగి ఉన్న వాహనాలను గమనించి, డ్రైవర్లు నిద్రపోతున్న తరుణంలో అత్యంత వేగంగా డీజిల్ ట్యాంకుల సీల్ తొలగించి డీజిల్‌ను తమ వాహనాల్లోకి తరలించేవారు.

## క్రీడాకారుల ప్రతిభకు ప్రోత్సహం అవసరం..

### అంతర్జాతీయ క్రీడాకారులుగా రానించాలి..

### కృష్ణా నదీ తీరంలో వాటర్ స్పోర్ట్స్‌కు ఊపు..

### జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ.



విజయవాడ,ఏప్రిల్11 : క్రీడాకారులు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సహకాన్ని అందిపుచ్చుకుని అంతర్జాతీయ క్రీడాకారులుగా రానించేందుకు కృషి చేయాలని వాటర్ స్పోర్ట్స్ యువతలో సరికొత్త ఉత్సాహాన్ని నింపుతుందని పర్యాటక రంగ అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అన్నారు. వాటర్ స్పోర్ట్స్‌లో యువతను ప్రోత్సహించేందుకు జిల్లా క్రీడా సంస్థ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో పున్నమి ఘాట్ వద్ద కృష్ణానదీలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న వాటర్ స్పోర్ట్స్ పోటీలను శనివారం జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కృష్ణానదీ తీర ప్రాంతంలో నిర్వహిస్తున్న వాటర్ స్పోర్ట్స్ యువక్రీడాకారులలో నూతన ఉత్సహాన్ని నింపడంతో పాటు పర్యాటకులకు వినోదాన్ని అందించడం అభిందనీయమన్నారు. వినోదంతో కూడిన సాహస క్రీడాలపై యువతలో అశక్తి పెంచేందుకు వాటర్ స్పోర్ట్స్ ఎంతో దోహదపడుతాయన్నారు. జెట్ స్కీయింగ్, బనానా రైడ్స్, కయాకింగ్ వంటి వాటర్ స్పోర్ట్స్‌లో పాల్గొనడంతో పాటు పోటీలను విక్షించేందుకు సందర్శకలు భారీగా తరలిరావడం శుభపరిణామమన్నారు. చిరువ్యాపారస్తులకు ఇది ఒక మంచి అవకాశంగా మారిందన్నారు. వాటర్ స్పోర్ట్స్ అభివృద్ధి జిల్లాలో పర్యాటక రంగానికి మరింత ఊతం ఇవ్వనుందని అయితే పర్యావరణ పరిరక్షణ, నదీ నీటి కాలుష్య నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్తులో మరిన్ని వాటర్ స్పోర్ట్స్ కార్యకలాపాలను ప్రవేశపెట్టి, ఈ ప్రాంతాన్ని ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. శాప్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి ఎస్. భరణి మాట్లాడుతూ క్రీడాకారులు అందుబాటులో ఉన్న అవకాశాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం నదీ తీర ప్రాంతాలలో జల క్రీడలు నిర్వహించేందుకు అవసరమైన మౌలిక వసతులను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. జల క్రీడలలో రాష్ట్రాన్ని జాతీయ అంతర్జాతీయ స్థాయిలో నిలిపేందుకు కృషి చేస్తున్నామన్నారు. పోటీలలో 275 మంది క్రీడాకారులు పాల్గొనడం జరిగిందని క్రీడా కోర్చులు మేనేజర్లు విజయవంతంగా పోటీలను నిర్వహించడంలో భాగస్వామం కావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కాకర్ల కోటేశ్వరరావు, కయాకింగ్ కనోయంగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బలరామ్‌నాయుడు, చైర్మన్ ప్రదీప్‌నాయుడు, జిల్లా అధ్యక్షుడు జగదీష్, కార్యదర్శి కనకరావు, రోయింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కాకాని తరుణ్, వివిధ జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు.

## మహాత్మా జ్యోతిరావు పూలే సిద్ధాంతాలు ఆదర్శప్రాయం..

### జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ

విజయవాడ,ఏప్రిల్11 : శ్రమ సమాజ స్థాపనకు అహర్నిశలు కృషి చేసిన సంఘ సంస్కర్త సామాజిక తత్వవేత్త మహాత్మా జ్యోతిరావు పూలే ఆచరించిన సిద్ధాంతాలు నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తాయని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం తుమ్మలపల్లి వారి కళాక్షేత్రంలో నిర్వహించిన మహాత్మా జ్యోతిరావు పూలే 200వ జయంతి వేడుకలను పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ జ్యోతిరావు పూలే కాంస్య విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక అసమానతలను రూపుమాపేందుకు సామాజిక ఉద్యమానికి అలుపెరగని పోరాటం చేశారన్నారు. జ్యోతిరావు పూలే భారతీయులంతా ఒకటే అని, సమాజంలో అసమానతలకు రూపు మాపి ప్రతి ఒక్కరూ సమానమే అనే భావనకు ఆద్యుడు జ్యోతిరావు పూలే అని అన్నారు. మానవుడికి విద్య జ్ఞాన జ్యోతిలాంటిదని మహాత్మ జ్యోతిరావు పూలే విశ్వసించేవారన్నారు. ఆయన సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ అచారించాల్సిన అవసరం ఉందన్నారు. 19వ శతాబ్దంలో ఫ్రెంచ్ ఉద్యమంలో పాల్గొని పేద బడుగు బలహీన వర్గాల కోసం అహర్నిసలు పోరాటం చేసిన వ్యక్తి జ్యోతిరావు పూలే అని అన్నారు. బడుగు, బలహీన వర్గాలలో ఆత్మస్థైర్యం కల్పించి వారి హక్కుల కోసం పోరాటం చేయడంతో పాటు సాదికారత దిశగా కృషి చేసిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని కలెక్టర్ అన్నారు. గాందీజీ కంటే ముందే మహాత్మా అని బిరుదు పొందడం ఆమన దార్శనీకతకు నిదర్శనం అన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిసలు కృషి చేసిన మహోన్నత వ్యక్తి జ్యోతిరావు పూలే సిద్ధాంతాలను ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అన్నారు.

## మహిళల ఆర్థిక స్వాలంభనకు స్వయం ఉపాధి కీలకం..

### మహిళలను పారిశ్రామిక వేత్తలను చేయాలన్నదే లక్ష్యం..

### జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

విజయవాడ,ఏప్రిల్11 : మహిళల ఆర్థిక స్వాలంభన సుస్థిర భవిష్యత్తుకు స్వయం ఉపాధి మార్గాలు కీలక పాత్ర వహిస్తాయని రైజ్ సెంటర్ ద్వారా మహిళలకు చేతి వృత్తులపై శిక్షణ ఉపాధి అవకాశాలపై వర్క్‌షాప్‌లను నిర్వహించి ప్రతి మహిళాలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిదేందుకు కృషి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.విజయవాడ రూరల్ మండలం గుంటుపల్లిలో ఏర్పాటు చేసిన రైజ్ శిక్షణ కేంద్రంలో సోలార్ ఫోటోవాల్‌టిక్ టెక్నిషన్ శిక్షణ పొందిన 28 మంది మహిళలకు టూల్ కిట్‌లు, సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం 50 మంది మహిళలకు తేనేటీగల పెంపకం పై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైజ్ సెంటర్ ద్వారా మహిళలు నేర్చుకున్న నైపుణ్యాలను ఉపాధిగా మార్చుకుని ఆర్థిక పురోగతి సాధించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న శిక్షణ, సహాయక కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు అడుగులు వేయాలన్నారు. మహిళలు పొందుతున్న శిక్షణను కేవలం నేర్చుకోవడానికే పరిమితం కాకుండా, ఆచరణలోకి తీసుకువచ్చి ఆదాయ మార్గాలుగా మార్చుకోవాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల ద్వారా బ్యాంకు రుణాలు, ప్రభుత్వ ప్రోత్సాహక పథకాలను వినియోగించుకుని పారిశ్రామిక, వ్యాపార యూనిట్లు ప్రారంభించాలన్నారు. మహిళలకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ద్వారా స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు కృషిచేస్తున్న వాసవ్య మహిళా మండలి గోకుల్ ఎంటర్ ప్రైజెస్ సంస్థల ప్రతినిధులను అభినందిస్తున్నానన్నారు, మహిళలకు ఫ్యాబ్రిక్ పెయింటింగ్ ట్యాంజోర్ పెయింటింగ్ శిక్షణ ఇచ్చేందుకు ముందుకు వచ్చిన శ్రీమతి ప్రతిభను ప్రత్యేకంగా దార్శినీకత ఆదర్శప్రాయంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, వాసవ్య మహిళా మండలి అధ్యక్షురాలు శ్రీమతి కీర్తి, డైరెక్టర్ శ్రీమతి వడ్డీ సంతోషిలక్ష్మీ, మహేష్, శ్రీమతి ప్రతిభ, తదితరులు పాల్గొన్నారు.

## విజయ్ 'జననాయగన్' లీక్‌తో బిజెపికేం సంబంధం

### కేంద్రమంత్రి మురుగన్‌పై ఆరోపణలు సరికాదు

### నేనూ విజయ్ అభిమానినే అన్న అన్నామలై

కోయంబత్తూరు,ఏప్రిల్11 : సెన్సార్ బోర్డు సమస్యలతో విడుదలలో జాప్యమైన విజయ్ 'జననాయగన్' సినిమా ఇప్పుడు థియేటర్‌కు రాకుండానే ఇంటర్‌నెట్‌లో లీక్ కావడం హాట్‌టాపిక్ అయింది. దీనిపై దక్షిణాది పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు సోషల్ మీడియాలో ఘాటుగా స్పందించారు. దీనికి తాజాగా రాజకీయ రంగు కూడా పులుముకుంటోంది. ఈ చిత్రం ఆన్‌లైన్‌లో లీక్ కావడం వెనుక కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ పాత్ర ఉందంటూ టీవీకే ఆరోపణలు చేసింది. అయితే ఈ రోపణలను తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షుడు కె.అన్నామలై వెంటనే ఖండించారు. ఇవి రాజకీయ దిగజారుడు ఆరోపణలుగా కొట్టివేశారు. 'జననాయగన్' సినిమా లీక్ కావడం చట్టవిరుద్ధమైన చర్య అని, ఈ చిత్రం పైరేటెడ్ వెర్షన్‌కు ప్రజలు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. కోయంబత్తూరులో పార్టీ అభ్యర్థి తరపు ప్రచారం సాగిస్తున్న అన్నామలై శనివారంనాడిక్కడ మీడియాతో మాట్లాడుతూ, ఈ వివాదంలోకి బీజేపీని ఎందుకు లాగుతున్నారని ప్రశ్నించారు. సినిమాల విడుదల, లీక్ వ్యవహారాల్లో పార్టీకి ఎలా ప్రమేయం ఉంటుందని నిలదీశారు. వదంతులు వ్యాప్తి చేస్తున్న వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. స్వార్థ ప్రయోజనాల కోసం బీజేపీని ఇందులోకి లాగడం సరికాదని చెప్పారు. కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రిగా ఉన్న మురుగన్ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ)పై తన పరపతిని ఉపయోగించి సినిమాను లీక్ చేయించారని ఈనెల 10న టీవీకే నేత ఆధవ్ అర్జున ఆరోపించారు. థియేటర్‌లో విడుదలకు ముందే ఆన్‌లైన్‌లో సినిమా లీక్ అయ్యేందుకు ఆయన ఉదయనిధి స్టాలిన్ సహకారం తీసుకున్నారని అన్నారు. దీనిపై అన్నామలై స్పందిస్తూ, టీవీకే మద్దతుదారులు, నేతలు కొందరు వ్యక్తం చేస్తున్న అభిప్రాయాలను తాను తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు. సీబీఎఫ్‌సీని బీజేపీ కంట్రోల్ చేయదని, సినిమా ప్రొడక్షన్ విషయంలో కానీ, విడుదల విషయంలో కానీ బీజేపీ ప్రమేయం లేదని స్పష్టంచేశారు. విజయ్ అభిమానులలో తాను కూడా ఉన్నానని, అధికారికంగా సినిమా విడుదల కాగానే థియేటర్‌కు వెళ్లి సినిమా చూస్తానని అన్నామలై చెప్పారు. ఒక సినిమా వెనుక ఎంతోమంది కష్టం, ప్రొడక్షన్ కంపెనీల పెట్టుబడులు వంటివి ఎన్నో ఉంటాయని, ప్రజలు ఆన్‌లైన్‌లో లీక్ అయిన వీడియోలను చూడకుండా వాటికి దూరంగా ఉండాలని కోరారు.

## బాలిక హత్యపై చంద్రబాబు సీరియస్

### ఉన్మాదులను వదిలిపెట్టేది లేదని హెచ్చరిక

అమరావతి : కడప జిల్లాలో జరిగిన దారుణ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు, బాలికలపై దాడులకు తెగబడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇలాంటి విషయాల్లో నిందితులను ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించరాదన్నారు. ఖాజీపేట ప్రాంతంలో బాలికపై జరిగిన అమానుష దాడి, హత్య ఘటనపై సీఎం సీరియస్ అయ్యారు. నిందితుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖ, సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ఆడబిడ్డల భద్రత విషయం రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. బాధితురాలి కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు.కడప జిల్లా ఖాజీపేటలో రామకీర్తనను(17) వెంకటేశ్ అనే వ్యక్తి దారుణంగా హత్య చేశాడు. కొంత కాలంగా ప్రేమించాలంటూ బాలికను వేధింపులకు గురిచేశాడు వెంకటేష్. అందుకు బాలిక నిరాకరించడంతో కోపంతో ఊగిపోయిన ప్రేమోన్మాది.. శుక్రవారం బాలిక ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో ఆమె ఒంటిరిగా ఉంది. దీంతో తనను ప్రేమించాలని బలవంతం చేశాడు వెంకటేష్. అందుకు కీర్తన నిరాకరించడంతో తన వెంట తెచ్చుకున్న కత్తితో బాలిక గొంతు కోశాడు ఉన్మాది. పొలం పనులకు వెళ్లిన తల్లిదండ్రులు తిరిగి వచ్చి చూడగా కూతురు రక్తపుమడుగులో పడి ఉంది. దీంతో హుటాహుటిన ఆమెను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో బాలిక చనిపోయింది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

## 200కు పైగా సీట్లలో గెలుస్తున్నాం

### ద్రవిడియన్ మోడల్ 2.0 ప్రభుత్వ ఏర్పాటు

### ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ధీమా

చెన్నై,ఏప్రిల్11 : తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే సారథ్యంలోని సెక్యులర్ ప్రొగ్రెసివ్ అలయెన్స్ 200కు పైగా సీట్లు గెలుచుకుంటుందని ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తెలిపారు. అన్నాడీఎంకే ఎలాంటి సిద్ధాంతాలు లేకుండా ఢిల్లీలోని బీజేపీకి మరబొమ్మలా మారిందని అన్నారు. తమ ఐదేళ్ల ద్రవిడియన్ తరహా పాలనలో లెక్కలేనన్ని సంక్షేమ పథకాలు అమలు చేశామని, కలైంజ్ఞర్ మహిళా సాధికారతా పథకం కింద నెలకు రూ.1000 ఆర్థిక సాయం, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, పాఠశాల పిల్లలకు బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్, రెండు లక్షల మంది రైతులకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు ఇచ్చామని చెప్పారు. 'ప్రజలకు మా పార్టీ పట్ల అపారమైన ప్రేమ, నమ్మకం ఉన్నాయి. సెక్యులర్ ప్రొగ్రెసివ్ అలయెన్స్ 200కు పైగా సీట్లలో గెలిచి ద్రవిడియన్ మోడల్ 2.0 ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది' అని స్టాలిన్ తెలిపారు. కాంగ్రెస్‌తో సీట్ల పంపకాల వ్యవహారంలో ఈసారి సంక్లిష్టంగా మారడంపై అడిగినప్పుడు, సీట్ల కేటాయింపు విషయంలో అలాంటివి మామూలేనని, అయితే చర్చలు సుహృద్భావ వాతావరణంలో ముగిసాయని చెప్పారు. కూటమిలోని నేతలు, కార్యకర్తలు సమష్టిగా అభ్యర్థుల విజయానికి కృషి చేస్తున్నారని చెప్పారు. 2019 నుంచి తమ కూటమి మరింత బలపడిందని, మరిన్ని పార్టీలు వచ్చి చేరాయని చెప్పారు. తమిళనాడులోనే కాకుండా పుదుచ్చేరిలోనూ తమ కూటమి గెలుపు సాధిస్తుందని చెప్పారు. ఏప్రిల్ 9న పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసింది. ముఖ్యమంత్రి కుటుంబం పవర్ సెంటర్‌లా వ్యవహరిస్తోందంటూ అన్నాడీఎంకే చీఫ్ ఎడప్పాడి పళనిస్వామి ఆరోపణలను స్టాలిన్ కొట్టివేశారు. పళనిస్వామి కట్టుకథలపై తాను స్పందించాల్సిన పనిలేదని అన్నారు. రాష్ట్రంలో మహిళలపై నేరాలపై పళనిస్వామి చేస్తున్న ఆరోపణలను ప్రస్తావిస్తూ, పొల్లాచ్చి లైంగిక దాడుల ఘటన పళనిస్వామి సారథ్యంలోని అన్నాడీఎంకే అవకతవకల పాలనకు ఒక నిదర్శనమని, అప్పటి మహిళా ఐపీఎస్‌పై కూడా లైంగిక వేధింపులు జరిగాయని చెప్పారు. మహిళల భద్రతపై కానీ, శాంతిభద్రతలపై కానీ పళనిస్వామికి మాట్లాడే అర్హత ఎక్కడిదని ప్రశ్నించారు. తమిళనాడును గుట్కా గిడ్డంగిగా ఆయన మార్చారని, తాము అధికారంలోకి వచ్చాక కఠిన చర్యలు తీసుకుని గుట్కా సహా మాదకద్రవ్యాలను తుడిచిపెట్టామని, కఠిన చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఉద్యోగాలు చేసే మహిళల భద్రతకు హాస్టళ్లు ఏర్పాటు చేశామని, మహిళలపై నేరాలకు కఠిన చర్యలు అమలయ్యేలా సంబంధిత చట్టాలలో మార్పులు చేశామని స్టాలిన్ చెప్పారు. తమిళనాడులో వర్కింగ్ ఉమెన్స్ ఎక్కువనీ, వారి భద్రతకు తాము భరోసాగా ఉన్నామని తెలిపారు. మహిళల భద్రత విషయంలో దేశంలోనే తమిళనాడు నెంబర్ వన్ స్థానంలో ఉందని చెప్పారు.

## మహాత్మా జ్యోతిబా ఫులే 200వ జయంతి


### పార్లమెంట్ ప్రాంగణంలో రాహుల్‌తో మోడీ సంభాషణ

న్యూఢిల్లీ,ఏప్రిల్11 : మహాత్మా జ్యోతిబా ఫులే 200వ జయంతి సందర్భంగా పార్లమెంటు ప్రాంగణంలో శనివారంనాడు ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. ప్రేరణా స్థల్ వద్ద నివాళులు అర్పించేందుకు వచ్చిన ప్రధానమంత్రి మోదీ, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కొద్దిసేపు సంభాషించు కున్నారు. తొలుత ఈ కార్యక్రమానికి వచ్చిన ప్రధాని అక్కడే ఉన్న ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభలో బీజేపీ నేత జేపీనడ్డా, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ తదితరులను పలకరిస్తూ ముందుకు వెళ్లారు. మళ్లీ వెనక్కి వచ్చి రాహుల్‌గాంధీతో ప్రత్యేకంగా మాట్లాడారు. పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల వేళ ప్రధాన పార్టీల నేతలు ఒకరిపై ఒకరు విమర్శలు గుప్పించుకుంటున్న తరుణంలో ప్రధాని, ప్రతిపక్ష నేత పరస్పరం సంభాషించుకోవడం అందర్నీ ఆకట్టుకుంది. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు వైరల్ అవుతోంది. ఇటీవల కాలంలో పలు పబ్లిక్ స్పీచ్‌లు, రాజకీయ ర్యాలీల్లో మోదీ, రాహుల్ మధ్య విమర్శలు చోటుచేసుకున్నాయి. ఆయన ఏమి చేయాలో ఏమి చేయకూడదో ట్రంప్ నిర్దేశిస్తురటారని రాహుల్ విమర్శలు గుప్పించారు.




## ప్యారడైజ్ నుంచి కాయడు లోహర్ లుక్

నేచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న భారీ యాక్షన్ డ్రామా 'ది ప్యారడైజ్' నుంచి ఒక క్రేజీ అప్‌డేట్ వచ్చింది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్న కాయడు లోహర్ పుట్టినరోజు సందర్భంగా చిత్ర బృందం ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. ఈ పోస్టర్‌లో కాయడు రెట్రో లుక్‌లో అలరిస్తుంది. ఇక 'దసరా' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత నాని శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా కావడంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రానికి రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా.. ÷ూఒ÷ఎ సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్నారు. సికింద్రాబాద్ స్లమ్ ఏరియా నేపథ్యంలో పీరియడ్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమా తెరకెక్కుతోంది. ఇందులో నాని 'జడల్' అనే ఊర మాస్ పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రం ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సినిమాలో మోహన్ బాబు, రాఘవ్ జుయల్, సోనాలి కులకర్ణి వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన 'రా స్టేట్‌మెంట్' గ్లింప్స్ సినిమాపై భారీ అంచనాలను పెంచింది.




## స్వయంభు టీజర్‌కు భారీ స్పందన

టాలీవుడ్ యంగ్ హీరో నిఖిల్ సిద్దార్థ్ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'స్వయంభూ'. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన రాగా, ఇప్పుడు ఈ చిత్రం మ్యూజికల్ ప్రయాణాన్ని ప్రారంభించేందుకు సిద్ధమైంది. ఈ సినిమాలోని మొదటి పాట 'రా రా ధీవర' ఏప్రిల్ 16న విడుదల కాబోతున్నట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఒక యోధుడి స్ఫూర్తిని చాటిచెప్పే విధంగా సాగే ఈ గీతం ప్రేక్షకులను ఆకట్టుకోనుందని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో పిక్సెల్ స్టూడియోస్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో నిఖిల్ సరసన సంయుక్త మీనన్, నభా నటేష్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. కేజీఎఫ్ ఫేమ్ రవి బస్రూర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఈ వేసవిలో 'స్వయంభూ' వెండితెరపై భారీ స్థాయిలో సందడి చేయనుంది.

## ఉజ్జయిని మహాకాళేశ్వరుడిని దర్శించుకున్న సారా అర్జున్


బాలీవుడ్ నటి, 'ధురంధర్' ఫేమ్ సారా అర్జున్ శనివారం మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని శ్రీ మహాకాళేశ్వరుడిని దర్శించుకున్నారు. ఉదయం ఉజ్జయిని మహాకాళేశ్వరుడి ఆలయానికి చేరుకున్న ఆమెకి ఆలయ సిబ్బంది ఘనస్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఇక సారా మహాకాళేశ్వరుడిని దర్శించుకోవడంతో పాటు స్వామివారికి అత్యంత ప్రీతిపాత్రమైన భస్మ హారతి సేవలో పాల్గొంది. ఈ పవిత్ర ఆధ్యాత్మిక యాత్ర ముగించుకున్న అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. తనకు మాటలు రావడం లేదని, స్వామివారి పిలుపు రావడం వల్లే తాను ఇక్కడికి రాగలిగానని తెలిపారు. ప్రపంచంలో దీనిని మించిన గొప్ప అనుభూతి మరొకటి లేదని, ఈ పర్యటన తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని ఆమె భావోద్వేగానికి లోనయ్యారు. కాగా ఇందుకు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి. మహాకాళేశ్వర ఆలయంలో జరిగే క్రతువుల్లో భస్మ హారతికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. ప్రతిరోజూ తెల్లవారుజామున 3:30 నుండి 5:30 గంటల మధ్య బ్రహ్మ ముహూర్తంలో ఈ పూజను నిర్వహిస్తారు. ఆలయ తలుపులు తీసిన వెంటనే స్వామివారికి పాలు, పెరుగు, నెయ్యి, చక్కెర, తేనెతో కూడిన పంచామృత అభిషేకం చేస్తారు. అనంతరం గంధం, ఇతర సుగంధ ద్రవ్యాలతో అలంకరించి, మంత్రోచ్చారణలు, శంఖ నాదాలు, డప్పు వాయిద్యాల మధ్య భస్మ హారతిని కన్నుల పండువగా జరుపుతారు. ఇక హిందూ ధర్మంలోని 12 జ్యోతిర్లింగాలలో ఉజ్జయిని మహాకాళేశ్వరుడు ఒకరిగా పూజలందుకుంటున్నారు. ఈ భస్మ హారతిని దర్శించుకుంటే కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. అందుకే దేశవిదేశాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో ఇక్కడికి తరలివస్తుంటారు.



## ఓటీటీలోకి యూత్ మూవీ

తమిళంలో ఘనవిజయం సాధించి, తెలుగులోనూ మంచి ఆదరణ పొందిన లేటెస్ట్ రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 'యూత్' ఇప్పుడు డిజిటల్ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్ ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను సొంతం చేసుకోగా ఈ చిత్రం ఏప్రిల్ 16, 2026 నుంచి స్ట్రీమింగ్ కానుంది. కెన్ కరుణాస్ ఈ చిత్రంలో కథనాయకుడిగా నటించడంతో పాటు దర్శకత్వం వహించగా.. అనీషా అనిల్ కుమార్, మీనాక్షి దినేష్, ప్రియాన్షీ యాదవ్, సూరజ్ వెంజరమూడు, దేవదర్శిని తదితరులు కీలక పాత్రల్లో నటించారు. మార్చి 19న తమిళంలో, మార్చి 27న తెలుగులో థియేటర్లలో విడుదలై బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లను సాధించింది ఈ చిత్రం. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. ఒక మధ్యతరగతి టీనేజర్ తన స్కూల్, కాలేజ్ రోజుల్లో ప్రేమ కోసం చేసే ప్రయత్నాలు, ఎదుర్కొన్న అవమానాలు మరియు బ్రేకప్స్ చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ఒక యువకుడు తన జీవిత ప్రయాణంలో ఎదురైన అనుభవాల నుండి ఎలా పరిణతి చెందాడు అనే అంశాన్ని దర్శకుడు వినోదాత్మకంగా, భావోద్వేగపూరితంగా తెరకెక్కించారు.



## నెట్‌ఫ్లిక్స్‌లోకి ఉస్తాద్ భగత్ సింగ్

పవన్ కల్యాణ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. హరీశ్ శంకర్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఓటీటీ విడుదల తేదీని ఫిక్స్ చేసుకుంది. ఏప్రిల్ 16 నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ కానుంది. గతంలో దీనికి సంబంధించి ఎన్నో వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వాటికి చెక్ పెడుతూ తాజాగా నెట్‌ఫ్లిక్స్ దీనిపై అధికారిక ప్రకటన విడుదల చేసింది. దేవిశ్రీ ప్రసాద్, తమన్ సంగీతం అందించిన ఈ సినిమాలో పవన్‌కు జోడీగా రాశీఖన్నా, శ్రీలీల నటించారు. నల్లమలకు సమీపంలో ఓ గూడెం అది. అక్కడికి పాఠాలు బోధించేందుకు చంద్రశేఖర్ రావు (కె.ఎస్.రవికుమార్) అనే మాస్టారు వస్తారు. అక్కడి జనం కోసం తన జీతాన్ని, జీవితాన్ని అంకితం చేస్తాడు. కూలి పనులకు వెళ్లే పిల్లలు మళ్లీ చదువుల కోసం బడి బాట పట్టేలా చేస్తారు. ఆ ఊళ్లోనే పుట్టి పెరిగి అనాథగా ఉన్న చిన్నయ్యని చేరదీసి అతనికి సంరక్షకుడిగా మారి చదువు చెప్పిస్తాడు. ఆ కుర్రాడి భావాలు, అతనిలోని ఆవేశం గ్రహించి భగత్‌సింగ్ అని పేరు పెడతాడు. తన తండ్రిని ఉస్తాద్ అని పిలిచేవారని తన పూర్తి పేరును ఉస్తాద్ భగత్‌సింగ్ అని చెప్పుకొంటాడు ఆ కుర్రాడు. ఆ తర్వాత సేవాగుణం ఉన్న మాస్టారు రాజకీయాల్లోకి అడుగుపెట్టి ముఖ్యమంత్రి అవుతారు. చిన్నప్పటి ఉస్తాద్ భగత్‌సింగ్ పెద్దయ్యాక ఏసీపీ (పవన్‌కల్యాణ్) అవుతాడు. ముఖ్యమంత్రి అయిన తన గురువుకు ఎప్పుడూ రక్షణగా ఉంటుంటాడు. అయితే అసాంఘిక శక్తులతో సంబంధాలున్న చెదలమర్రి నల్లనాగప్ప (పార్తిబన్) ముఖ్యమంత్రి పీఠంపై కన్నేస్తాడు. చంద్రశేఖర్‌రావుని అంతం చేయాలని పథకం రచిస్తాడు. మరి నల్లనాగప్పని ఏసీపీ ఉస్తాద్ భగత్‌సింగ్ ఎలా ఎదుర్కొన్నాడు? ఉస్తాద్ జీవితంలోకి వచ్చిన లీల (శ్రీలీల), శ్లోక (రాశీఖన్నా) ఎవరు అన్నది చిత్ర కథ.



## జననాయగన్' లీక్ వ్యవస్థలో లోపం

### నటుడు కమలహాసన్ ఆవేదన

ప్రస్తుతం ఇండస్ట్రీలో 'జననాయగన్' లీక్ తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దీనిపై అగ్రహీరోలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విడుదల కూడా కాకముందే సినిమా లీక్ కావడంతో అటు దర్శకనిర్మాతలు కూడా షాక్ అయ్యారు. వెంటనే పైరసీని ఆన్‌లైన్ నుంచి తొలగించాలని లేకుంటే కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. లీక్ అయిన సన్నివేశాలను షేర్ చేయడం కూడా చట్టపరమైన నేరమేనని ఎవరూ షేర్ చేయొద్దంటూ అభిమానులకు విజ్ఞప్తి చేశారు. ఇండస్ట్రీలోని ప్రముఖులు దీనిపై వరుస పోస్ట్‌లు పెడుతున్నారు. సినిమా దురదృష్టవశాత్తూ లీక్ కావడం తననెంతో ఆందోళనకు గురి చేసిందని చిరంజీవి ఆందోళన వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో స్టార్ హీరో కమల్‌హాసన్ పోస్ట్ వైరల్‌గా మారింది. సెన్సార్ జాప్యం వల్లే సినిమా లీక్ అయిందని ఆవేదన వ్యక్తంచేశారు. 'జననాయగన్ సినిమా లీక్ అవడం అనుకోకుండా జరిగిన విషయం కాదు. ఇది వ్యవస్థ వైఫల్య ఫలితం. దీని పనులు సకాలంలో జరిగిఉంటే ఈరోజు ఈ పరిస్థితి వచ్చేది కాదు. సెన్సార్‌బోర్డులో జరిగిన విపరీతమైన జాప్యం పైరసీకి అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించింది. పైరసీ రాజకీయాలకు అతీతమైనది. అది కళపై, కళాకారుడి పైన చేసే దాడి. వందలాది మంది కళాకారులు, సాంకేతిక నిపుణుల కృషిని ప్రమాదంలో పడేస్తుంది. అలాగే మనం ప్రేమించే సినిమాను నిలబెడుతున్న వాళ్లపై, నిజాయతీగా పన్ను చెల్లిస్తున్న నిర్మాతలు, థియేటర్ యజమానులపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. వ్యవస్థ విఫలమైనప్పుడు సినిమాను ఎవరు కాపాడతారు? విడుదల విషయంలో చట్టపరమైన ఇబ్బందులు ఎదురైనప్పుడు విచారణ వేగవంతం చేయాలి. గతంలో మీరు నాకు అండగా నిలిచినట్లే, నిజమైన సినిమా ప్రేమికులు ఇప్పుడు కూడా ఏకమవ్వండి. ఈ చిత్రాన్ని థియేటర్లలోనే చూద్దాం. దానికి సహకరించండి' అని కమల్ హాసన్ అన్నారు. 'సినిమా లీక్ అయిందని తెలిసి షాక్ అయ్యాను. చాలా బాధగా ఉంది. దీనికి కారణమైన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలి' అని రజనీకాంత్ ఆవేదన వ్యక్తంచేశారు.




Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor,
MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published
at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell :
7989575563, Mail:thecrimenews123@gmail.com